PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 312 | విజయవాడ, మంగళవారం 13 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 13 June 2023 | Rs

అన్నీ తానే... అంతా తానే

- రెజ్లింగ్ ఫెడరేషన్‌లో బ్రిజ్ ఆధిపత్యం, అరాచక పోకడలు
- రెజ్లర్లు ఆందోళన చేసినా... పట్టించుకోని కేంద్రం

లోపలి పేజీలో..

బడికి పోదాం చలోచలో..

తాడేపల్లి హైస్కూల్‌లో అడ్మిషన్లు రాయించుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రపంచ స్థాయి నైపుణ్యత లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం
- జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీలో సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రపంచ స్థాయిలో నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నాల్గో విడత జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్లను పల్నాడు జిల్లా క్రోసూరులో విద్యార్థులకు పంపిణీ చేశారు. క్రోసూరులో మోడల్ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులతో మమేకమయ్యారు. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. జెవికె కిట్ల నాణ్యత పరిశీలించారు. స్కూలు బ్యాగ్‌ను తగిలించుకుని ఆయన ముందుకు నడిచారు. పాఠ్యపుస్తకాలను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. డిజిటల్ క్లాసును వీక్షించారు. డిజిటల్ క్లాసు స్క్రీన్‌పై విద్యార్థులకు 'ఆల్ ది బెస్టు' అని రాసి సంతకం చేశారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగి వారిని ఆశీర్వదించారు. పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాలను అనుసంధానం చేసే కృష్ణా నదిపై మాదిపాడు-జగ్గయ్యపేట బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విద్యార్థులకు జెవికె కిట్లను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. సభకు హాజరైన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ స్కూళ్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ సాంకేతిక కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు అంతర్జాతీయ చదువులే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందుకోసం 52 మంది ఉపాధ్యాయులకు అమెరికాలో శిక్షణ ఇప్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుండి పదో తరగతి వరకు చదువుతున్న 43,10,165 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.1,042.53 కోట్ల ఖర్చుతో జెవికె కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికీ రూ.2400 విలువైన కిట్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో బోధన విలువలు పెంచేందుకు ఎ-1 సాధనాలు, మెషిన్ లెర్నింగ్ విధానాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో బోధన స్థాయి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది మీ జగనన్న పుట్టిన రోజునే (డిసెంబర్ 21న) 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ అందిస్తామన్నారు. కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడేలా, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో ప్రతి స్కూల్లో ఇంగ్లీష్ మీడియంతో సిబిఎస్ఇ బోధిస్తామన్నారు. 'మనబడి, నాడు-నేడు' తొలి దశ స్కూళ్లలో ఆరు నుంచి 10వ తరగతి వరకు 30 వేల తరగతి గదుల్లో బైజూస్ కంటెంట్‌తో కూడిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన చేపట్టనున్నామని, ఇంగ్లీష్ లాబ్స్‌తోపాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతి స్కూల్లో పది వేల స్మార్ట్ టివిల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సభలో మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, విడదల రజనీ, ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, అయోధ్య రామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జెవికె కిట్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్

బిజెపి అండలేకున్నా పేదల మద్దతుతో మళ్లీ గెలుస్తాం

వచ్చే ఎన్నికల్లో తనకు బిజెపి అండ ఉండకపోవచ్చుని, కానీ పేదల అండదండలు ఉన్నాయని సిఎం జగన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై జెపి నడ్డా, అమిత్ షా విమర్శల నేపథ్యంలో టిడిపికి బిజెపి దగ్గరవుతోందన్న సంకేతాలతో సిఎం జగన్ క్రోసూరు సభలో క్లుప్తంగా బిజెపి గురించి ప్రస్తావించారు. చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పేద విద్యార్థుల చేతుల్లో ట్యాబులు కనిపిస్తే ఓర్వలేని బుద్ధి చంద్రబాబుదని అన్నారు. రాయలసీమ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్లు అంటూ ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు పూనుకున్నారని దుయ్యబట్టారు. తమది సంక్షేమ రాజ్యమని, చంద్రబాబుది ఓట్ల రాజకీయమని పేర్కొన్నారు.

పోలవరం పోరుకేక పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంతెన సీతారామ్, వి శ్రీనివాసరావు, వి వెంకటేశ్వర్లు

పునరావాసం పూర్తయ్యాకే ఏమైనా..!

నిర్వాసితుల సమస్యలపై పోలవరం పోరుకేక

- 20 నుంచి పాదయాత్ర
- పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టులో ముంపుప్రాంతాల ప్రజలకు పునరావాసం పనులను తక్షణం పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం పనుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరంలో లక్షలాది మంది నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం పోరుకేక పేరుతో భారీ పాదయాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న భద్రాచలం దగ్గరున్న ఎటపాక నుంచి మొదలై 15 రోజులపాటు ముంపు ప్రాంతాల్లో కొనసాగి జూలై 4న విజయవాడకు పాదయాత్ర చేరుకుంటుందని తెలిపారు. పోలవరం పోరుకేక పేరుతో రూపొందించిన పోస్టర్‌ను విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్, వి వెంకటేశ్వర్లు సోమవారం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం బాధ్యతారహితంగా మాట్లాడుతోందని విమర్శించారు. ఏ ప్రాజెక్టు పరిధిలోనైనా పునరావాసం పూర్తి చేశాకే ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్లాలనేది అంతర్జాతీయంగా వున్న సూత్రం అయితే పోలవరంలో నిర్వాసితులను గాలికి వదిలేసి ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం లైడార్ సర్వేతో మరో 36 గ్రామాలను అదనంగా చేర్చింది తప్ప పూర్తి స్థాయి ముంపు తేల్చలేకపోయిందని, 2022 జూలైలో వచ్చిన వరదలకు 193 గ్రామాలు ముంపుకు గురయ్యాయని తెలిపారు. చింతూరు, కూనవరం మండలాల్లో మొత్తం ముంపునకు గురైతే కూనవరంలో ఒక గ్రామం మాత్రమే ముంపునకు గురైందని ప్రభుత్వం చెప్పడం అవాస్తవమని అన్నారు. పునరావాసం కోసం ప్రభుత్వం నిర్మించిన గ్రామాలు కూడా ముంపునకు గురయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పునరావాస పనుల్లో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని తెలిపారు. డయాఫ్రంవాల్ డ్యామేజిపై ప్రభుత్వం రాజకీయంగా మాట్లాడటం ఆపి జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల లైడార్ సర్వేను ఆకాశం నుండి కాకుండా నిర్దిష్టంగా 1986, 2022 వరదలను ప్రామాణికంగా తీసుకొని సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులో పునరావాసం

మిగతా 2లో

పొత్తుల కోసం ఎవరి కాళ్లూ పట్టుకోం

- మంత్రి అమర్‌నాథ్

లోపలి పేజీలో..

బెంగాల్‌లో టిఎంసి గూండాల అరాచకం

- పంచాయతీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల నామినేషన్ అడ్డగింత
- దాడులు, పార్టీ కార్యాలయాలు ధ్వంసం
- పలువురికి తీవ్రగాయాలు

లోపలి పేజీలో..

ఫిర్యాదుదారుడిని కొట్టిన ఎస్‌ఐ

- మనస్తాపంతో సదరు వ్యక్తి ఆత్మహత్య..
- ఎస్‌ఐను వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు

అభివృద్ధి క్రమంలో వెనుకబాటు వద్దు

- వారణాసిలో జి 20 సమావేశాన్ని ప్రారంభించిన ప్రధాని

న్యూఢిల్లీ : భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి ప్రపంచంలోని పేద దేశాల్లో అభివృద్ధిని ప్రభావితం చేశాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. వారణాసిలో జి 20 దేశాల అభివృద్ధి మంత్రుల సమావేశాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అందరినీ కలుపుకుని పోయే, న్యాయమైన ప్రయత్నాలను చేయాలని మోడీ పిలుపునిచ్చారు. "మహిళల నేతృత్వంలో" అభివృద్ధి నమూనాను భారత్ అనుసరిస్తోందని అన్నారు. "అభివృద్ధి అనేది ప్రపంచ పేద దేశాలకు కీలకమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి కలిగించిన అంతరాయాలు, ఆటంకాలకు పేదదేశాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఆహార, ఇంధన, ఎరువుల సంక్షోభాలు తలెత్తడం మరో పెద్ద ఎదురు దెబ్బ. ఈ పరిస్థితుల్లో ఏ ఒక్కరూ వెనుకబడి పోకుండా చూడాల్సి వుంది." అని మోడీ వీడియో సందేశంలో పేర్కొన్నారు. డేటా డ్రైవ్ వల్ల ఎదురయ్యే సవాళ్ళను అధిగమించాల్సిందిగా జి 20దేశాలను మోడీ కోరారు. పజలకు శక్తి సామర్థ్యాలను కలిగించడానికి, డేటా అందరికీ అందుబాటులోకి రావడానికి, సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి సాంకేతికత అనేది ఒక సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. భాగస్వామ్య దేశాలతో తన అనుభవాలు పంచుకోవడానికి భారత్ సుముఖంగా వుందన్నారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను జి 20 చేపట్టాలని కోరారు. అనంతరం విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడుతూ, ఆహార సరఫరాలో అంతరాయాలను అధిగమించాల్సిన అవసరం వుందని అన్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనడానికి అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించే 'లాభదాయకమైన వాటినే ఎంచుకోవడమనే' పద్ధతి సమర్ధవంతమైన మార్గం కాదని గుర్తు చేశారు. కోవిడ్‌కు ముందుగానే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పురోగతి మందగించిందని అన్నారు. తదనంతర కాలంలో తలెత్తిన కోవిడ్ మహమ్మారి ఈ పరిస్థితులను మరింత దుర్భరంగా తయారుచేసిందన్నారు. 2030నాటికల్లా సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు గానూ 2016 జనవరి 1వ తేదిన 17 బృహత్తర సామాజిక, ఆర్థిక లక్ష్యాలను ఆమోదించారు. వాటినే ఎస్‌డిజి (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు)గా పేర్కొంటారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సివిల్స్ ఫలితాలతోపాటు ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) ఫలితాలను కూడా విడుదల చేశారు. 2023 సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో 14,624 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మెయిన్స్ పరీక్షను సెప్టెంబర్ 15న నిర్వహించనున్నట్లు తెలిపింది. సీరియల్ నంబర్లు, రోల్ నంబర్లు, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితా యుపిఎస్‌సి వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష కోసం డీటెయిల్డ్ అప్లికేషన్ ఫారం-1 (డిఎఎఫ్-1)లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని యుపిఎస్‌సి తెలిపింది. దీనికి సంబంధించిన గడువు తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రిలిమ్స్ అభ్యర్థులు తమ ఫలితాలను upsc.gov.in వెబ్ సైట్లో చూసుకోవచ్చు. 'మార్క్స్, కటాఫ్ మార్కులు, ప్రిలిమ్స్ 2023 ఆన్సర్ కీ వంటి వాటిని పరీక్షల ప్రక్రియ పూర్తిగా ముగిసిన తరువాత వెల్లడిస్తామని తెలిపింది.

కొవిన్ పోర్టల్ లీక్!

డేటా సురక్షితం : కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొవిన్ పోర్టల్ టెలిగ్రామ్‌లో లీకైంది. కొవిడ్ -19 వ్యాక్సిన్ డోస్‌లను పొందేందుకు కేంద్రప్రభుత్వం ఈ పోర్టల్‌లో దేశ ప్రజల సమాచారాన్ని నిక్షిప్తం చేసింది. ఈ పోర్టల్‌లో సమాచారం లీక్ కావడంతో ప్రజల ఆధార్ కార్డ్ నెంబర్, పాన్ కార్డ్ సమాచారం, పాస్‌పోర్ట్ నెంబర్ సహా పుట్టిన తేదీ, వ్యాక్సిన్ పొందిన ప్రాంతం తదితర సమాచారం మొత్తం లీకైనట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ ఎన్ని డోసులు తీసుకున్నారన్న సమాచారంతో పాటు ఫోన్ నెంబర్లు కూడా లీకయ్యాయి. ఫోన్ నెంబర్‌కు బదులుగా ఆధార్ నెంబర్‌ను నమోదు చేసినప్పటికీ ఈ వివరాలు మొత్తాన్ని పొందవచ్చని మొదటగా మలయాళ వెబ్‌సైట్ ది ఫోర్త్ న్యూస్ నివేదించింది. ఎవరు యాక్సెస్ చేసినా సమాచారం అందుబాటులోకి వచ్చే విధంగా ఉంది.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్, కేంద్ర సహాయ మంత్రి మీనాక్షి లేఖి, కాంగ్రెస్ నేతలు కెసి. వేణుగోపాల్, జైరాం రమేష్, పి. చిదంబరం, టిఎంసి నేత డెరెక్ ఒ బ్రెయిన్, ఇండియా టుడే జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయి, మోజో స్టోరీకి చెందిన బర్ఖా దత్ వివరాలు కూడా లీకైనట్లు తెలుస్తోంది. రాజేష్ భూషణ్ నెంబర్‌ను నమోదు చేసినప్పుడు ఉత్తరాఖండ్‌లోని కోటి ద్వార్ ఎమ్మెల్యే అయిన ఆయన భార్య రీతూ ఖండూరీ వ్యక్తిగత వివరాలతోపాటు ఆధార్ నెంబర్, పుట్టిన తేదీ, చివరి నాలుగు అక్షరాలతోసహా వివరాలు వెల్లడయ్యాయి. సరిగ్గా రెండేళ్ల క్రితం 2021 జూన్ 12న కొవిన్ పోర్టల్‌ను హ్యాక్ చేసి, 15 కోట్ల మంది డేటాబేస్‌ను విక్రయించినట్లు నివేదికలు వెల్లడైనప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. అయినప్పటికీ ఆరోపణలపై సమాచార

మిగతా 2లో

వ్యక్తిగత డేటా లీకేజీపై విచారణ జరపాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

లోపలి పేజీలో..

ఆతుకూరి దుర్గ

రేలంగి లక్ష్మి

మిద్దె సత్యనారాయణ

మిద్దె రవితేజ

మిద్దే అరుణ

లారీని ఢీకొన్న కారు ఏడుగురు దుర్మరణం

- మృతుల్లో 8 ఏళ్ల బాలుడు

ప్రజాశక్తి- నల్లజర్ల (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మణం చెందారు. వారిలో ఎనిమిదేళ్ల బాలుడు ఉన్నాడు. పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిద్దే సత్యనారాయణ (46), ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం ఎనిమిది మంది కారులో హైదరాబాద్‌లో వివాహానికి వెళ్లారు. ఆదివారం రాత్రి అదే కారులో తిరుగు పయనమయ్యారు. వీరి కారు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి శివారు వంతెనపైకి వచ్చే సరికి ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మిద్దె సత్యనారాయణ, ఆయన కుమారుడు రవితేజ (20), కొవ్వూరు రూరల్ ఎల్ అండ్ డి పేటకు చెందిన మిద్దే శ్రావణి (28), ఆమె కుమారుడు లోహిత్ గగన్ (8), ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన మిద్దే అరుణ (26), చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన రేలంగి లక్ష్మి (50) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మిద్దె సత్యనారాయణ పెద్ద కుమారుడు సాయిని, చాగల్లు మండలం మీనానగరం గ్రామానికి చెందిన ఆతుకూరి దుర్గ (50)ను స్థానికులు కొవ్వూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో దుర్గ మరణించారు. సాయి పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు డిఎస్‌పి వర్మ పరిశీలించారు. సాంకేతిక లోపం కారణంగా వంతెనపై లారీ ఆగిపోయిందని తెలిపారు. కారు అతివేగంగా వచ్చి ఈ లారీని ఢీకొనడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం

- ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి
- పాదయాత్రగా సిపిఎల్‌ఎ కార్యాలయానికి రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతుల రక్షణకు ప్రస్తుతం ఉన్న చట్టాన్ని ప్రభుత్వం సవరించి సమగ్ర చట్టం తీసుకురావాలని, వ్యవసాయాన్ని ఉద్ధరించాలంటే కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జాతా ముగింపు సందర్భంగా విజయవాడలోని సీతమ్మవారి పాదాల వద్ద మీడియాతో మాట్లాడారు. మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయం వద్ద జాయింట్ సెక్రటరీ (లాండ్స్) ఎన్.ప్రభాకర్‌రెడ్డిని కలిసి సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతుల కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల కాకినాడ జిల్లాల్లో నలుగురు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, సరాసరిన ఏడాదికి 400 నుంచి 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, వీరిలో 80 శాతం మంది కౌలు రైతులేనన్నారు. పంటలు పండిస్తుంది కూడా కౌలు రైతులేనన్నారు. కౌలు రైతులకు అనుకూలంగా ప్రభుత్వం చట్టసవరణ చేయకపోతే రాబోవు రోజుల్లో బలమైన కౌలు రైతు ఉద్యమం చేపడుతుందన్నారు. 2019లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులకు ఉపయోగపడేందుకు చట్టసవరణ చేస్తున్నామని చెప్పారని, ఆచరణలో కౌలు రైతులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఈ చట్ట సవరణ భూ యజమానులకు మాత్రమే ఉపయోగపడుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే చట్ట సవరణను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కౌలు రైతుల తరపున తాము పోరాటం చేస్తున్నామన్నారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రైతులనుద్దేశించి సిసిఎల్‌ఎ జాయింట్ సెక్రటరీ ల్యాండ్స్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతు సంఘం తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి

మిగతా 2లో

ప్రకాశం బ్యారేజీపై కౌలు రైతుల రక్షణకై పోరుబాట యాత్రలో పాల్గొన్న నాయకులు, కౌలు రైతులు

చించినాడ ఉద్యమ నాయకులు లక్ష్మమ్మ కన్నుమూత

ప్రజాశక్తి- యలమంచిలి (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామ ఉద్యమ నాయకులు విప్పర్తి లక్ష్మమ్మ (94) సోమవారం కన్నుమూశారు. వయోభారంతో అనారోగ్యానికి గురై పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. 1977-1980 మధ్య కాలంలో చించినాడ గ్రామంలో భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన పోరాటంలో లక్ష్మమ్మ తన భర్త పెదవెంకన్నతో కలిసి భూస్వాములకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఆ సమయంలో ఆమెపై రెండు కేసులు నమోదయ్యాయి. లక్ష్మమ్మ భౌతికకాయాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. లక్ష్మమ్మ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తదితరులు సంతాపం తెలిపారు. అశ్రునయనాల మధ్య లక్ష్మమ్మ అంత్యక్రియలను కుటుంబసభ్యులు నిర్వహించారు.

ఐదేళ్ల నిబంధన తొలగించండి

- ఆరోగ్య మిత్రలను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చండి
- పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి
- సిఎం జగన్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులను పర్మినెంట్ చేసే విషయంలో ఐదేళ్ల సర్వీసు నిబంధన తొలగించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సోమవారం సిఎం జగన్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 2014 జూన్ 2 నాటికి పని చేస్తున్న అందరినీ రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరు వచ్చిన ముఖ్యమంత్రిని లక్ష్మణరావు కలిసి పలు అంశాలపై వినతిపత్రాలు ఇచ్చి చర్చించారు. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారినే పర్మినెంట్ చేయాలన్న నిబంధన వల్ల నాలుగు వేల మంది నష్టపోయే ప్రమాదం ఉందని, ఇందులో 2,400 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. నాలుగు గురుకులాలలో పని చేస్తున్న సుమారు 1100 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ పరిధిలోకి తేవాలని కోరారు. 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు 4072 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన 2600 మందికీ పోస్టింగ్‌లు ఎంటిఎస్ కాంట్రాక్టు పద్ధతిలో ఇవ్వాలని కోరారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్టులో 16 ఏళ్లుగా పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను కాంట్రాక్టు పద్ధతిలోకి తెచ్చి హెచ్ఆర్ పాలసీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- సిఐడి చీఫ్ ఎన్ సంజయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలబాలికల బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసే బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిఐడి చీఫ్ ఎన్ సంజయ్ పేర్కొన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో సోమవారం మంగళగిరిలోని సిఐడి ప్రధాన కార్యాలయంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ముద్రించిన పోస్టర్‌ను ఆయన సిఐడి ఎస్‌పి కెజివి సరిత, కార్మిక శాఖ డిప్యూటి కమిషనర్ ఎ గణేషన్, చైల్డ్‌రైట్స్ ఆడ్వకసీ ఫౌండేషన్ ప్రతినిధి తిరుపతిరావు తదితరులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ సంజయ్ మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వేచ్ఛా కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గత నెలలో 289 బాలురు, 37మంది బాలికలకు విముక్తి కల్పించామని తెలిపారు. ఈ నెలలో కూడా స్వేచ్ఛా కార్యక్రమంలో బాలకార్మికులకు విముక్తి కల్పించే చర్యలను చేపట్టాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆ వ్యవస్థపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బడికి పోదాం.. చలో.. చలో...

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంతవరకూ ఆట. పాటలతో గడిపి సెలవులను ఆస్వాదించిన విద్యార్థులు సోమవారం నుంచి బడి బాటపట్టారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఈ నెల 17వ తేదీ వరకూ ఉదయం 7.30 నుంచి 11.30 వరకే మాత్రమే క్లాసుల నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, వడగాల్పులు తీయడంతో క్లాసులు పూర్తయిన తర్వాత ఇంటికి చేరుకోవడానికి విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పాఠశాలల పున:ప్రారంభం కావడంతో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల కోలాహలం నెలకొంది.

బిజెపి పాలనలో తిరోగమనంలో అభివృద్ధి

- కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థిక వృద్ధి తిరోగమనంలోకి పోయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన బహిరంగ సభలలో అమిత్‌షా, జెపి నడ్డాలు అన్నీ అబద్దాలు ప్రచారం చేశారని విమర్శించారు. సోమవారం విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో జవహర్‌లాల్ నెహ్రూ నుండి డాక్టర్ మన్మోహన్ సింగ్ వరకు 67 ఏళ్లలో రూ 55 లక్షల కోట్లు అప్పు చేస్తే, మోడీ హయాంలోనే తొమ్మిదేళ్లలో రూ.155 లక్షల కోట్లకు చేర్చారని విమర్శించారు. దేశం కోసం చేసిన అప్పులను కేవలం 27మంది గుజరాతీ మిత్రుల కోసం మోడీ ఖర్చుచేశారని అన్నారు. నిరుద్యోగిత రేటు ప్రపంచంలోనే దేశంలో ఎక్కువగా వుందని తెలిపారు. రాష్ట్రానికి విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించకుండా రాష్ట్రంలో బహిరంగ సభలు పెట్టుకోవడం బిజెపికి తగదని అన్నారు. విశాఖలో జరిగిన బహిరంగసభలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అమిత్‌షా చేసిన అవినీతి ఆరోపణలు చిత్తశుద్ధిలేనివని అన్నారు. అమిత్‌షాకు చిత్తశుద్ధి వుంటే ఈ పాటికి అవినాష్‌రెడ్డి అరెస్ట్ అయ్యేవారని తెలిపారు.

మంత్రి గుమ్మనూరు జయరాం నియోజకవర్గంలో రోడ్లు వేయండి

- సిఎంకు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లాలోని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు నియోజకవర్గంలో రోడ్లను వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కె రామకృష్ణ సోమవారం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారు. ఆలూరు నియోజకవర్గంలో రోడ్లు అన్నీ దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో రోడ్లు సరిగా లేవని ఆర్‌టిసి బస్సు సర్వీసులను రద్దు చేశారని పేర్కొన్నారు. ఆర్‌టిసి బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణం రోడ్లను వేయాలని విజ్ఞప్తి చేశారు.

బిజెపి అబద్ధాలకు కాలం చెల్లింది

- దేశంలో ఎక్కడైనా కర్ణాటక ఫలితాలే
- మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతున్న అబద్దాలకు కాలం చెల్లిందని, వారి మాటలను ప్రజలు విశ్వసించడం లేదని కర్నాటక ఎన్నికల ఫలితాలు నిరూపించాయని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హత్యలు, దోచుకోవడం, జైలు, బెయిలు చుట్టూ తిరుగుతూ రాష్ట్ర ప్రజలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం 9ఏళ్ల వార్షికోత్సవం పేరుతో జరిగిన బహిరంగసభల్లో అమిత్‌షా, జెపి నడ్డా అన్నీ అబద్దాలు చెప్పి పోయారని అన్నారు. తొమ్మిదేళ్లలో దేశాన్ని నాశనం చేశారని ఇటీవల ఒడిశాలో జరిగిన రైల్వే ట్రిపుల్ ప్రమాదం నిరూపించందని తెలిపారు. రైల్వేలో 3లక్షల ఖాళీలను భర్తీ చేయకుండా అవుట్ సోర్సింగ్ వారితో పనిచేయించుకోవడం, రైల్వేను ప్రైవేటీకరణ చేయడంతో ఈ ప్రమాధం చోటు చేసుకుందన్నారు. దేశంలో నిరుద్యోగం, నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని అన్నారు. కిలో బియ్యం రూ.60లకు చేరుకుందని పేద ప్రజలు ఈ ధరలతో ఎలా మూడు పూటలు తింటారని ప్రశ్నించారు. సాధారణ ప్రజలకు లక్ష రూపాయల రుణం ఇచ్చేందుకు ఇబ్బందిపెట్టే బ్యాంకులు మోడీ మిత్రునికి మాత్రం ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.12 లక్షల రుణం ఇచ్చిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బటన్ నొక్కుడు పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. చంద్రబాబు తొందరబాబునాయుడిలా మారి బిజెపి పంచన చేరారని విమర్శించారు. రాష్ట్రంలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి లాంటి నేతలు నింపిన చైతన్యంతో బిజెపికి అవకాశం ఎన్నటికీ రాదన్నారు. అందుకే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను బిటీమ్‌గా చేసుకుందని విమర్శించారు.

వేతనాల చెల్లింపుల్లో అలసత్వాన్ని నిరసిస్తూ
మంత్రి చెల్లుబోయిన పేషీకి తాళం

- గతేడాది నవంబరు నుంచి జీతాలు రాలేదంటున్న ఉద్యోగులు



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఛాంబర్‌కు తాళం వేసిన సిబ్బంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గతేడాది నవంబరు నుంచి జీతాలు రాలేదంటూ ఏకంగా రాష్ట్ర సమాచార, సినియాటోగ్రఫీ, బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఛాంబర్‌కు సిబ్బంది తాళాలు వేశారు. విధులకు గైర్హాజ రయ్యారు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో మంత్రి పేషీకి తాళం వేశారని మీడియాలో రావడంతో ప్రభుత్వం వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టింది.

అప్రమత్తమైంది

మంత్రి పేషీలో పనిచేస్తున్న ముగ్గురు అటెండర్లలో ఇద్దరు వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉండటం, మిగిలిన ఒక్క అటెండర్ డ్యూటీకి వచ్చే సమయం ఆలస్యం జరగడంతో పేషీ ఆలస్యంగా తెరవడం జరిగిన మాట వాస్తవమని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. రోజు మాదిరిగానే సోమవారం కూడా పేషీలో ఒఎస్‌డి,పిఆర్‌ఓ, అటెండర్లు తమ విధిలో ఉంటూ పేషీకి వచ్చే వారి నుంచి అభ్యర్థనలు, అర్జీలను తీసుకున్నారని తెలిపారు. జీత భత్యాల విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేవని, కొన్ని ఛానెల్స్ ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నంలో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని , ఈవార్తలను మంత్రి పేషీ ఖండించింది.

సహకార రంగాన్ని పరిరక్షించుకోవాలి

- 19న డిసిసిబిలు, జులై 3న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ సహకార సంఘాల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నాయకులు పి సత్యనారాయణ, టి వెంకట్రామయ్య, పి హరినాథ్‌రెడ్డి, ఎన్ నాగేశ్వరరావు. పి వెంకటరెడ్డి ఎం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ సహకార సొసైటీలను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం తగదని అన్నారు. పిఎసిఎస్‌లలో 50శాతం వాటాను ప్రైవేట్ వారికి ఇవ్వడం వల్ల క్రమేణా సొసైటీలు వ్యవసాయరంగానికి దూరమయ్యే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. సహకార రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2019 నుండి వేతన సవరణ జరగాల్సి వున్నా పట్టించుకోవడం లేదన్నారు. సహకార రంగాన్ని పరిరక్షించుకోవడం, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న రాష్ట్రంలోని అన్ని డిసిసిబిల ముందు ధర్నాలను చేయాలని అన్నారు. జులై 3న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలను చేయాలన్నారు. జులై 17న చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు.

జగన్ కేసుల విచారణ త్వరగా పూర్తయ్యేలా ఆదేశించండి

- హైకోర్టులో మాజీ ఎంపి హరిరామజోగయ్య పిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపే ఎపి సిఎం జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులను తేల్చేలా సిబిఐ కోర్టుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టును మాజీ ఎంపి చేగొండి హరిరామజోగయ్య కోరారు. ఈ మేరకు ఆయన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. వ్యక్తిగత కేసుల వ్యవహారంలో పిల్ దాఖలు చేయడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. అభ్యంతరాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని సోమవారం సిజె ధర్మాసనం ముందుంచారు. రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాం నేతృత్వంలోని ధర్మాసనం వాదనలు వినింది. రెండు వారాల గడువిస్తే పిల్ విచారణార్హతపై వాదనలు వినిపిస్తామని న్యాయవాది కోర్టు తెలిపారు. తదుపరి విచారణ జులై 6కి వాయిదా పడింది.

క్రిమినల్ కేసు ఉండగా ఉద్యోగి ప్రమోషన్‌కు అర్హుడు కాదు : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

క్రిమినల్ కేసు విచారణలో ఉన్న ఉద్యోగి పదోన్నతికి అనర్హుడని, ఆ కేసు నుంచి బయటపడిన తర్వాతే పదోన్నతికి అర్హుడని హైకోర్టు తీర్పు చెప్పింది. క్రిమినల్ కేసులో కింది కోర్టు విచారణపై హైకోర్టు స్టే విధించినంతమాత్రాన ఆ కేసు నుంచి బయపడినట్లు కాదని తేల్చి చెప్పింది. చార్జిషీట్ దాఖలైతే ప్రమోషన్ ఇవ్వడాన్ని వాయిదా వేయవచ్చునని 1991లో వెలువడిన జీవో 66 స్పష్టం చేస్తోందని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు చెప్పారు.

కర్నూలుకు చెందిన నాగరాణి కారుణ్య నియామకం కింద 1996లో ఎపిఎస్‌పి కర్నూలు రెండో బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా తాత్కాలిక ప్రాతిపదికన నియమితులయ్యారు. 2001లో బిఏ డిగ్రీ సర్టిఫికేట్లను సమర్పించి సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని ఆమె కోరారు. విచారణలో ఆ సర్టిఫికెట్ నకిలీదని అంబేద్కర్ యూనివర్సిటీ తేల్చింది.

సస్పెన్షన్‌కు గురైన ఆమెకు ఏడాదిపాటు శాఖాపరమైన శిక్ష కింద ఏడాది పాటు ఇంక్రిమెంట్‌ను వాయిదా వేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్ ఎత్తివేశాక ఆమెపై అభియోగాలను నమోదు చేశారు. ఈ కేసులో కర్నూలు స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు, నాగరాణిని దోషిగా తేల్చి. మూడు నెలల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించింది. దీనిని కర్నూలు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కోర్టు 2008లో రద్దు చేసింది. ఆమెపై తిరిగి అభియోగాలను నమోదు చేసి ఆపై ఆమె వాదనలు వినాలని చెప్పింది. దీనిపై ఆమె 2009లో హైకోర్టులో రివిజన్ పిటిషన్ వేయగా, కర్నూలు స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణను నిలుపుజేస్తూ స్టే ఇచ్చింది. కోర్టు కేసు కారణంగా చూపించి తనకు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి ఇవ్వడం లేదంటూ ఆమె చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 1991లోని జీవోకు విరుద్ధంగా ఆమె పదోన్నతి కోరడం చెల్లదన్న ప్రభుత్వ వాదనను హైకోర్టు సమర్ధించింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్లు

- షెడ్యూల్ విడుదల చేసిన ఎపి స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2023-24 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రాసెస్‌ను ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (హయ్యర్ ఎడ్యుకేషన్) పేర్కొంది. ఈ మేరకు హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొఫెసరు వై. నజీర్ అహమ్మద్ సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ల కోసం ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్లు ప్రాసెస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం 18.06.23న నోటిఫికేషన్ విడుదల, 19నుంచి 24వరకు విద్యార్థుల నమోదు, 21 నుంచి 23 వరకు ప్రత్యేక కేటగిరి ధ్రువీకరణ, 26నుంచి ప్రత్యేక వెబ్ ద్వారా ఎంపిక 26నుంచి 30వరకు, జులై 3న విద్యార్థులను కళాశాలలకు కేటాయించడం, జులై 4న తరగతుల ప్రారంభం ఉంటాయని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల, విశాఖలోని డాక్టర్ విఎస్ కృష్ణ కళాశాల, తిరుపతిలో ఎస్‌వి విశ్వవిద్యాలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. వికలాం గులు, / సిఏపి/ ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్/ఎన్‌సిసి/ గేమ్స్, స్పోర్ట్స్, కేటగిరీల కింద రిజర్వేషన్‌ను క్లెయిమ్ చేసే అభ్యర్థులు డిపార్టుమెంటల్ డేటా ద్వారా ఆన్‌లైన్ వెబ్ సర్వీస్ ద్వారా సర్టిఫికెట్‌లు ధ్రువీకరించబడని అభ్యర్థుల ఆప్షన్‌లను అమలు చేయడానికి ముందు హెచ్‌ఎల్‌సిల్లో ఏదైనా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్‌లను https//cets. apsche.ap.gov.in/ apsche home. Aspx ద్వారా దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొవిన్ పోర్టల్ లీక్!

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కంప్యూటర్ హ్యాకింగ్ గ్రూప్‌పైన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌తో దర్యాప్తుకు ఆదేశించింది. ఈ దర్యాప్తు వివరాలు ఇంకా పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు.

దర్యాప్తు చేస్తున్నాం : కేంద్రం : డేటా లీక్ వార్తలను దర్యాప్తు చేస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి)ని కేంద్రం కోరింది. డేటా లీక్ వార్తలను కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ఖండించింది. 'ఇవన్నీ నిరాధార వార్తలు. కోవిన్ పోర్టల్‌ను అన్ని భద్రతా ప్రమాణాలతో రూపొందించాం. ఒటిపి అథెంటికేషన్‌తో మాత్రమే ఇందులోని డేటాను చూడగలం' అని పేర్కొంది. ఒటిపి లేకుండా కొవిన్ పోర్టల్‌లోని సమాచారాన్ని ఏ బాట్‌లోనూ షేర్ చేయలేమని తెలిపింది.

చార్జిమెమోపై పదేళ్లకు షోకాజ్ నోటీసా?

- కొట్టేసిన హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోడంపై తీవ్ర జాప్యం చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది.2005లో చార్జిమెమో ఇచ్చి, 2015లో చర్యలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఆక్షేపించింది. ఉద్యోగి రిటైర్ అయ్యాక షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తీరిగ్గా చర్యలు తీసుకోడానికి వీల్లేదని సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన గైడ్‌లైన్స్‌ను అది గుర్తు చేసింది. ఉన్నతాధికారి వివరణ కోసం లెటర్ రాశామని, ఇందుకు 5 ఏళ్ల సమయం పట్టిందని అధికారులు చెప్పిన జవాబును తోసిపుచ్చింది. 2005లో ఒక ఉద్యోగికి అధికారులు జారీ చేసిన చార్జిమెమోను, 2015లో జారీ చేసిన షోకాజ్ నోటీసును రద్దు చేస్తూ జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వి. గోపాలకష్ణారావు ధర్మాసనం తీర్పు చెప్పింది.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేవీవీ సత్యనారాయణమూర్తి వ్యవసాయశాఖాధికారి. అరకులో అటవీశాఖలో డిప్యుటేషన్‌పై అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా ఆయన విధుల్లో అలసత్వం వహించారంటూ 2005లో చార్జిమెమో ఇచ్చారు. దీనిపై అధికారులు 2010లో విచారణను ముగించారు. నిధులు దుర్వినియోగం కాలేదని తేల్చారు. విచారణ పూర్తికాక మునుపే 2008 డిసెంబర్ 12న సత్యనారాయణ మూర్తి పదవీ విరమణ చేశారు. 2010లో విచారణ పూర్తి చేసిన తర్వాత చర్యలు తీసుకోకండా 2015లో పెనాల్టీ ఎందుకు విధించకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపై 2013లో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)ను ఆశ్రయించగా ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ వ్యవసాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ హైకోర్టులో 2017లో పిటిషన్ వేశారు. దీనిని హైకోర్టు డివిజన్‌బెంచ్ కొట్టేస్తూ పైవిధంగా తీర్పు వెలువరించింది.

పోషకాలు కలిగిన వంగడాలను రూపొందించండి

- డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యవసాయ ఉత్పత్తుల్లో ఐరన్, జింక్, విటమిన్లు, ప్రొటీన్ల శాతం ఎక్కువగా ఉండేలా వంగడాలను రూపొందించాలని ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్స్ వెరయిటీస్ చైర్‌పర్సన్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర అన్నారు. దేశంలో ఆహార ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నా ఇప్పటికీ పిల్లలు, పెద్దలతో పౌష్టికాహార లోపంతో బాధపడుతుండడం దారుణమని తెలిపారు. గుంటూరు జిల్లా లాంలోని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవం వర్సిటీ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మహాపాత్ర పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో 35 మిలియన్ టన్నుల పంచదార ఉత్పత్తి జరుగుతోందని, చెరుకు నుంచి తీస్తున్న 20 శాతం ఇథనాల్ పెట్రోలుకు బదులుగా వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల వ్యవసాయ రంగాన్ని ఎనర్జి సోర్సుగా కూడా పరిగణిచాలన్నారు. ఆహార ఉత్పత్తి దేశంలో పోషకాహార లోపాలను తగ్గించే దిశగా ఉండాలని సూచించారు. న్యూట్రీ స్మార్టు విలేజెస్ కాన్సెప్టును ప్రోత్సహించాలని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ఐరన్, జింక్, విటమిన్లు, ప్రొటీన్ల శాతం ఎక్కువగా ఉండేలా వంగడాలను రూపొందించాలని సూచించారు. వైస్ ఛాన్సలర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధనలు, రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు సూచనలు అందించడం తదితర అంశాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఇప్పటికే పురుగుమందుల పిచికారి కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. పంటలపై వస్తున్న చీడపీడల నివారణకు తగిన చర్యలపై అధ్యయనం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాంట్లకు కేంద్రం తూట్లు

- 2022-23లో వచ్చింది 36,068 కోట్లే
- అంచనా మాత్రం 56 వేల కోట్లు
- విడుదల్లో మూడేళ్లుగా ఇదే పరిస్థితి
- లెక్కలు చెబుతున్న కాగ్ నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లలో కేంత్రం కోతల వైఖరే అవలంభిస్తోంది. బడ్జెట్ అంచనాలకు, కేంద్రం నుంచి వస్తున్న నిధులకు మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో రాష్ట్రంలో పథకాలు పడకేస్తున్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడం గమనిస్తే ఇకపై కేంద్ర నిధులపై ఎక్కువగా ఆశలు పెంచుకోవడం సరికాదన్న భావాన్ని కూడా రాష్ట్ర అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాగ్ విడుదల చేస్తున్న లెక్కలు కూడా కేంద్ర నిధుల్లో కోతలను స్పష్టం చేస్తున్నాయి. తాజాగా 2022-23లో వచ్చిన కేంద్ర గ్రాంట్లలో కూడా భారీగా కోతలు వెలుగుచూసాయి.

రాష్ట్రాల్లో అమలు చేసే పథకాలకు కేంద్రం కొంత నిధులను సహాయంగా అందిస్తుంది. వీటినే సిఎస్ఎస్ ద్వారా అమలు చేసే పథకాలుగా అంటారు. ఇవే కాకుండా కేవలం ఒక రాష్ట్రంలో అమలు చేసే పథకాలకు కూడా నిధులను కేంద్రం కేటాయిస్తుంది. ఈ పథకాలకు రావాల్సిన నిధులను ముందుగానే అంచనా వేసి రాష్ట్రాలు తమతమ బడ్జెట్‌లో పొందపరచడంతోపాటు ఆ వివరాలను కేంద్రానికి కూడా పంపిస్తారు. ఈ అంచనాల ద్వారానే తమతమ వార్షిక బడ్జెట్‌ను కూడా రాష్ట్రాలు రూపొందించుకుంటాయి. ఇక్కడే అసలు సమస్యలు ప్రారంభమవుతున్నాయి. అంచనాలను తలక్రిందులు చేస్తూ కేంద్రం తన నిధులను తగ్గించడం, భారీగా కోతలు విధించడంతో రాష్ట్రాల బడ్జెట్ లెక్కలు కూడా తప్పుతున్నాయి. ప్రతియేటా పది వేల కోట్ల రూపాయలకన్నా ఎక్కువగానే ఈ కోతలు కనిపిస్తున్నాయి. ఒక్కోసారి 20 వేల కోట్లకుపైగా కోతలు కనిపిస్తుండడంతో పథకాల అమలు కష్టాల్లో పడుతున్నాయి.

గత మూడేళ్లుగా కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోతలను అధ్యయనం చేస్తే 44,263 కోట్లు తగ్గినట్లు తేలింది. రాష్ట్ర ప్రభుత్వ అంచనాలు, కేంద్ర నిధులపై రాష్ట్ర, కాగ్ నివేదికలను పరిశీలిస్తే కోతలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. 2020-21లో అయితే ఏకంగా 22 వేల కోట్లు కోత పడ్డాయి. ఆ తరువాత రెండేళ్లలో కూడా పది వేల కోట్ల కన్నా ఎక్కువగానే కోతలు కనిపించాయి.

విడుదల్లో పక్షపాతం

తనకు అనుకూల రాష్ట్రాలకు అధికంగా గ్రాంట్లు విడుదల చేస్తున్న కేంద్రం ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రం కోతలు అమలు చేస్తున్నట్లు చాలా సంవత్సరాలుగా విమర్శలు వస్తున్నాయి. దీనిపై అనేక రాష్ట్రాల నుంచి కేంద్రంపై ఉద్యమం ప్రారంభమైన ఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ కేంద్ర విధానాల్లో మార్పులు రావడంలేదని, నిధుల్లో కోతలు తగ్గడం లేదని ఆరోపణలు పెరుగుతున్నాయి.

గత మూడేళ్లలో అంచనా, వచ్చిన గ్రాంట్ల వివరాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్‌లో	వచ్చింది
2020-21	53,175	31,872
2021-22	57,930	39,169
2022-23	56,033	36,048
మొత్తం	**1,67,138**	**1,22,875**

పునరావాసం పూర్తయ్యాకే ఏమైనా..!

(మొదటి పేజీ తరువాయి)

పనులు కేంద్రానికి సంబంధం లేదనడం తగదని అన్నారు. పోలవరం పునరావాసం కోసం రూ 32 వేల కోట్లు అవసరం కాగా, కేవలం రూ.7వేల కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలను చెప్పాలని, సందర్శనకు అఖిపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి వచ్చిన అమిత్‌షా పోలవరం ప్రాజెక్టు నిధులపై ఒక్క మాట మాట్లాడకపోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. పోలవరం ప్రాజెక్టులో అసలైన నిర్వాసితుల సమస్యను పక్కదారి పట్టించేలా అధికార, ప్రతిపక్షం రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. కేవలం కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం తగువులాడుతున్నారు తప్ప పునరావాస బాధితులకు న్యాయం చేయాలనే అంశాన్ని పూర్తిగా విస్మరించారని అన్నారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో పునరావాస చర్యలను చేపట్టాలని కోరారు. కేంద్రం ఇపుడు ఇస్తున్న రూ 12వేల కోట్లను పునరావాసం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యను అజెండా చేసేందుకు ఈ పాదయాత్రను చేపట్టామని తెలిపారు. పోలవరం పోరుకేక పాదయాత్ర ముంపు ప్రాంతం అయిన భద్రాచలం దగ్గరలోని ఎటపాక నుండి మొదలై అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం, కృష్ణా జిల్లా మీదుగా విజయవాడలోకి జూలై నాల్గవ తేదీకి చేరుకుంటుందని, ఈ నేపథ్యంలో నిర్వాసితులతో భారీ ధర్నాను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర ప్రారంభం, ముగింపు సభలకు సిపిఎం జాతీయనాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయానికి గురవుతున్న ముంపు గ్రామాల ప్రజల కోసం చేపట్టిన ఈ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని, విధాన పరమైన నిర్ణయాల విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పాదయాత్ర ప్రారంభ సమయంలో విజయవాడలో పలువురు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందన్నారు. రిజర్వు బ్యాంక్ గైడ్‌లైన్స్ ప్రకారం రూ.1.6లక్షల వరకు హామీలేని రుణాలివ్వాలని, కౌలు రైతుందరినీ ఇ-క్రాప్‌లో నమోదు చేసి ఇకెవైసి చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రక్షణ కల్పించి వారి ఆత్మహత్యలను నివారించాలని, సిసిఆర్‌సి అప్లికేషన్స్‌పై భూయజమాని సంతకం లేకుండా కౌలు రైతుల నుంచి అర్జీలు తీసుకుని కార్డులివ్వాలని, దేవాలయ భూములు సాగు చేస్తున్న వారందరికీ సిసిఆర్‌సి కార్డులు, బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంటనష్టం పరిహారం, బీమా ఇవ్వాలని, అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఆలమూరు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపళ్లకు చెందిన ఉపాధి కార్మికుడు గంటా సత్యం (80) ఎప్పటిలాగే ఉపాధి హామీ పనులకు వెళ్లారు. గ్రామ సమీపంలోని పంట కాలువలో పూడికతీత తీస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సత్యం భార్య ఐదేళ్ల క్రితమే మరణించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా రోజువారీ కూలీలు. ఎపిఒ పివివివి.ప్రసాద్, ఉపాధి హామీ చట్టం ఇసి కామత్ రామచంద్రరావు, విఆర్ఒ కుమార్ ఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించారు.

విశాఖలో టిడిపి స్క్రిప్ట్‌ను అమిత్‌షా చదివారు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రహోమ్ శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రంలోని వాస్తవపరిస్థితులను విస్మరించి వైసిపి ప్రభుత్వంపై టిడిపి రాసిచ్చిన స్క్రిప్ట్ విశాఖపట్నంలో చదివారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. విశాఖ పట్నంలో అమిత్‌షా పాల్గొన్న సభావేదికపై పురందేశ్వరి, సిఎం రమేష్, టిజి వెంకటేష్ తదితరులు వున్నారని, వారు చెప్పినట్లే మాట్లాడారు తప్ప సొంత పరిశీలనతో మాట్లాడలేదని అన్నారు. విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అమిత్ షా ఎందుకు మాట్లాడలేదో రాష్ట్ర ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం హయాంలో జరిగిన కుంభకోణాలను విస్మరించారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి ఏ రాష్ట్రంలోనూ అమలు చేయడం లేదనే అంశాన్ని గుర్తించుకోవాలన్నారు. పేదప్రజలకు నేరుగా రూ.2.16 లక్షల కోట్లను అందిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవినీతి ప్రభుత్వమని విమర్శించడం అమిత్‌షా స్థాయికి తగదని అన్నారు. విశాఖలో భూస్కామ్ అని నిరాధార ఆరోపణలు చేయడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే వున్నారని తెలిపారు.

'శ్రీశైలం' మరమ్మతులపై దృష్టి

- తాజా పర్యటనలో కేంద్ర బృందం సూచన
- ఇన్‌ఫ్లో వచ్చే నాటికి పూర్తయ్యేలా చర్యలు


శ్రీశైలం డ్యాం గేట్లకు గ్రీసింగ్ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

శ్రీశైలం ఆనకట్ట మరమ్మతులపై అధికారులు దృష్టి సారించారు. ఇటీవల కృష్ణా, గోదావరి (కెజి) బేసిన్ ఆర్గనైజేషన్‌కు చెందిన ముఖ్య ఇంజనీరు వీరేంద్రశర్మ, డిప్యూటీ డైరెక్టర్‌తోపాటు కేంద్ర బృందం శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించి పలు సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో ఇందుకనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణంగా జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారాల్లో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు చేరడం మొదలవుతుంది. దీనికి ముందే ఆనకట్టకు అవసరమైన మరమ్మతు చర్యలు, వార్షిక నిర్వహణ చేపట్టాలని కేంద్ర బృందం అధికారులకు సూచించింది. దీంతో, ఆనకట్ట గేట్లకు, రోప్స్‌కు గ్రీజింగ్ చేస్తున్నారు. ఆ పని పూర్తి కావచ్చింది.

ఆనకట్ట నుంచి నీటిని విడుదల చేసిన తరువాత బయట వైపున ఏదైనా సీఫేజ్ లీకేజీ ఉందేమో గుర్తించి, లీకేజీ ఉంటే మరమ్మతు చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలుగా ఆనకట్టకు ఒకవైపు నుంచి మరొక వైపునకు రోప్‌వే ఉంటుంది. దాన్ని ఆయిల్‌తో శుభ్రం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటి ఉధృతిని రికార్డు చేసే టెలిమిషన్ మీటర్‌ను పరిశీలించారు.

ప్లంజ్‌పూల్‌కు మరమ్మతులు ఎప్పుడు?

శ్రీశైలం డ్యాముకు ప్రత్యేకించి గేట్ల నుంచి విడుదల చేసే నీరు కిందకు పడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో దిగువన కుడి, ఎడమ గట్ల వైపు భారీగా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణుల కమిటీ గతంలో సూచించింది. డ్యాం గేట్ల నుంచి నీటిని విడుదల చేసినపుడు కిందపడి మళ్లీ ఎగిసిపడే చోట భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయని, అవి క్రమేపీ డ్యాం వైపు విస్తరించే అవకాశం ఉందని ఆ కమిటీ పేర్కొంది. అయితే, దీనికి సంబంధించి ఇప్పటి వరకూ చర్యలు చేపట్టలేదు. డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. గరిష్ట స్థాయి నీటిమట్టం 892 అడుగులు. స్పిల్‌వేకు 12 గేట్లు ఉండగా 13.5 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం వెళ్లేలా డిజైన్ చేశారు. వెయ్యేళ్లలో ఒకసారి గరిష్టంగా ఎంత వరద వచ్చే అవకాశం ఉందన్న దానిపై 2006లో అధ్యయనం చేయగా, 26.5 లక్షల క్యూసెక్కుల వరకూ రావచ్చని అంచనా వేశారు. 2009 అక్టోబరులో 25 లక్షల క్యూసెక్కులకుపైగా వరద వచ్చినట్టు రికార్డయింది. డ్యాం గేట్లుపైన ఫ్రీబోర్డు వరకు నీరు రాగా, నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం అది 896.5 అడుగుల నీటిమట్టంగా ఉంది. ఆ సమయంలోనే డ్యాం భద్రతపై చర్చ జరిగింది. అప్పటి నుంచి పలు ప్రత్యామ్నాయాలపై నిపుణుల కమిటీలు అధ్యయనం చేసినా చర్యలు మాత్రం శూన్యం.

విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

విద్యుత్ భారాలపై ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారం వేస్తున్నాయని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలంటూ రూ.వేల కోట్లు భారాలను ప్రజలపై మోపడం తగదన్నారు. మోడీ ప్రభుత్వం ఆదేశాలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలొగ్గడం సరికాదన్నారు. కరెంట్‌కు బిల్లులే కాకుండా ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీల పేరుతో జనాన్ని ప్రభుత్వాలు పీల్చిపిప్పి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని అదానీ తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందిచకుంటే విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ముస్కిన్, వై.వెంకటనారాయణ, నగర నాయకులు వలీ, ప్రకాష్, మసూద్, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం : టిటిడి జెఇఒ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహార ఆహారం అందించడానికే టిటిడి తన విద్యా సంస్థల్లో స్వయంగా మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహిస్తోందని టిటిడి జెఇఒ సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో సోమవారం ఆమె విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించి, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిటిడి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. డిఇఒ డాక్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా జెఇఒ సదాభార్గవి నేతృత్వంలో టిటిడి విద్యా సంస్థల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. విద్యా సంస్థల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ఎస్‌జిఎస్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, ఎఇఒ ఈశ్వరయ్య, ఎస్‌వి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డెమ్మ, కోదండ రామస్వామి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతిపత్రం స్వీకరిస్తున్న తహశీల్దారు శ్రీధర్

ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలని దీక్ష

ప్రజాశక్తి-విఆర్.పురం, అల్లూరి సీతారామరాజు జిల్లా

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తక్షణమే ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలో ఆ పార్టీ ఎంపిపి కారం లక్ష్మి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. దీక్షనుద్దేశించి సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చినబాబు మాట్లాడుతూ.. గతంలో వరదల కారణంగా నిర్వాసితులు ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ఈ ఏడాది వరదలకైనా ప్రభుత్వం ముందస్తుగా బియ్యం, కిరోసిన్, ఇతర నిత్యావసర సరుకులను సిద్ధం చేయాలని, ఎత్తయిన ప్రదేశాలలో ప్రజలను ఉంచాలని డిమాండ్ చేశారు. పడవలను, వైద్య బృందాలను, అధికారులను బాధితులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఎన్.శ్రీధర్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. పోలవరం నిర్వాసితుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.

పొత్తుల కోసం ఎవరి కాళ్లూ పట్టుకోం

- మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

'వైసిపి, బిజెపిలది ప్రభుత్వాల మధ్య బంధం మాత్రమే, పొత్తుల కోసం మేము ఎవరి కాళ్లూ పట్టుకోం..' అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విశాఖలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర ప్రభుత్వంపైనా, వైసిపి నాయకులపైనా చేసిన విమర్శలపై అమర్‌నాథ్ తీవ్రంగా స్పందించారు. సర్క్యూట్ హౌస్‌లో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైనా, పార్టీ నేతలపైనా అమిత్ షా, నడ్డా విమర్శలు చేస్తుంటే తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. విశాఖ సభలో అమిత్ షా స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతారనుకున్నామని, ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తూ ఏదైనా ప్రకటన చేస్తారని ఈ ప్రాంత ప్రజలందరూ ఎదురు చూశారని, కానీ ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని విమర్శించారు. ప్లాంటును అమ్మకానికి పెట్టిన బిజెపి నేతలు వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. 2021-22లో మధ్యాహ్న భోజన పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే, ఇందులో రూ.400 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్న విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ సభలో అమిత్ షా చుట్టూ కూర్చున్న వారంతా తెలంగాణ బిజెపి నాయకులు మాత్రమేనని, వారు ఇచ్చిన స్క్రిప్టును అమిత్ షా చదివి వినిపించారని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. సొంతంగా పోటీ చేసే బలం లేక చంద్రబాబు పలు పార్టీల పొత్తును కోరుకుంటున్నాడని, ఒడిశా రైలు ప్రమాద ఘటన సమయంలో దేశమంతా శోకసముద్రంలో మునిగి ఉంటే, పొత్తు కోసం చంద్రబాబు అమిత్ షా, నడ్డాలను కలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

'సీమ'లో 'యువగళం' పూర్తి

- 124 రోజులు 44 నియోజకవర్గాల్లో 1587 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర

కడప నగర శివారులో 1500 కిలోమీటర్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- బద్వేలు (వైఎస్ఆర్ జిల్లా)

యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర రాయలసీమలో విజయవంతంగా తన తొలి మజిలీని పూర్తి చేసింది.

పాదయాత్ర సమయంలో ప్రతి నియోజకవర్గంలో వివిధ తరగతుల ప్రజలతో లోకేష్ ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కుప్పం నుంచి ఈ ఏడాది జనవరి 27న ప్రారంభించిన పాదయాత్ర 124 రోజుల పాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1587 కిలోమీటర్ల మేర రాయలసీమలో కొనసాగింది. వైఎస్ఆర్ జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని పిపి కుంట వద్దకు సోమవారం పాదయాత్ర చేరుకోగానే రాయలసీమలో యాత్ర ముగిసినట్లయింది.

రాయలసీమలో 44 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 108 మండలాలు, 943 గ్రామాల మీదుగా యువనేత పాదయాత్ర కొనసాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 45 రోజులు 577 కిలోమీటర్లు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23 రోజులు 303 కిలోమీటర్లు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 రోజులు 507 కిలోమీటర్లు, ఉమ్మడి కడప జిల్లాలో 16 రోజులు 200 కిలోమీటర్ల మేర కొనసాగింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒకటి చొప్పున మొత్తంగా 25 పోలీసు కేసులు నమోదయ్యాయి. లోకేష్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో అన్ని నియోజకవర్గాలనూ పాదయాత్ర కవరు చేసింది. అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రాయలసీమకు తాము ఏం చేయబోతున్నారో చెప్పడానికి 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు, వాటర్ గ్రిడ్ పథకం ద్వారా సీమలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు, మామిడి, బొప్పాయి, దానిమ్మ, చీని, అరటి తదితర పంటలు వేసేందుకు ప్రోత్సాహం, రాయలసీమలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటివి వాటిలో ఉన్నాయి.

భారత్‌లో పన్ను చెల్లింపు శిక్షలాంటిదే

- ప్రయోజనం లేదు
- భారత్ పే మాజీ బాస్ అష్నీర్ గ్రోవర్

న్యూఢిల్లీ : భారత్‌లో పన్ను చెల్లించడం శిక్షలాంటిదని భారత్‌పే మాజీ సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ విమర్శించారు. దేశంలో అమలవుతోన్న పన్ను విధానంలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. విదేశాల్లో ఉపయోగిస్తున్న క్రెడిట్ కార్డులపై గత నెలలో కేంద్ర ప్రభుత్వం విధించిన 20 శాతం పన్ను విధానాన్ని ఆయన తప్పుబట్టారు. మరోవైపు రాజకీయ పార్టీలకు ఇచ్చే డొనేషన్లపై మాత్రం ఎలాంటి పన్ను లేదన్నారు. పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయాల్లో ప్రభుత్వానికి 30-40 శాతం పన్ను చెల్లిస్తున్నారని అన్నారు. పన్ను చెల్లింపుదారులు ఇతరులకు ఉపయోగపడుతున్నారు తప్పా ప్రతిగా వారికంటూ ఎలాంటి ప్రయోజనడం ఉండడం లేదన్నారు. రూ.10 సంపాదిస్తే అందులో రూ.4 ప్రభుత్వానికి పన్నుగా చెల్లిస్తున్నారు. అంటే.. ఏడాదికి 3-5 నెలలు పాటు ప్రభుత్వం కోసం పనిచేస్తున్నారు. అయినా ఎంతకాలం ఇలా ప్రభుత్వానికి ఊడిగం చేయాలని ప్రశ్నించారు. వ్యాపారులకు పన్ను నుంచి ఎలా తప్పించుకోవాలో బాగా తెలుసని అన్నారు. కానీ ఉద్యోగుల పరిస్థితి అలా కాదు. వారి ఆదాయంలో ముందే టిడిఎస్ కోత పడుతుంది. అదే విధంగా వారు కొనే వస్తువుల పైనా 18 శాతం జిఎస్‌టి పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో పన్ను చెల్లించడమమంటే ఓ శిక్షనేనని విమర్శలు గుప్పించారు. ప్రతి ఒక్కరూ 10-15 శాతం పన్ను చెల్లించేలా చూడాలన్నారు. దాంతో ప్రభుత్వానికి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు.

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి పవన్‌కల్యాణ్ భూమి పూజ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సోమవారం మంగళగిరిలో భూమి పూజ నిర్వహించారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఇప్పటి వరకు హైదరాబాద్‌లో ఉండగా, ఇకపై మంగళగిరి నుంచి పార్టీ వ్యవహారాలు నడపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. సినీ నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్ పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు.

ద్విచక్ర ట్యాక్సీ సంస్థలకు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : ద్విచక్ర వాహన ట్యాక్సీ సేవలపై ఆ రంగ కంపెనీలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రవాణ చట్టాన్ని సవరించడం ద్వారానే ఆ సేవలకు అనుమతి లభించనుందని స్పష్టం చేసింది. వాణిజ్య అవసరాల కోసం ద్విచక్ర వాహనాలను ఉపయోగించడం మోటారు వాహనాల చట్టం 1988ని ఉల్లంఘించడమేనంటూ ఢిల్లీ ప్రభుత్వ రవాణ శాఖ స్పష్టం చేసింది.

దీంతో అక్కడ బైక్ రైడింగ్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రైడింగ్, క్యాబ్ సంస్థలు ఢిల్లీ కోర్టులో సవాలు చేశాయి. దీనిపై సోమవారం ఢిల్లీ హైకోర్టు స్పష్టతనిచ్చింది. ఢిల్లీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించే వరకు ఢిల్లీలో ద్విచక్ర వాహనాలను ట్యాక్సీ సేవలకు ఉపయోగించరాదని తెలిపింది.

బెటర్.కాంలో 4000 మందిపై వేటు

న్యూఢిల్లీ : టెక్ ఆధారిత సేవల కంపెనీల్లో ఉద్యోగ భద్రత గాల్లో దీపంలాగా మారింది. మందగమనం సాకులు చూపి ఐటి కంపెనీలు వరుస కట్టి ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. తాజాగా తనఖా సంబంధిత సేవలను అందించే ఆన్‌లైన్ వేదిక బెటర్.కాం 4,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. తన రియల్ ఎస్టేట్ విభాగాన్ని మూసి వేయడంతో అందులోని మొత్తం మంది ఉద్యోగులను తొలిగించినట్లు బెటర్.కాం సిఇఒ విశాల్ గార్గ్ వెల్లడించారు. మార్ట్‌గేజ్ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత్తి వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కాగా.. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు ఎలాంటి పరిహార ప్యాకేజీ ఇవ్వలేదని ఆ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తిరుపతిలో సప్తగిరి సందడి

- టిడిపి నుంచి పోటీకి సిద్ధమని ప్రకటన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

హాస్యనటుడు, హీరో సప్తగిరి సోమవారం తిరుపతి నగరంలో సందడి చేశారు. తిరుపతిలోని బైరాగిపట్టెడంలో హంగ్రీ ఫుడ్ కోర్ట్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో సప్తగిరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌లు ఆదేశిస్తే టిడిపి అధికారంలో రావడానికి రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తాను పుట్టింది చిత్తూరు జిల్లాలోని ఐరాల, పెరిగింది పుంగనూరు చుట్టుపక్కల ప్రాంతాలని తెలియజేశారు. చిత్తూరు జిల్లాలో పార్లమెంటు లేక అసెంబ్లీకి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ ఫుడ్‌కోర్ట్‌లో అన్ని ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయన్నారు. కాస్ట్ తక్కువలో క్వాంటిటీ ఎక్కువ దొరికే ఈ ఫుడ్‌కోర్ట్‌లో నగర ప్రజలు రుచికరమైన వంటకాలను భుజించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆ హోటల్ యాజమాన్యం సిబ్బంది నగర ప్రజలు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడిని కొట్టిన ఎస్ఐ

- మనస్తాపంతో సదరు వ్యక్తి ఆత్మహత్య..
- ఎస్ఐను విఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిని ముద్దాయిల ఎదుటే ఎస్ఐ కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సదరు వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని ఉత్తర బజార్‌లో అన్నదమ్ములు ఎర్రంరెడ్డి కృష్ణారెడ్డి, రమణారెడ్డి కలిసి స్థల విషయంలో చల్లా గురవారెడ్డి అనే రైతుతో గురువారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. అనంతరం రాత్రికి మళ్లీ ఇరుపక్షాలవారు ఎటిఎం సెంటర్‌లో గొడవకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. గురవారెడ్డి మరుసటి రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కృష్ణారెడ్డితో పాటు ఆయన అనుచరులైన శశి భూషణ్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. శశి భూషణ్‌రెడ్డి శుక్ర, శనివారాలలో గురవారెడ్డి ఇంటి వద్ద కత్తులతో రెక్కీ నిర్వహించినట్లు తిరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇరు గ్రూపులను విచారణ నిమిత్తం ఆదివారం ఎస్ఐ వెంకట సైదులు పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. విచారణలో ముద్దాయిల ఎదుటే గురవారెడ్డిని ఎస్ఐ కొట్టారు. దీంతో మనస్తాపానికి గురై ఆయన బయటకు వెళ్లి పురుగుల మందు తాగారు. ఇది గమనించిన ఆయన కుటుంబ సభ్యులు హుటాహుటిన వినుకొండలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై గురవారెడ్డి బంధువులు, స్నేహితులు ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ గురవారెడ్డి మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు, ఎస్ఐ వెంకటసైదులును విఆర్‌కు పంపినట్లు డిఎస్‌పి అశోక్‌వర్ధన్ తెలిపారు.

ఎపికి పన్నుల్లో వాటా రూ.4,787 కోట్లు

- తెలంగాణకి రూ.2,486 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ కి పన్నుల్లో వాటా కింద రూ.4,787 కోట్లు విడుదల అయింది. తెలంగాణకి రూ.2,486 కోట్లు వచ్చాయి. రాష్ట్రాలకు ప్రతినెల ఇచ్చే రూ.59,140 కోట్లను, మూడో విడతగా కేంద్ర ప్రభుత్వం 28 రాష్ట్రాలకు రూ.1,18,280 కోట్లను సోమవారం విడుదల చేసింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా నిధులు విడుదల చేసింది.

మాతృభాషకు పునరంకితం కావాలి

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రతి ఒక్కరూ మాతృభాషకు పునరంకితం కావలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. నెల్లూరులోని వి.ఆర్.కళాశాలలో మోపూరు వేణుగోపాలయ్య స్మృత్యర్థం ఏర్పాటు చేసిన 'గురువుకు వందనం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలయ్య జీవిత విశేషాలతో రూపొందించిన "ప్రవచన సుధాకరుని వేణునాదం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని రూపొందించిన వేణుగోపాలయ్య ఆత్మీయ బృందం, రూపకల్పనా బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో చిన్నారులతో ఏర్పాటు చేసిన అన్నమయ్య కీర్తనల ఆలాపన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మాతృబాషలోనే ఒకరి భావాలను మరొకరికి సమగ్రంగా వివరించడం సాధ్యమవుతుందని తెలిపారు. ముందు మాతృభాష, తర్వాత సోదర భాష, అటుపైన పరభాషకు ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించారు. పెద్దలను గౌరవించటం, ప్రకృతితో కలిసి జీవించడం మన జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు. తన విద్యార్థి జీవితాన్ని, రాజకీయ జీవన గమనాన్ని తీర్చిదిద్దిన అనేక మంది ఉపాధ్యాయులు, మార్గదర్శకుల సహకారాన్ని గుర్తు చేసుకున్నప్పుడు వారి పట్ల కృతజ్ఞతా భావంతో నా మనసు నిండిపోతుందని తెలిపారు. ఎందుకంటే వారు స్వార్థరహితంగా నా జీవితానికి దిశానిర్దేశం చేశారన్నారు. భాష పట్ల నా ఆసక్తి, అనురక్తి పెరగడానికి కారణం పోలూరి హనుమజ్జానకీరామశర్మ , మోపూరు వేణుగోపాలయ్య అని చెప్పడానికి గర్వపడతానని తెలిపారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (వెస్ట్), ముంబయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (ఈస్ట్), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలీయో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు పబ్లిక్ నోటీసు.

కింద పేర్కొన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ('బ్యాంక్") రుణగ్రహీతలు, సెక్యూరిటీలపై రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం బ్యాంక్‌కు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి దీని ద్వారా తెలియజేయబడతారు.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డిఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయి. ఈ రుణగ్రహీతలకు బ్యాంక్ అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ తాకట్టును అమలులోకి తెచ్చింది మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది, విఫలమైతే , ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి బ్యాంకుకు స్వేచ్ఛ ఉంటుంది.
రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురై, సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి, రుణ ఒప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో తాకట్టుగా బ్యాంకు బకాయిలను రికవరీ చేయడానికి 20' జూన్ 2023న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని నిర్ణయించుకుంది. బ్యాంకుకు రుణగ్రహీతలు కూడా, మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించేందుకు స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఏ సమయంలోనైనా, తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, బ్యాంక్ తన విచక్షణతో తాకట్టు పెట్టిన సెక్యూరిటీని ఒకదానిలోపు విక్రయిస్తుంది (1) క్యాలెండర్ రోజు, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా. రుణగ్రహీత(లు) తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత, మిగిలిన ఏదైనా బకాయి మొత్తాన్ని బ్యాంక్‌కు తిరిగి చెల్లించడానికి బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	రుణ ఖాతా నెంబరు	రుణగ్రహీతల పేర్లు	8 జూన్, 2023 నాటికి బకాయి మొత్తం	అమ్మకపు నోటీసు తేదీ
1	XXXX1156	రాధాకృష్ణ మూర్తి దైవల	57,502.86	31-May-23
2	XXXX0271	సౌరవ్ కుమార్ గోహైన్	2,520.20	31-May-23
3	XXXX6739	కోసూరి రాధ రుక్మిణి	5,309.10	31-May-23
4	XXXX8961	ముల్లంగి సత్యక్రిష్ణవేణి	235,268.91	31-May-23

తేదీ: 13.06.2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్.
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

సంపాదకీయం

విద్రోహ విద్వేష పాలన

నరేంద్ర మోడీ నాయకత్వాన ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వానికి తొమ్మిదేళ్లు నిండిన సందర్భంగా తిరుపతి, విశాఖపట్నం సభలలో జెపి నడ్డా, అమిత్ షా తమ పాలన గొప్పలు చెప్పారే తప్ప ఆంధ్రప్రదేశ్‌కు ఆ పార్టీ, కేంద్ర ప్రభుత్వం చేసిన విద్రోహాన్ని వివరించకపోవడం ఘరానా మోసం. ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తిరస్కరించడం, విభజన హామీలను అమలు చేయ నిరాకరించడం వంటివి తొక్కిపెట్టి స్వోత్కర్షలు, పరనింద తోనే ప్రసంగాలు ముగిసిపోయాయి. తెలుగు ప్రజల కోసం రెండు వందే భారత్ రైళ్లు నడుపుతున్నామని, విశాఖ రైల్వే స్టేషన్‌ను రూ.450 కోట్లతో భవ్య రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దబోతున్నామని చెప్పిన అమిత్ షా రైల్వే జోన్ గురించి మాత్రం ప్రస్తావించలేదు. కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేశామని చెప్పిన ఆయన చెన్నై విశాఖ కారిడార్ మాటే లేదు. కడప ఉక్కు ఊసెత్తలేదు. పేదలకు ఐదు కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్న అమాత్యుడు ఇప్పటివరకూ ఇస్తున్న రేషన్ బియ్యం రద్దు చేశామని చెప్పలేదు. మోడీ ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ వంటి అన్ని నిత్యావసరాల ధరలూ పెంచి ప్రజల నడ్డి విరిచేస్తోంది. ఈ సమయంలోనే విమాన ఇంధన ధరలను తగ్గించడం అది ఎవరి పక్షమో తేటతెల్లం చేస్తోంది. బిజెపి అధికారంలోకి వచ్చే నాటికి దేశం రూ.47 లక్షల కోట్లు అప్పు ఉండగా, ఈ తొమ్మిదేళ్లలో రూ.153 లక్షల కోట్లకు పెరిగింది. దేశంలో మత చిచ్చు రగల్చడం, ప్రజల మధ్య విభేదాలను పెంచి మారణహోమానికి కారణమైంది. బిజెపి తొమ్మిదేళ్ల పాలన విద్వేష, విద్రోహపూరితమే!

అమిత్ షా రాకను నిరసిస్తూ రాష్ట్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన రాష్ట్రమంతటా ఆందోళనలు జరిగాయి. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందిగాక విజయోత్సవ సభల పేరుతో మరోమారు మోసం చేయాలని చూస్తున్న బిజెపికి రాష్ట్ర ప్రజలు పాడె కట్టాలని వారు పిలుపునివ్వడం సబబైనదే! 'స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన వారికి విశాఖలో అడుగుపెట్టే అర్హత లేదు' అన్నది ముమ్మాటికీ నిజం. పోలవరానికి నిధులు, ముఖ్యంగా నిర్వాసితుల పునరావాసం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు తదితర డిమాండ్లు న్యాయసమ్మతమైనవి. అమిత్ షా పర్యటన సమయంలోనే స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 558 ప్లాట్‌లను, 76 భవనాలను అమ్మకానికి పెడుతూ ప్రకటన విడుదల చేయడం రాష్ట్ర ప్రజలకు పుండు మీద కారం చల్లినట్లుంది. విశాఖ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకుంటున్నట్టు ప్రకటించాలని కార్మిక సంఘాలు నిరసనలు తెలియజేస్తున్న నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం ఇటువంటి ప్రకటన విడుదల చేయడం తీవ్రమైన విషయం. విశాఖ నగరంలో హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెంలో ఉక్కు ఉద్యోగులకు కేటాయించిన ప్లాట్లను, ఆటోనగర్ గాజువాక ఏరియాలో ఇళ్లను అమ్మకానికి పెట్టడం అమానుషం.

ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారిందని, గత నాలుగేళ్ల పాలనంతా అవినీతిమయమని అమిత్ షా చేసిన విమర్శలు చర్చనీయాంశమైనాయి. భూ, మైనింగ్ మాఫియాలు, ఫార్మా కంపెనీల్లో అక్రమాలు ఎ.పి లో, అందునా విశాఖలో పెచ్చుమీరుతున్నాయని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అవినీతిమయం అయిందని చెబుతున్న జాతీయ నాయకులు రాష్ట్రంలో 2014 నుండి టిడిపి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి గనులు, ఇసుక, మద్యం, భూముల వ్యవహారాల్లో పెద్ద ఎత్తున జరిగిన అవినీతి, కుంభకోణాలపై సమాధానం చెప్పడంతోపాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూడా స్పందించాలని వైసిపి నేతలు డిమాండ్ చేయడంతో కమలనాథులకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. రాష్ట్రానికి బిజెపి విద్రోహంపై వైసిపి, టిడిపి, జనసేన పల్లెత్తు మాట అనడంలేదు సరికదా అన్ని సందర్భాల్లోనూ కేంద్రానికి అండగా నిలుస్తూనే ఉన్నాయి. అయితే ఇటీవల చంద్రబాబు అమిత్ షా భేటీ అనంతరం సమీకరణాల్లో ఏమైనా మార్పు వచ్చిందా లేక ఇది టీ కప్పులో తుఫానుగానే మిగిలిపోతుందా అన్నది కొద్ది కాలం వేచి చూస్తే తేలుతుంది. ఏది ఏమైనా రాష్ట్ర ప్రజలను మోసగిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న బిజెపితో ఏ ప్రాంతీయ పార్టీ కూడా చెలిమి చేయకుండా ఉంటేనే ఈ రాష్ట్రానికి మంచిది.

మహనీయుల మాట

విప్లవం అంటే తప్పనిసరిగా రక్తాన్ని పారించే ఘర్షణే అయి వుండాలని నేను భావించడం లేదు. అన్యాయం మీద రూపొందిన ప్రస్తుత వ్యవస్థను మొత్తంగా మార్చడమే విప్లవం.

- భగత్‌సింగ్



దేశ ఆర్థిక పరిస్థితి - వాస్తవాలు



ప్రభాత్ పట్నాయక్

ఇటీవల, మే 31వ తేదీన 2022-23 ఆర్థిక సంవత్సరపు ఆఖరి త్రైమాసిక ఆర్థిక వృద్ధిరేటు వివరాలు వెల్లడి చేశారు. ఆ మూడు నెలల వృద్ధి రేటు 6.1 శాతం ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కలిపి లెక్కిస్తే వృద్ధిరేటు 7.2 శాతం నమోదైంది. రిజర్వు బ్యాంక్, ఐఎంఎఫ్ వేసిన ముందస్తు అంచనాల ప్రకారం 6.8 శాతం వృద్ధిరేటు ఉంటుందనుకున్నది వాస్తవంలో 7.2 ఉండేసరికి ప్రభుత్వ భారతదేశం అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక శక్తి అంటూ గొప్పలు చెప్పుకోవడం మొదలుపెట్టేసింది.

ముందస్తుగా అనుకున్న 6.8 శాతం కన్నా వాస్తవంగా 7.2 శాతం వృద్ధిరేటు నమోదు కావడం బట్టి మన దేశపు ప్రస్తుత ఆర్థిక పరిస్థితి మీద ఉన్న అంచనాలు ఏమాత్రమూ మార్చుకోవలసిన పని లేదు. 2019-20 నుండి 2022-23 మధ్య కాలంలో లాక్‌డౌన్ సంవత్సరం 2020-21ని పక్కన పెట్టి లెక్కిస్తే మన ఆర్థిక వృద్ధిరేటు ఏడాదికి 2.85 గా ఉంది (ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఏడాది ఆఖరి త్రైమాసికపు వృద్ధి 6.8 ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కిస్తే ఇది 2.7 గా ఉంటుంది). అంతే కాదు, 2022-23లో నమోదైన వృద్ధిరేటు ను 2023-24లో కొనసాగించడం అసాధ్యం అని దాదాపు ప్రతీవారూ భావిస్తున్నారు. స్థూల డిమాండ్‌లో పెరుగుదల ఏమీ లేకపోవడమే దీనికి కారణం. మన ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుని వుందన్న విషయం నిస్సందేహం.

కాని మన ప్రభుత్వం మాత్రం ఆర్థిక వ్యవహారాలను తాము చాలా సమర్థవంతంగా నిర్వహించిన కారణంగానే ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా మనమే ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేయగలిగామంటూ గొప్పలు పోతున్నది. ఇక్కడ మన ప్రభుత్వం దాచిపెడుతున్న విషయం ఒకటుంది. కరోనా కాలంలో ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా అతి ఎక్కువ మోతాదులో ఆర్థిక పతనం మన దేశంలోనే సంభవించింది. ఇక ఏ ఇతర దేశంలోనూ అమలు చేయనంత దుర్మార్గమైన రీతిలో ఇక్కడ లాక్‌డౌన్ అమలు జరిగింది. దాని ఫలితంగా 2020-21లో ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకీ అతి ఎక్కువ స్థాయిలో మన ఆర్థిక వ్యవస్థ దిగజారిపోయింది. ఆ స్థితి నుండి మళ్ళీ కరోనాకి మునుపు ఉండిన స్థాయికి చేరుకోవాలన్నా చాలా ఎక్కువ వృద్ధిరేటు నమోదు కావలసి వుంది. అందుకే ఆ 2020-21 ఆర్థిక సంవత్సరాన్ని పక్కన పెట్టి అంతకు ముందు సంవత్సరం 2019-20 నుండి ఇప్పటిదాకా వృద్ధిరేటును లెక్కించాం. అప్పుడు వృద్ధిరేటు 2.85గా నమోదైంది (2020-21 సంవత్సరాన్ని కూడా కలిపి లెక్కిస్తే ఈ మాత్రం వృద్ధి కూడా కనిపించదు). అప్పుడు కూడా ఇంత తక్కువ వృద్ధిరేటు నమోదవడం అంటే దేశం ఆర్థిక మాంద్యంలో ఉందన్నమాట. అంతే తప్ప చాలా గొప్ప వృద్ధి సాధిస్తోందని భావించడం సరైనది కాదు.

> **2022-23లో నమోదైన వృద్ధిరేటు ను 2023-24లో కొనసాగించడం అసాధ్యం అని దాదాపు ప్రతీవారూ భావిస్తున్నారు. స్థూల డిమాండ్‌లో పెరుగుదల ఏమీ లేకపోవడమే దీనికి కారణం. మన ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుని వుందన్న విషయం నిస్సందేహం.**

తాజా జిడిపి గణాంకాలు మరో ఆందోళనకర ధోరణిని వెల్లడిస్తున్నాయి. 2018-19 కన్నా 2022-23లో వాస్తవ జిడిపి వృద్ధి 13.37 శాతం ఎక్కువ ఉంది. ఐతే 2018-19లో 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగం రేటు 2023 మార్చి నాటికి 7.9 శాతానికి ఎగబాకింది. (సిఎంఐఇ వెల్లడించిన గణాంకాలు) జిడిపి వృద్ధిరేటు పెరుగుతున్నప్పుడు, అందునా, జనాభా పెరుగుతున్న వేగం కన్నా జిడిపి వేగంగా పెరుగుతున్నప్పుడు నిరుద్యోగం రేటు తగ్గాలే తప్ప పెరగకూడదు కదా. మరి ఎందుకు నిరుద్యోగం వేగంగా పెరుగుతోంది?

ఆర్థి వ్యవస్థ పెరిగే వేగం కన్నా జనాభా, అందులోనూ నిరుద్యోగ జనాభా వేగంగా పెరిగిపోతే అప్పుడు నిరుద్యోగం రేటు పెరగడాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. కాని ఇక్కడ దానికి భిన్నంగా నిరుద్యోగ జనాభా పెరుగుదల వేగం కన్నా ఆర్థిక వృద్ధి పెరిగిన వేగం ఎక్కువ. అంటే నిరుద్యోగం పెరిగిపోడానికి లేబర్ సప్లై పెరగడం కాదు కారణం. దానికి భిన్నంగా లేబర్ డిమాండ్ తగ్గిపోవడం వల్ల నిరుద్యోగం పెరిగింది. సిఎంఐఇ వెల్లడించిన మరో అంశం దీనిని ధృవపరుస్తోంది. 2019-20లో 40 కోట్ల 89 లక్షలమంది ఉద్యోగాలలో ఉంటే మార్చి 2023 నాటికి 40 కోట్ల 76 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలలో ఉన్నారు.

> **జిడిపి గణాంకాలలో అన్నింటికన్నా ఆందోళన కలిగించే విషయం శ్రామిక ప్రజల వినిమయంలో పెరుగుదల ఏమీ లేకపోవడం. " ప్రపంచంలోకెల్లా మనదే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ" అని ఎంత గొంతు చించుకున్నా, ఈ చేదు నిజాన్ని పాలకులు కప్పిపుచ్చలేరు.**

అంటే నికరంగా ఉద్యోగాలు తగ్గిపోయాయన్నమాట. దీనిని బట్టి మూడు విషయాలను గ్రహించవచ్చు. మొదటిది: 2020-21లో కనిష్ట స్థాయికి పడిపోయిన తర్వాత కోలుకున్న క్రమంలో నమోదైన వృద్ధి అదనపు ఉద్యోగాలను కల్పించే కార్యకలాపాల వలన సాధించినది కాదు. అంటే సంఘటిత రంగంలో సాధించిన దానికన్నా హీనమైన వేతనాలు ఉండే అసంఘటిత రంగంలోనే ఏపాటి ఉద్యోగాల కల్పన అయినా నమోదైందన్నమాట (ఈ అసంఘటిత రంగం లాక్‌డౌన్ కారణంగా అతి ఎక్కువగా దెబ్బ తింది. అంతకు ముందు పెద్ద నోట్లు రద్దు వలన కాని, జిఎస్‌టి అమలు వలన కాని అతి ఎక్కువగా దెబ్బ తిన్నది ఈ అసంఘటిత రంగమే). రెండవది: మనుషుల ద్వారా నిర్వహించబడే కార్యకలాపాలలో ఎక్కువ భాగం డిజిటైజేషన్ అవుతున్నాయి. అందువలన తక్కువమంది ఉద్యోగులతోనే ఎక్కువ పనులు జరుగుతున్నాయి. ఇది శ్రామిక ఉత్పాదకతను బాగా పెంచుతోంది. అంటే ఉత్పత్తి అవుతున్న సంపద పెరుగుతున్నా, దానిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన మానవ వనరులు మాత్రం తగ్గుతున్నాయి. ఇక మూడవది: చాలా రంగాలలో పొదుపు చర్యల పేరుతో గాని, ఉద్యోగులను తగ్గించే పేరుతో గాని లే-ఆఫ్ లు అమలు కావడం పెరిగింది. దీని ఫలితంగా ఒక్కసారిగా ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతున్నది. ఫిబ్రవరి 2023లో 40 కోట్ల 90 లక్షల ఉద్యోగాలు ఉంటే మార్చి 2023లో 40 కోట్ల 76 లక్షలకు అవి పడిపోయాయి (ఒక్క నెలలోనే 24 లక్షల ఉద్యోగాలు పోయాయి).

జిడిపిని ప్రాథమికంగా లెక్కించే కొత్త పద్ధతిలో సంఘటిత రంగంలో వృద్ధిరేటు ఏ మేరకు ఉందో వ్యవసాయేతర అసంఘటిత రంగంలో కూడా అదే మోతాదులో ఉంటుంది అన్న ప్రాతిపదికను అనుసరిస్తారు. అసంఘటిత రంగానికి సంబంధించిన గణాంకాలు సేకరించడానికి ఎక్కువ సమయం పడుతుంది గనుక సంఘటితరంగం వృద్ధిరేటుతో సమంగా అసంఘటిత రంగం కూడా వృద్ధి చెందుతుంది అని పరిగణిస్తారు. కాని అసంఘటిత రంగం సంఘటిత రంగం కన్నా బాగా ఎక్కువగా దెబ్బ తింది. ముఖ్యంగా కరోనా కాలంలో తగిలిన దెబ్బ నుండి అసంఘటిత రంగం ఇంకా కోలుకోనేలేదు. అటువంటప్పుడు సంఘటిత రంగంలో ఉండే వృద్ధిరేటుతో సమంగా అసంఘటిత రంగంలో కూడా వృద్ధి ఉంటుందనుకోవడం వలన వాస్తవ వృద్ధి కన్నా గణాంకాలలో చూపేది చాలా ఎక్కువగా ఉంటుంది.

ఈ సంఘటిత రంగంలో కూడా ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో ఉన్న కొన్ని లిస్టెడ్ కంపెనీల పనితీరును మాత్రమే లెక్క లోకి తీసుకుని తక్కిన కంపెనీలన్నీ అదే తీరుగా పనిచేసి వుంటాయని భావించి వృద్ధిరేటు లెక్కిస్తారు. దీని వలన కూడా వాస్తవ వృద్ధి కన్నా ఎక్కువ వృద్ధి ఉన్నట్టు లెక్కల్లో కనిపిస్తుంది. ఈ అతి అంచనాలనే మోడీ ప్రభుత్వం చూపించి ప్రచారం చేసుకుంటోంది.

> **ఇక్కడ మన ప్రభుత్వం దాచిపెడుతున్న విషయం ఒకటుంది. కరోనా కాలంలో ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా అతి ఎక్కువ మోతాదులో ఆర్థిక పతనం మన దేశంలోనే సంభవించింది.**

> **జిడిపి వృద్ధిరేటు పెరుగుతున్నప్పుడు, అందునా, జనాభా పెరుగుతున్న వేగం కన్నా జిడిపి వేగంగా పెరుగుతున్నప్పుడు నిరుద్యోగం రేటు తగ్గాలే తప్ప పెరగకూడదు కదా. మరి ఎందుకు నిరుద్యోగం వేగంగా పెరుగుతోంది?**

ఒకవేళ ఈ అంచనాలన్నీ వాస్తవ పరిస్థితినే సూచిస్తున్నాయని కాసేపు అనుకుందాం. అప్పుడు కూడా వస్తూత్పత్తి రంగంలో వృద్ధి కేవలం 1.3 శాతం మాత్రమే ఉంది. వ్యవసాయ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. రుతుపవనాలు, వర్షాభావం, వరదలు వగైరా పలు కారణాల వలన వ్యవసాయోత్పత్తిలో వృద్ధి ప్రతీ ఏడూ నిలకడగా కొనసాగుతుందని చెప్పలేం. ఇక సేవారంగంలో (ఇందులో వాణిజ్యం, హోటళ్ళు, రవాణా, సమాచార రంగం, ప్రసార సేవలు వంటివి ఉంటాయి) 14 శాతం వృద్ధి నమోదైంది. ఈ రంగంలో వేగంగా వృద్ధి జరిగినందున మొత్తం మీద జిడిపి వృద్ధిరేటు పెరుగుదల కనిపిస్తోంది.

ఈ అంశం కీలకం. వస్తూత్పత్తి రంగంలో, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి జరిగే సంపదలో నుంచి వచ్చే అదనపు విలువ మీద సేవారంగం కార్యకలాపాలు ఆధారపడి వుంటాయి. సేవారంగంలో ఉద్యోగుల నుండి అదనపు విలువ ఏమీ ఉత్పత్తి కాదని ఆడం స్మిత్ స్పష్టం చేశాడు. సోషలిస్టు దేశాలలో (సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో సోషలిస్టు వ్యవస్థ ఉండిన కాలంలో) సేవారంగాన్ని మినహాయించి జిడిపి లెక్కించేవారు. ఇప్పటికే ఉత్పత్తి అయిన సంపదను పంపిణీ చేయడమో, ఆ వస్తువుల వినియోగం జరిగే క్రమంలో వాటికి సంబంధించిన సేవలను అందించడమో తప్ప సేవారంగం అదనపు సంపదను దేశానికి జోడించదు. అటువంటి సేవారంగంలో కనపడిన వృద్ధి మొత్తం జిడిపిలో ప్రధాన భాగం అయినప్పుడు అందులో సంబరపడవలసినది ఏమీ లేదు.

శ్రామిక ప్రజలు తమ ఆదాయాలను ప్రధానంగా ఆహారం మీద ఖర్చు చేస్తారు. ఆ తర్వాత అసంఘటిత రంగంలో ఉత్పత్తి అయ్యే సరుకులను తమ వినియోగం కోసం కొనడానికి ఖర్చు చేస్తారు. మొత్తం వస్తూత్పత్తి రంగంలోనే వృద్ధి దాదాపు లేదు. అందులో ప్రత్యేకంగా అసంఘటిత రంగంలో పూర్తిగా మాంద్యం నెలకొంది. అంటే శ్రామికవర్గం కొనుగోలుశక్తి ఏమీ పెరగలేదని కనిపిస్తోంది. పైగా ప్రభుత్వ వ్యయం ఈ కాలంలో వాస్తవ విలువలలో ఏమీ పెరగలేదు. స్థూల స్థిర పెట్టుబడిలో పెరుగుదల కనిపిస్తున్న మాట నిజం. కాని వినిమయంలో గాని, ఎగుమతులలో గాని పెరుగుదల లేనప్పుడు పెట్టుబడులు పెట్టడంలో పెరుగుదల కొనసాగుతుందని భావించలేము.

జిడిపి గణాంకాలలో అన్నింటికన్నా ఆందోళన కలిగించే విషయం శ్రామిక ప్రజల వినిమయంలో పెరుగుదల ఏమీ లేకపోవడం. " ప్రపంచంలోకెల్లా మనదే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ" అని ఎంత గొంతు చించుకున్నా, ఈ చేదు నిజాన్ని పాలకులు కప్పిపుచ్చలేరు.

(స్వేచ్ఛానుసరణ)

జనవాక్యం

భయమేల!

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు, వైఫల్యాలపై పత్రికల్లో అనేక కథనాలు వస్తున్నాయి. అబ్బే అదేం లేదు, అంతా సవ్యంగానే ఉందంటూ ప్రాజెక్టు అధికారులు వివరణ ఇస్తున్నారు, ఇంతవరకు బాగానే ఉంది. మరి వాస్తవాలు తెలుసుకోవడానికి ప్రధాన ప్రతిపక్షం ప్రాజెక్టును సందర్శించడానికి వస్తే పోలీసుల చేత వారిపై దౌర్జన్యం చేయించి పోలీసు స్టేషన్‌కు తరలించడం అవసరమా? ఏ తప్పు లేకుంటే చూడటానికి అభ్యంతరం ఎందుకు? ఇదేం పారదర్శకత? ఇంకా అధికారులు ఇచ్చే వివరణలు నమ్మేదెలా?

- గడ్డిపాటి శ్రీహరి, పోతునూరు.

బాధ్యులెవరు?

విజయవాడ, గుంటూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో చెత్త తరలింపుకు 8 నెలల కిందట తెప్పించిన ఆటోలను ఇంతవరకు వినియోగించకపోవడంతో వాటిలో చాలా వరకు పనిచేయని స్థితిలోకి వెళ్లాయి. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులు ఈ విధంగా దుర్వినియోగం అవ్వడం చాలా బాధాకరం. ప్రజలు పన్నులు కడుతుంటే మీడియాకు బాధేంటి అని తుంటరి ప్రశ్నలు వేసిన సదరు అధికారి ఇప్పుడు ప్రజలకు తమ నిర్వాకంపై ఏమి సంజాయిషీ ఇస్తారు? భారీ వేతనాలు, సకల సౌకర్యాలతో ఏసీ గదుల్లో కూర్చుని ప్రజలకు చేస్తున్న సేవలు ఏమిటో ఆత్మ విమర్శ చేసుకోవాలి!

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విశ్లేషణ

సత్య

మద్దతు కాదు...మోసం..!

ఖరీఫ్ పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ద్రవ్యోల్బణం తగ్గించేందుకు తోడ్పడతాయని ఆర్థికవేత్తలు స్పందించారు. ఎన్నికల సంవత్సరంలో ధరలు పెరగకుండా, తద్వారా బిజెపికి జనం దూరం కాకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగమే ఇది, రైతులకు మేలు చేసేది కాదని వేరే చెప్పనవసరం లేదు.

తమ ప్రభుత్వ హయాంలో 2014-15లో ఏ గ్రేడ్ వరి మద్దతు ధర రూ.1,400 నుంచి 2023-24లో రూ.2,203కు అంటే రూ.803 పెంచినట్లు మోడీ సర్కార్ గొప్పగా చెప్పుకుంటున్నది. సగటున వార్షిక పెంపుదల 5.7 శాతం. అంతకు ముందు కాంగ్రెస్ ఏలుబడిలో 2004-05 రూ.590 నుంచి రూ.1,400కు పెరిగింది. రూ.810 పెరిగింది. సగటు వార్షిక పెరుగుదలలో చూస్తే 14 శాతం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తి గణనీయంగా సాగు చేస్తారు. కాంగ్రెస్ ఏలుబడిలో పొడవు పింజ పత్తి ధర రూ.1,760 నుంచి రూ.4,050 పెరిగింది. నికర పెరుగుదల రూ.2,290. వార్షిక సగటు 13 శాతం. అదే నరేంద్ర మోడీ కాలంలో రూ.4050 నుంచి రూ.7,020కి పెంచారు. నికర పెరుగుదల రూ.2,970. కాగా వార్షిక సగటు 7.3 శాతమే. ఎవరు రైతులకు మేలు చేసినట్లు? దీని అర్థం కాంగ్రెస్ రైతులను ఏదో ఉద్ధరించిందని చెప్పటం కాదు, పెరిగిన సాగు ఖర్చులతో పోలిస్తే అది కూడా తక్కువే. దానితో పోలిస్తే మంచి రోజులను తెచ్చి అమృత కాలంగా మార్చి రైతుల రాబడి రెట్టింపు చేస్తామన్న నరేంద్ర మోడీ పాలనలో మరింత దిగజారింది అని చెప్పేందుకే ఈ పోలిక.

కనీస మద్దతు ధరలను పెంచితే దాని ప్రభావం బియ్యం, వస్త్రాలు-దుస్తుల ధరల పెరుగుదలకు దారి తీస్తుంది కదా అని ఎవరైనా వాదించవచ్చు. రైతులు గొంతెమ్మ కోరికలను కోరటం లేదు. సాగు గిట్టుబాటు కావాలి-వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉండాలి. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల ధరలను స్థిరంగా ఉంచితే రైతులు కూడా మద్దతు ధరల పెంపుదలను అడగరు. అన్నింటికీ మించి ఎవరేమి చెప్పినా రైతు బతకాలి, సాగు సాగాలి. అందుకే కదా రైతుల రాబడిని రెట్టింపు చేస్తామని మోడీ సర్కార్ చెప్పింది. దాన్ని అమలు జరపాలనే కదా రైతులు అడుగుతోంది. ఎన్నికలు జరిగే సంవత్సరంలో ధరలను కాస్త ఎక్కువగా పెంచటం గతంలో కాంగ్రెస్ చేసింది. అదే జిమ్మిక్కు నరేంద్ర మోడీ కూడా కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు 2014-15 నుంచి 2017-18వరకు మూడు సంవత్సరాల్లో ఏ గ్రేడ్ వరికి పెరిగింది మొత్తం రూ.190 మాత్రమే, సగటున ఏడాదికి రూ.63 మాత్రమే. అదే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 2018-19లో పెంచిన మొత్తం రూ.180. తరువాత నాలుగు సంవత్సరాల్లో రూ.1,770 నుంచి 2022-23 వరకు రూ.2,060కి అంటే రూ.290, ఏడాదికి సగటున రూ.72.50 కాగా వచ్చే ఏడాది ఎన్నికల కారణంగా ఈసారి రూ.143 పెంచారు. ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను పక్కన పెట్టి వార్షిక ద్రవ్యోల్బణ ప్రాతిపదికన నామమాత్రంగా పెంచుతున్నారు తప్ప సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకోవటం లేదు. మరోవైపు మార్కెట్లో గోధుమలు, బియ్యం ధరల పెరుగుదల కనీస మద్దతు ధరల కంటే ఎక్కువగా ఉంటున్నది. దీనికి కారణం ఏమిటో ఎవరూ చెప్పరు. ప్రతిదానికీ ఉక్రెయిన్ సంక్షోభం అని చెప్పి తప్పించుకుంటున్నారు. అది ప్రారంభంగాక ముందే మన దేశంలో ధరల పెరుగుదల మొదలైందన్నది చేదు నిజం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం పెంచటమే దానికి తిరుగులేని నిదర్శనం.

> **ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను పక్కన పెట్టి వార్షిక ద్రవ్యోల్బణ ప్రాతిపదికన నామమాత్రంగా పెంచుతున్నారు తప్ప సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకోవటం లేదు. మరోవైపు మార్కెట్లో గోధుమలు, బియ్యం ధరల పెరుగుదల కనీస మద్దతు ధరల కంటే ఎక్కువగా ఉంటున్నది. దీనికి కారణం ఏమిటో ఎవరూ చెప్పరు. ప్రతిదానికీ ఉక్రెయిన్ సంక్షోభం అని చెప్పి తప్పించుకుంటున్నారు. అది ప్రారంభంగాక ముందే మన దేశంలో ధరల పెరుగుదల మొదలైందన్నది చేదు నిజం.**

2021 నవంబరు 19వ తేదీన నరేంద్రమోడీ దేశమంతటికీ క్షమాపణలు చెప్పి మూడు సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నట్లు చెప్పారు. వాటిని అమలు జరిపితే రైతుల కష్టాలు తీరుస్తాయన్నారు. వాటిని రద్దు చేసిన తరువాత ఇంతవరకు వాటి బదులు కష్టాలు తీర్చే చర్యలేమీ తీసుకోలేదు. అంటే తాను చెప్పినట్లు వినలేదు గనుక రైతులకు ఒక పాఠం చెప్పాలని మోడీ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ప్రజా స్వామ్యానికి నిబద్ధులై ఉండేవారి లక్షణం కాదిది. వెంటవెంటనే నిర్ణయాలు తీసుకోవటంలో తమకు తామే సాటి అని చెప్పుకొనే వారు సాగు చట్టాల రద్దు తరువాత ఐదు నెలలకు ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ పరిధి ఏమిటి? ఏ అంశాలను అది పరిశీలిస్తుందో వివరించాలని రైతు ఉద్యమం నడిపిన సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే సమాధానం లేదు. అందువలన ఆ కమిటీలో ఉండి చేసేదేమీ లేదు గనుక ప్రతినిధుల పేర్లను ప్రతిపాదించటం లేదని స్పష్టం చేసింది. ఈ కమిటీ చైర్మన్ ఎవరంటే రైతులు తిరస్కరించిన మూడు సాగు చట్టాలను రచించిన వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్. ఆ చట్టాలను ఎలా రూపొందించాలో సలహా ఇచ్చిన నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చాంద్. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకూడదని చెప్పిన ఆర్థికవేత్తలను నిపుణుల పేరుతో చేర్చారు. ప్రభుత్వ ప్రతినిధులు సరేసరి, వీరుగాక రైతుల ఆందోళనను వ్యతిరేకించిన ఐదు సంఘపరివార్ సంఘాలకు చెందిన వారిని చేర్చారు. ఆందోళనకు నాయకత్వం వహించిన వారిని మూడు పేర్లు ఇవ్వాలని కోరారు. నూరు కాకుల్లో ఒక్క కోకిల మాదిరి ఈ ముగ్గురూ ఆ కమిటీలో ఉండి చేసేదేమీ ఉండదు. పోనీ వీరు లేకుండా ఇప్పటి వరకు కమిటీ చేసిందేమిటి అంటే నాలుగు ఉపసంఘాల ఏర్పాటు తప్ప మరేమీ లేదు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత ప్రతిపాదన ప్రస్తావన లేని కమిటీ ఇది. రైతుల రాబడి రెట్టింపుకు మూడు సాగు చట్టాలే ఆక్సిజన్ అని చెప్పారు. ఇంతవరకు వాటి బదులు ఏం చేస్తారో చెప్పలేదు. రైతులను నట్టేట ముంచినట్లేనా !

మూడు సాగు చట్టాలను అమలు జరపకుండా 2022 నాటికి రైతుల రాబడిని రెట్టింపు చేయటం కుదరదని నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చాంద్ రైతుల ఆందోళన సమయంలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు అవసరమైన మేరకు చర్యలు కూడా తీసుకోలేదని అన్నారు. అసలు రాష్ట్రాలతో సంప్రదించకుండా సాగు చట్టాలను రుద్దారు. నీతిఆయోగ్ సిఫార్సులు చేయటం తప్ప వాటిని కేంద్రమే పట్టించుకోదు. తమ ప్రభుత్వం అమలు జరుపుతున్న స్కీములతో రైతుల రాబడి పెరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వం నమ్మించ చూస్తున్నది. 2021లో పార్లమెంటు చర్చల్లో కేంద్ర ప్రభుత్వం ఇవిగో మా పథకాలంటూ 17తో ఒక జాబితాను అందించింది, వాటికి గాను రూ.17,540 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పింది. 2020-21 సంవత్సరానికి గాను వాటికి కేటాయించిన బడ్జెట్‌లో మూడో వంతు అంటే రూ.5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వాటిలో మూడు పథకాలకైతే ఒక్క పైసా కూడా ఖర్చు లేదు. అంతే కాదు మొత్తం ఖర్చు చేసినప్పటికీ కేవలం పదిశాతం మంది రైతులకే ఈ పథకాలు అమలు అవుతాయని కూడా కేంద్రమే చెప్పింది. మోడీ సర్కార్ అమలు జరుపుతున్న పిఎం కిసాన్ పథకంలో ఏడాదికి ఆరువేల చొప్పున ఇస్తున్నది కేవలం 10.74 కోట్లు లేదా పది శాతం మంది రైతులకే. అంటే దీని ద్వారా కుటుంబానికి అదనపు రాబడి నెలకు రూ.500 మాత్రమే.

2022 నాటికి రైతుల రాబడిని రెట్టింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవలి కాలంలో ఎక్కడా దాని గురించి మాట్లాడటం లేదు. 2016 ఏప్రిల్‌లో మంత్రులతో ఒక కమిటీని వేశారు. 2018 సెప్టెంబరులో అది ఒక నివేదికను ఇచ్చింది. దానిలో ఏడు అంశాలను పేర్కొన్నారు. 1. పంటల ఉత్పాదకత పెంపుదల, 2. పశువుల ఉత్పాదకత పెంపుదల, 3. వనరులను సమర్థవంతంగా వినియోగించటం-ఉత్పత్తి ఖర్చు తగ్గింపు, 4. పంటల సాంద్రతను పెంచటం, 5. అధిక విలువనిచ్చే పంటల వైపు మళ్లింపు, 6. రైతుల పంటలకు గిట్టుబాటు ధర, 7. అదనంగా ఉన్న మానవ వనరులను వ్యవసాయేతర రంగాలకు మళ్లించటం. వీటిలో ఏ ఒక్క అంశంలోనైనా అప్పటి నుంచి ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధి ఏమిటో ఎక్కడా మనకు కనిపించదు.

కేంద్రం ప్రభుత్వం జూన్ ఏడున ప్రకటించిన మద్దతు ధరల్లో ఒక్కటంటే ఒక్క పంటకు కూడా స్వామినాథన్ కమిషన్ సూచించిన సి2 ప్లస్ 50 ప్రకారం ధరలను ప్రకటించటం లేదు. అఖిల భారత కిసాన్ సభ వంటి రైతు సంఘాలు కేంద్రం మోసాన్ని ఆధార సహితంగా నిరూపించాయి. ధాన్యానికి క్వింటాలుకు రూ.2183, జొన్నకు రూ.3180, కందికి రూ.7000, పత్తికి రూ.6620 చొప్పున కేంద్రం ఎంఎస్‌పి ప్రకటించింది. కానీ సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రకారం ధాన్యానికి క్వింటాలుకు రూ.2866.5, జొన్నకు రూ.2833, కందికి రూ.8989.5, పత్తికి రూ.8679 ప్రకటించాలి. ఆ మేరకు రైతులు నష్టపోతున్నారు. రైతు వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) అంచనాల కంటే ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి చోట్ల పెట్టుబడులు అధికంగా ఉంటున్నాయి. జాతీయ సగటు కంటే అధికంగా ఎంఎస్‌పి ఇచ్చామంటున్నారు. ఎక్కువ ఖర్చు ఉన్న చోట రైతుల నష్టాన్ని ఎవరు భరించాలి? సాగు ఖర్చులో, రైతుల రాబడిలో ఒక రాష్ట్రానికి ఒక రాష్ట్రంతో పొసగదు. అందువలన సగటు లెక్క అనేది అశాస్త్రీయం. కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక విధానాలను అమలు జరుపుతున్నట్లే సాగు ఖర్చు ఎక్కువగా ఉన్న చోట రైతును ఆ మేరకు ఆదుకోవాలి.

★

అన్నీ తానే...అంతా తానే

- రెజ్లింగ్ ఫెడరేషన్‌లో బ్రిజ్ ఆధిపత్య, అరాచక పోకడలు
- రెజ్లర్లు ఆందోళన చేసినా... పట్టించుకోని కేంద్రం

న్యూఢిల్లీ : కొన్ని సంవత్సరాల క్రితం ఓ సాయంకాలం. క్రీడా శాఖ మాజీ కార్యదర్శి శాస్త్రి భవన్‌లోని తన కార్యాలయంలో కూర్చొని ఉండగా ఓ ఫోన్ వచ్చింది. ఆ కాల్‌ను ఆయన తన జీవితంలో ఎన్నటికీ మరవలేరు. ఎందుకంటే ఫోన్ చేసింది అప్పటి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్. ఫెడరేషన్ చేసిన కొన్ని సిఫార్సులను ఆ కార్యదర్శి పక్కన పెట్టారు. విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించారు. జట్టు ఎంపిక ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అంతే... బ్రిజ్ భూషణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎందుకంటే అప్పటివరకూ ఫెడరేషన్‌లో ఆయన ఆడింది ఆట... పాడింది పాట. ఆయన మాటకు ఎదురు చెప్పే సాహసం ఎవరూ చేయలేదు. అందుకే కార్యదర్శికి ఫోన్ చేసి తాను ప్రజలు ఎన్నుకున్న ఎంపీని అంటూ గుర్తు చేశారు. పరుష పదజాలాన్ని ఉపయోగించారు. అయినా కార్యదర్శి లొంగలేదు. బ్రిజ్ బెదిరింపులకు పాల్పడే వ్యక్తి అంటూ ఘాటుగానే స్పందించారు.

బ్రిజ్ తనను తాను ఓ 'బాహుబలి'గా భావిస్తారు. తనపై మహిళా రెజ్లర్లు లైంగిక ఆరోపణలు చేసినప్పటికీ, గత కొంతకాలంగా తనను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నప్పటికీ ఆయన తొణకడం లేదు... బెదరడం లేదు. లైంగిక ఆరోపణల కేసులో బ్రిజ్‌పై ఈ నెల 15 నాటికి ఛార్జిషీటు దాఖలు అవుతుందని క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఫెడరేషన్‌ను బ్రిజ్ ఓ క్రూరుడిలా నడుపుతున్నారంటూ రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా విమర్శలు కురిపిస్తున్నారు. అయినా ఆయన వీటిని లెక్కచేయడం లేదు. వాస్తవానికి డబ్ల్యూఎఫ్ఐ ఇప్పుడు వన్‌మాన్ ఫెడరేషన్‌గా మారిపోయింది. ఆయనే దానికి అధ్యక్షుడు, సెలక్షన్ కమిటీ ఛైర్మన్. అథ్లెట్ల ఫిర్యాదులు పరిష్కరించే కమిటీకి కూడా ఆయనే నేతృత్వం వహిస్తారు. జడ్జి, జ్యూరీ, నిర్ణయాన్ని అమలు చేసేదీ... అన్నీ ఆయనే. భారతీయ రెజ్లింగ్‌ను తాను ఉన్నత శిఖరాలకు చేర్చానని గొప్పలు చెప్పుకుంటారు. ఫెడరేషన్ కృషి కారణంగానే రెజ్లర్లు పతకాలు సాధిస్తున్నారన్న వాదనను సీనియర్ కోచ్ కులదీప్ షెరావత్ తోసిపుచ్చారు. మల్లయోధులు సాధిస్తున్న విజయాలలో ఫెడరేషన్ పాత్ర పరిమితమేనని అర్జున అవార్డు గ్రహీత కాకా పవార్ చెప్పారు.

వివిధ స్థాయిలలో పతకాలు సాధించిన రెజ్లర్ల విజయ యాత్రను పరిశీలిస్తే అందులో ఫెడరేషన్ పాత్ర పెద్దగా లేదన్న విషయం అర్థమవుతుంది. సాక్షి మాలిక్, సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, రవి దహియా, బజరంగ్ పునియా... వీరందరూ వేర్వేరు ప్రదేశాలలో రెజ్లింగ్ నేర్చుకున్నారు. వీరికి ఫెడరేషన్ చేసిందేమీ లేదు. ఒలింపియన్లే కాదు...జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన లింగప్ప జెనన్నవార్, రాహుల్ అవేర్ వంటి మల్లయోధులు కూడా స్వయంకృషితో పైకి వచ్చిన వారే.

ఈ వాస్తవాలను బ్రిజ్ భూషణ్ సుతరామూ అంగీకరించరు. ఫెడరేషన్‌లో లిఖితపూర్వక మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఆయన చెప్పిందే వేదం. ఉదాహరణకు జాతీయ శిబిరంలో ప్రవేశానికి కొన్ని అర్హతలను నిర్దేశించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు తనకు సంక్రమించిన అధికారాలతో 'మంచి రికార్డు' ఉన్న ఒక రెజ్లర్‌ను శిబిరంలో చేర్చవచ్చు. 'మంచి రికార్డు' అనే పదానికి నిర్వచనం మాత్రం బ్రిజ్ ఇస్తారు. ఫెడరేషన్ ఛైర్మన్‌గా బ్రిజ్ సెలక్షన్ కమిటీకి నేతృత్వం వహిస్తారు. రాబోయే మూడు నాలుగు నెలల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించే మల్లయోధులను ఆయనే ఎంపిక చేస్తారు. సెలక్షన్ కమిటీ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే రెజ్లర్లు ఫిర్యాదుల విభాగాన్ని ఆశ్రయించవచ్చు. కానీ దానికి కూడా బ్రిజ్ భూషణే నేతృత్వం వహిస్తున్నారు.

గత సంవత్సరం కామన్వెల్త్ క్రీడల నుండి స్వర్ణ పతకాలతో రెజ్లర్లు స్వదేశానికి వస్తే ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెలక్షన్ ట్రయల్స్ నుండి పురుష మల్లయోధులను మినహాయించిన బ్రిజ్ భూషణ్, మహిళా రెజ్లర్ల విషయంలో మాత్రం వివక్ష ప్రదర్శించారు. సెలక్షన్ ట్రయల్స్ కూడా అన్నీ ఆయన ఇష్టప్రకారమే జరుగుతాయి. రిఫరీ ఏం చేయాలో కూడా ఆయనే నిర్దేశిస్తారు. క్రీడాకారుల తరఫున వీసా దరఖాస్తులు పంపడంలో కూడా బ్రిజ్ అలసత్వం వహిస్తారు. దీంతో చాలా మందికి సకాలంలో వీసాలు రాక పోటీలకు దూరమయ్యారు. బ్రిజ్ ఎంత నిర్దయుడంటే విమానాశ్రయ టెర్మినల్‌లో కూడా మహిళా రెజ్లర్ల చేత వర్కవుట్లు చేయించారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్ల కోసం శిబిరాలు నిర్వహించే సమయంలో బ్రిజ్ వేరే విషయాలపై దృష్టి సారించే వారు. ప్రణాళికలు రచించడం, సమీక్షలు జరపడంలో ఆయన పాత్ర చాలా స్వల్పం. ఒక్క మాటలో చెప్పాలంటే అధ్యక్షుడికి ఇష్టం లేని మాటలు ఫెడరేషన్‌లో ఎవరూ చెప్పరు. కొంతమంది రెజ్లర్లను ఎంపిక చేసుకొని వారినే పదేపదే టోర్నమెంట్లకు పంపడంతో వారిపై ఒత్తిడి పెరిగి రిక్తహస్తాలతో తిరిగి వస్తున్నారు.

మూడు నెలల్లో నాలుగు పులులు మృత్యువాత

విచారణకు ఆదేశించిన అటవీశాఖ

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని దుద్వా నేషనల్ పార్క్‌లో గత మూడు నెలల్లో (ఏప్రిల్ 21 నుండి జూన్ 9) నాలుగు పులులు మృత్యువాతపడ్డాయి. పులులు చనిపోవడానికి గల కారణాలపై తాజాగా అటవీశాఖ విచారణకు ఆదేశించింది. పులులు చనిపోవడానికి గల కారణాలపై ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. అనంతరం తాజాగా పులుల మృత్యువాతపై నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ) కూడా విచారణ చేపట్టనుందని ప్రభుత్వ ఏజెన్సీ సంస్థ తెలిపింది. రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి శైలేష్ ప్రసాద్, వన్యప్రాణుల సంరక్షకుడు ఆర్‌కె సింగ్, ఎన్‌టిసిఎ అధికారి హేమంత్ సింగ్‌లతో కూడిన బృందం సోమవారం దుద్వా నేషనల్ పార్క్‌కు చేరుకోనుంది. ఇక పులుల మరణానికి గల కారణాలకు సంబంధించిన నివేదికను 15 రోజుల్లోగా ఎన్‌టిఎస్‌ఎ బృందం సమర్పించాలని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ ఎం.డి సజీద్ సుల్తాన్ ఎన్‌సిఎకి రాసిన లేఖలో పేర్కొన్నారు. అలాగే ఈ ఘటనకు సంబంధించి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని అటవీశాఖ ఎన్‌టిసిఎని ఆదేశించింది. దీంతో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదవీ విరమణ చేసి దుద్వా నేషనల్ పార్క్‌లో అనేక సంవత్సరాలు ఫీల్డ్ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రసాద్ ఈ విచారణ కమిటీకి నేతృత్వం వహించనున్నారని ఓ రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి తెలిపారు. పులుల ప్రాణనష్టానికి గల కారణాలను తెలుసుకునేందుకు, ఎన్‌టిసిఎ మార్గదర్శకాలు నిర్దేశించబడ్డాయో లేదో ఈ కమిటీ విచారించనుంది. ఇక అటవీమంత్రి అరుణ్ సక్సేనా నేతృత్వంలోని దర్యాప్తు బృందం జరిపిన దర్యాప్తులో మూడు పులుల అంతర్గత కొట్లాడుకోవడం వల్లే మృతి చెందాయని తేలినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. ఈ ఎన్‌టిపిఎ బృందం తన నివేదికను యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు అందజేయనుంది. ఇక వన్యప్రాణి (రక్షణ) చట్టం 1972లోని సెక్షన్ 38 ఎల్ (1) ప్రకారం ఎన్‌టిసిఎ ఏర్పాటు చేయడం జరిగింది.

డిఎస్ గ్రూప్ చేతికి గుడ్ స్టఫ్

న్యూఢిల్లీ : గుడ్ స్టఫ్‌నకు చెందిన ద లవ్‌ఇట్ చాక్లెట్ అండ్ కన్ఫెక్షనరీ బ్రాండ్లను ధరమ్‌పాల్ సత్యపాల్ గ్రూప్ (డిఎస్ గ్రూప్) సొంతం చేసుకున్నట్లు ప్రకటించింది. ద గుడ్ స్టఫ్ సంస్థకు లవ్ ఇట్ చాక్లెట్ అండ్ కన్ఫెక్షనరీ ఉంది. గతంలో ఇది గోల్డ్ మ్యాన్ సాచ్స్, మిట్సుయి వెంచర్స్ ఆధ్వర్యంలో ఉంది. డిఎస్ గ్రూప్‌నకు సంబంధించిన కన్ఫెక్షనరీ పోర్ట్ ఫోలియోలో మరింత వృద్ధిని సాధించే వ్యూహాత్మక నిర్ణయంలో భాగంగా దీన్ని సొంతం చేసుకున్నట్లు పేర్కొంది. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న డిస్ట్రిబ్యూషన్, గ్రాసరీ, రిటైల్ ఔట్‌లెట్స్ ద్వారా వ్యాపారాన్ని మరింత పెంచుకునందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది.

మిరే అసెట్‌కు రూ.1,240 కోట్ల నిధులు

ముంబయి : దక్షిణ కొరియాలోని సియోల్‌లోని తమ ప్రధాన కార్యాలయం నుంచి రూ.1,240 కోట్ల మూలధనాన్ని అందుకున్నట్లు మిరే అసెట్ క్యాపిటల్ మార్కెట్స్ ప్రకటించింది. దీంతో కలిపి తమ మొత్తం ఫండింగ్ విలువ రూ.3,190 కోట్లకు చేరుకుందని పేర్కొంది. నూతన నిధులను తమ రిటైల్ స్టాక్ బ్రోకింగ్ ఎం.స్టాక్ ప్లాట్ ఫామ్ ద్వారా బి2సి వ్యాప్తిని విస్తరించడానికి, సంస్థాగత వ్యాపారానికి, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ పునాదిని ఏర్పాటు చేయడానికి ఉపయోగించుకోనున్నట్లు తెలిపింది. ఏడాది కాలంలోనే 2.5 లక్షల పెయిడ్ అకౌంట్లు, 65 శాతం ఆక్టివ్ క్లయింట్ల నుంచి ఎం.స్టాక్ రూ.1.4 లక్షల కోట్ల టర్నోవర్ సాధించినట్లు తెలిపింది.

కండక్టర్లు, డ్రైవర్లపై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- నితిన్ గడ్కరీ వ్యాఖ్యలను ఖండించిన ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రవాణా యూనిట్లు (ఎస్‌టియు) కండక్టర్లు, డ్రైవర్లపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్‌టియుల కండక్టర్లు, డ్రైవర్లపై ఆరోపణలు చేశారని, డీజిల్ బస్సు, ఎలక్ట్రిక్ బస్సుకు ప్రతి కిలోమీటర్లకు ఆపరేషన్ ఖర్చుపై తప్పుడు ప్రకటన చేశారని మీడియాలో నివేదించబడిందని పేర్కొన్నారు. ఇలాంటి వార్తలను చూసి ఆశ్చర్యపోతున్నామని, సీనియర్, చాలా తెలిసిన మంత్రి నుంచి అలాంటి వ్యాఖ్యలు ఆశించలేదని పేర్కొన్నారు.

సిఐఐ వార్షిక సెషన్‌లో ప్రసంగిస్తూ రవాణా సంస్థలతో ఆదాయాన్ని పంచుకోని అక్రమ కండక్టర్ల ఉదంతాలను తగ్గించడానికి, ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో డీజిల్ చోరీకి అడ్డుకట్ట వేయాలని చెప్పినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. డీజిల్ బస్సుకు కిలోమీటరుకు ఆపరేటింగ్ ఖర్చు రూ.115 కాగా అది కేవలం ఎలక్ట్రిక్ బస్సుకు రూ.41 అవుతుందని, ఇవన్నీ పూర్తిగా అబద్ధాలు, నిరాధారమైనవి అని అన్నారు. కేంద్రం ఎస్‌టియులను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్పొరేషన్, ప్రజల కోసం తమ వంతుగా కృషి చేస్తున్న ఎస్‌టియుల కండక్టర్లు, డ్రైవర్లను అవమానించేలా వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. డీజిల్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ధరకు సంబంధించి కొంత వ్యత్యాసం ఉందని, కానీ గడ్కరీ నివేదించినంత ఎక్కువ కాదని అన్నారు. డీజిల్ లగ్జరీ బస్సు కంటే ఎలక్ట్రిక్ బస్సు ధర దాదాపు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రజలకు బస్సుల కొరత తీవ్రంగా ఉందని, ఈ తరుణంలో పరిమిత ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు కోసం ఖర్చు చేసిన మొత్తంతో తగినంత సంఖ్యలో డీజిల్ బస్సులను కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ మరోసారి డిమాండ్ చేస్తోందని తెలిపారు.

మత్స్యకారులను దోచుకున్న స్వచ్ఛంద సంస్థ

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

పక్కా ఇల్లు నిర్మిస్తామని చెప్పి మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులను చెన్నైకి చెందిన స్వచ్ఛంద సంస్థ నిలువునా దోచుకుంది. సుమారు 70 మంది మత్స్యకారుల నుంచి రూ.50 లక్షల వరకూ దోచుకున్నట్లు మత్స్యకారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముక్కాం గ్రామానికి చెందిన పాస్టర్ విశాఖలోని ఒక ఎమ్మెల్యే కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థకు చెందిన ఎపి కోఆర్డినేటర్‌ను కలిశాడు. అనంతరం నగరంలో జరిగిన ఒక చర్చి ప్రార్థనలో ఈ సంస్థ ప్రతినిధులు కలిశారు. పేదలకు పక్కా ఇల్లు కట్టిస్తామని అందుకు తమరు కొంత చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మీ సొంత స్థలంలో అర సెంటుకు రూ.60వేలు, సెంటుకు రూ.1.20లక్షలు చొప్పున చెల్లిస్తే తామే రూ. 10 లక్షలతో ఇల్లు నిర్మాణం చేపడతామని నమ్మబలికారు. ఇది నిజమేనని నమ్మిన పాస్టర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు సొమ్ము కట్టారు. ఇది తెలిసి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చోడిపల్లిపేట, ముక్కాం, పెద్ద రాజుపాలెం గ్రామాలకు చెందిన సుమారు 70 మంది మత్స్యకారులు రూ. 50 లక్షల వరకు చెల్లించారు. అంతేగాక తాము నివసిస్తున్న పూరిపాకలను తొలగించారు. అయితే 5 నెలల గడిచినా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాకపోవడంతో బాధితులు పాస్టర్‌ను ప్రశ్నించారు. ఆయనకు కూడా ఈ సంస్థ పేరు అనుమానం రావడంతో మోసపోయామని గుర్తించి ఆయనతోపాటు కొంతమంది బాధితులు వారం రోజుల కిందట భోగాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank
మైలవరం బ్రాంచ్ (6302)
మైలవరం, కృష్ణా జిల్లా-521230.
ఫోన్:08659-222225, 8331018962
ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు
తేది: 30.05.2023
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
అజిత్‌సింగ్ నగర్ బ్రాంచ్ (13757)
అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015, కృష్ణా జిల్లా. ఫోన్: 8333047107
ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు
తేది: 20.05.2023,
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
అజిత్‌సింగ్ నగర్ బ్రాంచ్ (13757)
అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015, కృష్ణా జిల్లా.- ఫోన్: 8333047107
ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు
తేది: 30.05.2023,
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015,
CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com
అనుబంధం-4
స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)
ప్రదేశం: గుంటూరు తేది: 13.06.2023

YES BANK
యస్ బ్యాంక్ లిమిటెడ్
క్రాంతి లర్నింగ్, డి.నెం.40/1/59, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520010
SARFAESI చట్టం నిబంధన 13(2) ప్రకారం నోటీసు ప్రకటన
తేదీ : 07-06-2023, ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యస్ బ్యాంక్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన
ICICI Home Finance
తేదీ: జూన్ 13, 2023
ప్రదేశం: గుంటూరు, విజయవాడ.
అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Repco Home Finance
రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)
తేది: 07.06.2022
అధీకృత అధికారి, రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

కేరళ రుణ పరిమితిపై కోత

కేంద్రానికి మాత్రం నిబంధనలు వర్తించవట • ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్న సర్కార్

తిరువనంతపురం : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కేరళ రుణ పరిమితిపై కోత విధించింది. చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ)లో మూడు శాతం వరకూ మార్కెట్ నుండి రుణం పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలు అమలు చేసిన రాష్ట్రాలకు అదనంగా మరో 0.5% రుణం పొందే అవకాశం ఉంది. అయితే కేంద్రం ఇటీవల రాష్ట్రాల రుణ పరిమితిని రెండు శాతానికి కుదించింది. తద్వారా రాష్ట్రాలను ఆర్థిక ఇబ్బందులలోకి నెట్టింది. కేరళ జీఎస్‌డీపీ రూ.11 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. మూడున్నర శాతం రుణ పరిమితికి అవకాశం ఇస్తే రాష్ట్రం రూ.38 వేల కోట్లు రుణం పొందవచ్చు. అయితే ఆర్థిక సంవత్సరంలోని మొదటి తొమ్మిది నెలల్లో కేవలం రూ.15,390 కోట్లు మాత్రమే రుణం పొందవచ్చునని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మిగిలిన మూడు నెలలలో రూ.5,131 కోట్ల రుణం తీసుకోవచ్చు. మొత్తంగా చూస్తే 2023-24లో కేరళ రూ.20,690 కోట్ల రుణం పొందే అవకాశం మాత్రమే ఉంది. దీంతో అసెంబ్లీ ఆమోదించిన బడ్జెట్‌లో పెద్ద ఎత్తున లోటు కన్పిస్తోంది.

రుణాలు ఎలా పొందుతారు?

రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ మార్గాలలో రుణాలు పొందుతాయి. మార్కెట్‌లో బాండ్లు విడుదల చేసి రుణం పొందవచ్చు. సెక్యూరిటీ డిపాజిట్లు, ప్రావిడెంట్ ఫండ్, ఇతర ట్రెజరీ డిపాజిట్లను రుణం రూపంలో వాడుకోవచ్చు. ఏదైనా పథకాన్ని అమలు చేసే ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రుణం పొందవచ్చు. ఉదాహరణకు కేరళ ప్రభుత్వం పెన్షన్ చెల్లింపుల కంపెనీ ద్వారా రుణం తీసుకుంటోంది. ఈ రుణం నుండి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్లు అందిస్తోంది. ఈ రుణాలనే బడ్జెటేతర రుణాలు అంటారు. ఏదైనా పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే ఈ తరహా రుణాలు తీసుకొని, ఆ పథకాలు అమలు చేస్తారు. లేదా ట్రెజరీలో నిధులు లేకపోతే అప్పుడు కూడా ఈ తరహా రుణాలు తీసుకుంటారు. ఇక ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు తమ సొంత పథకాల కోసం రుణం తీసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. కేరళలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు కోసం ఒక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డు ఆయా ప్రాజెక్టులకు అవసరమైన నిధుల కోసం రుణాలు సేకరిస్తుంది. ఇక ప్రభుత్వ గ్యారంటీ కానీ, ఆర్థిక సాయం కానీ లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు తమ ప్రాజెక్టుల కోసం రుణాలు తీసుకోవచ్చు. అయితే ఈ తరహా రుణాలన్నింటికీ పరిమితులు ఉంటాయి.

కేంద్ర రుణాలపై కాగ్ మౌనం

కేంద్ర ప్రభుత్వం విషయానికి వస్తే ప్రభుత్వ ద్రవ్యలోటు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని దాటిపోయింది. అది బడ్జెటేతర రుణాలు సైతం తీసుకుంటోంది. 2019-20లో తీసుకున్న ఈ రుణం రూ.3.27 లక్షల కోట్లు. బడ్జెటేతర రుణాల విషయంలో కేరళ ప్రభుత్వాన్ని తప్పుపట్టిన కాగ్, కేంద్రం విషయంలో మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. పైగా ద్రవ్యలోటులో ఈ రుణాలను చేర్చలేదు. ఇది ద్వంద్వ ప్రమాణాలు పాటించడమే అవుతుంది. కేరళ పెన్షన్ కంపెనీ తీసుకున్న బడ్జెటేతర రుణాల విషయంలో నికర రుణాలను కాకుండా స్థూల రుణాలను పరిగణనలోకి తీసుకున్నారు. కేరళ మౌలిక సదుపాయాల అభివృద్ధి బోర్డు చేపట్టిన ప్రాజెక్టులు బడ్జెట్‌లో లేవు.

ఈ బోర్డు తీసుకున్న రుణంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ట్రెజరీలో చేరలేదు. అయినప్పటికీ కేంద్రం ఈ రుణాలను బడ్జెటేతర రుణాలుగా పరిగణించలేదు. ప్రభుత్వ గ్రాంట్ల నుండే బోర్డు రుణాలను చెల్లిస్తోందంటూ వితండవాదం చేస్తోంది. అయితే ఈ వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదు. అదే సమయంలో కేంద్రం లక్ష కోట్ల రూపాయలకు పైగా కేటాయింపుతో 93 ప్రాజెక్టులు చేపట్టింది. కాగ్ ఆడిట్ నివేదిక మాత్రం దీనిని తప్పుపట్టలేదు.

కేంద్ర ప్రభుత్వ రుణాలు, ద్రవ్యలోటును లెక్కించేటప్పుడు బడ్జెట్, బడ్జెటేతర రుణాలను మినహాయిస్తూనే ఉన్నారు. రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి వివక్ష ప్రదర్శిస్తున్నారు. చట్ట ప్రకారం కేంద్రమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా జీడీపీలో పరిమితికి మించి రుణాలు తీసుకోకూడదు. తీసుకున్న రుణాన్ని రెవెన్యూ ఖర్చు కోసం వినియోగించకూడదు. రెవెన్యూ లోటును '0'గా చూపాలి. అయితే ఇప్పటివరకూ కేంద్రం ఈ నిబంధనలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ద్రవ్యలోటు 4-6% మధ్య కొనసాగుతోంది. ఈ విధంగా కేంద్రం తరచూ నిబంధనలు మారుస్తూ రాష్ట్రాలను ఇబ్బందుల పాలు చేస్తూనే ఉంది.

మన్యంలో భారీ వర్షం

చెట్టు కూలడంతో గృహాలు ధ్వంసం.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్

అరకులోయలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. మండలంలోని కొత్తబల్లుగూడ పంచాయతీ సరన్నాయిగూడ గ్రామంలో వృక్షం కూలడంతో మూడు ఇల్లులు ధ్వంసం కాగా నలుగురికీ స్వల్ప గాయాలు అయ్యాయి.ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వర్షం కురుస్తున్న సమయంలో పాంగి హేమ ఇంట్లో ఉండగా చెట్టు విరిగి పడటంతో తన తలపై బలమైన గాయం అయ్యింది. కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. అనంతగిరి:మండలంలో సోమవారం కుండపోత వాన కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక మండల వాసులు అవస్థలు పడుతున్నారుసోమవారం ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది మండల కేంద్రంలోని వారపు సంతలో చిరు వ్యాపారస్తులు బ్బందులకు గురయ్యారు.

బోరిస్ హానర్స్ లిస్ట్‌లో భారత సంతతికి చెందిన ప్రీతి పటేల్, కుల్వీర్ రేంజర్

లండన్ : బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ హానర్స్ జాబితాలో భారతీయ సంతతికి చెందినవారికి చోటు దక్కింది. బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన ప్రీతి పటేల్, కుల్వీర్‌సింగ్‌లు ఈ జాబితాలో ఉన్నారు. ప్రధానిగా పదవీచ్యుతులైన తర్వాత వారి గౌరవార్థం ప్రస్తుత ప్రధాని అధికారులకు, మంత్రులకు పదోన్నత కల్పించడాన్ని హానర్స్ లిస్ట్‌గా పేర్కొంటారు. ఇది బ్రిటన్‌లో గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. తాజా హానర్స్ జాబితాలో 38 అధికారులకు సునక్ గౌరవ పదోన్నతి కల్పించనున్నారు. ఏడుగురిని మంత్రులుగా తన క్యాబినెట్‌లోకి తీసుకోనున్నారు. ఇక మాజీ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్‌గా ఉన్న కుల్వీర్ రేంజర్ మరో ఉన్నత పదవికి ఎంపికయ్యారు.

200 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అదుపులో తీసుకొని, వారి నుండి 200 కేజీల గంజాయిని సోమవారం చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధి అన్నవరం వద్ద చింతపల్లి ఎస్ఐ రమణ ఆధ్వర్యాన స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లి ఏఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ఐ రమణ పోలీస్ సిబ్బంది లోతిగెడ్డ బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. రాళ్లగడ్డ నుంచి లోతుగెడ్డ బ్రిడ్జి వైపు ఒక టీవీఎస్ స్కూటీపై ఇద్దరూ అతివేగంగా వస్తూ పోలీసులను చూసి వెనక్కి బండిని వెనక్కి తిప్పబోయి అదుపుతప్పి కింద పడిపోయారు. అక్కడే బండిని వదిలేసి పారిపోయారు. దీంతో అనుమానం వచ్చి వాహన తనిఖీలు చేయగా, అదే సమయంలో వస్తున్న రెండు కారులు పోలీసులను నిలిపివేసి, అందులో ఉన్న వారు పారిపోతుండగా పోలీసులు అప్రమత్తమై గోపిల్లి నవీన్, రుత్తల బోడకొండ అనే ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించారు. కారులో గంజాయి రవాణా చేస్తున్నామని నిందితులు అంగీకరించారు. ఒక్కొక్క కారులో 100 కేజీలు గంజాయి చొప్పున 200 కేజీలు గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కార్లకు పైలెట్‌గా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులతో, కారులో వచ్చిన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు పరారయ్యారు. నిందితుల వద్ద నుంచి 200 కేజీల గంజాయి, రెండు కార్లు, ఒక స్కూటీ, ఒక కీప్యాడ్ మొబైల్, 2000 రూపాయలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పరారైన ఐదుగురు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎఎస్‌పి తెలిపారు. అరెస్ట్ అయిన ఇద్దరు వ్యక్తులపై గంజాయి కేసులు ఉన్నాయని చెప్పారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న ఎస్సై రమణ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి, చింతపల్లి ఎఎస్‌పి అభినందించారు. పట్టుబడిన నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిఐ రమేష్, ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

షిర్డీకి స్పెషల్ బస్సులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

షిర్డీకి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తక్కువ ఖర్చుతో రాయచోటి నుంచి ఈనెల 14న స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సు నడుపు తునట్లు డిపో మేనేజర్ ధనుంజయ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షిరిడికి రాను పోను బస్సు ఛార్జీ పెద్దలకు రూ. 4800, పిల్లలకు రూ. 2500 అని చెప్పారు. తుల్జా పూర్, శనిసిం గాపూర్, పండరిపురం చూపించుకుని తిరిగి రాయచోటికి చేరుతుందని అన్నారు. షిర్డీని దర్శించుకోవడానికి జనం ఆసక్తి చూపుతారని, కొంత మంది ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారని. అలాంటి వారి కోసం స్పెషల్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీలో తక్కువ ఖర్చుతో, సురక్షిత ప్రయాణం చేయవచ్చని అన్నారు.అలాగే ఈనెల 17న గోవాకు సూపర్ లగ్జరీ బస్సు నాలుగు రోజుల యాత్ర కోసం పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ. 2000 ఛార్జీ నిర్ణయించామన్నారు. పౌర్ణమికి అరుణాచలం అల్ట్రా డీలక్స్ బస్ ఏర్పాటు చేశామని, జులై 2న ఉదయం నాలుగు గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, గిరి ప్రదక్షిణ చేసి మరుసటి రోజు రాయచోటికి చేరుతుందని అన్నారు. ఛార్జీ 87గా నిర్ణయిం చామన్నారు. .ప్రతి యాత్రకు రిజర్వేషన్ సౌక ర్యం ఉందని అవకాశాన్ని రాయచోటి, చుట్టూ పక్క ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225776 లేదా రిజ్వేషన్ కౌంటర్ 8885177798లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

కూచిపూడిలో అన్విత ప్రతిభ



ప్రజాశక్తి-బూర్జ(శ్రీకాకుళం జిల్లా)

కూచిపూడి నృత్యంలో మండలంలోని కాళపర్తికి చెందిన బగాది అన్విత ప్రతిభ చాటింది. విజయవాడకు చెందిన ఇంటర్నేషనల్ కార్నటిక్ మ్యుజీషియన్, డాన్సర్స్ అసోసియేషన్ (ఐసిఎండిఎ) అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్యంలో అన్విత రెండో స్థానంలో నిలిచింది. జూనియర్స్ విభాగంలో 13 ఏళ్ల లోపు చిన్నారులకు ఈ పోటీలు నిర్వహించారు. అన్విత ఐదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు బగాది నాయుడు, సృజన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న అన్వితను పలువురు అభినందిస్తూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

రికార్డుల రారాజు జకోవిచ్

23గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో నయా చరిత్ర

పారిస్: సెర్బియాకు చెందిన 36ఏళ్ల నొవాక్ జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకొని నయా చరిత్రను నెలకొల్పాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో కాస్పర్ రూఢ్(నార్వే)ను 7-6(7-1), 6-3, 7-5తో ఓడించి కెరీర్ 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన ఏకైక ఆటగానిగా జకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్(22 గ్రాండ్‌స్లామ్) టైటిళ్లతో సమం నిలిచిన జకోవిచ్.. తాజాగా ఆ రికార్డును అధిగమించాడు. త్వరలో ప్రకటించిన డబ్ల్యుటిఏ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానంలో నిలవనున్నాడు. ఇప్పటివరకు జకోవిచ్(34), రోజర్ ఫెదరర్(31), రఫెల్ నాదల్(30) సార్లు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లలో ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రస్తుత తరం ఆటగాళ్లలో రఫెల్ నాదల్ ఫిట్‌నెస్ సమస్య కారణంగా ఏడాదిగా ఆటలకు దూరంగా ఉంటున్నాడు. జకోవిచ్‌ను ఓడించగల సత్తా ఉన్న ప్రస్తుత తరం ఆటగాళ్లలో ఎవరికీ లేదు. ఇక రఫెల్ నాదల్(22), రోజర్ ఫెదరర్(20) గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను కైవసం చేసుకొని రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

జకోవిచ్ నెగ్గిన గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు

ఆస్ట్రేలియాన్ ఓపెన్ : 10 (2008, 11, 12, 13, 15, 16, 19, 20, 21, 23)
ఫ్రెంచ్ ఓపెన్ : 3 (2016, 21, 23)
వింబుల్డన్ : 7 (2011, 14, 15, 18, 19, 21, 22)
యుఎస్ ఓపెన్ : 3 (2011, 15, 18)

వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ డ్రాపౌట్ సిద్ధం

ఐసిసి అనుమతే తరువాయి

ముంబయి: అక్టోబర్‌లో జరిగే ఐసిసి వన్డే ప్రపంచ కప్ డ్రాపౌట్ షెడ్యూల్‌ను బిసిసిఐ సిద్ధం చేసింది. ఆ షెడ్యూల్‌ను ఐసిసికి పంపి అనుమతి కోసం వేచిచూస్తోంది. ఆ షెడ్యూల్‌ను ఐసిసి తమ సభ్య దేశాలకు పంపినట్లు సమాచారం. ఈ టోర్నీకి సంబంధించిన డ్రాఫ్ట్ షెడ్యూల్ తాజాగా బయటకు వచ్చింది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌కు కూడా ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్ అక్టోబరు 15న గుజరాత్‌లోని నరేంద్రమోడీ స్టేడియంలో జరగనుంది. అహ్మదాబాద్‌లోని ఈ స్టేడియంలో లక్ష మందికి పైగా కూర్చొనే వీలుంటుంది. దీంతో స్టేడియం టికెట్ల అమ్మకాలు కూడా భారీగా ఉంటాయని బిసిసిఐ భావిస్తోంది. ఇక ఈ టోర్నీ భారత్‌లో తొమ్మిది వేదికల్లో జరగనుంది. బిసిసిఐ సిద్ధం చేసిన షెడ్యూల్ ప్రకారం2019 వన్డే ప్రపంచ కప్ ఫైనలిస్టులైన న్యూజిల్యాండ్, ఇంగ్లండ్ జట్లు.. ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌లో ఢీకొంటాయి. ఈ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగుతుంది. ఇక భారత జట్టు అక్టోబర్ 8న తన తొలి మ్యాచ్ ఆడుతుంది. చెన్నై వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడుతుంది. ఇక ఈ టోర్నీలో భారత్ ఆడే మ్యాచులు తొమ్మిది స్టేడియాల్లో జరగనున్నాయి. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, పూణే, ధర్మశాల, లక్నో, ముంబయి, కోల్‌కతా. అదే సమయంలో పాకిస్తాన్ ఆడే రెండు మ్యాచులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
అటవీ శాఖ
స్వల్పకాలిక టెండర్ నోటీసు నెం.1/2023-24

ఆర్.సి.నెం. 492/2023/ఎస్4, తేది: 03.06.2023

అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, గిద్దలూరు పరిధిలోని 2023-24 ఆర్థిక సం॥నకు 01.04.2023 నుండి 30.06.2023 వరకు వివిధ పనులకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు పిలువబడుచున్నవి. టెండర్ షెడ్యూల్ ఈ నోటీసు వెలువడిన నాటి నుండి 13.06.2023 మ. 3.30గం. వరకు పొందవలెను. ఇతర వివరాలకు ఈ కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPRNo:9777/CL/ADVT/1/1/2021-22 సం/- డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, గిద్దలూరు

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఆంధ్రప్రదేశ్. 0866-2567779, 9440905155

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. **దమ్మలపాటి శ్యామల, భర్త: డి హృదయ్ కుమార్,** హెచ్.నెం.2, మసీదు వీధి, లేబర్ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520012.
2. **దమ్మలపాటి హృదయ్ కుమార్, తండ్రి: దమ్మలపాటి శ్రీనివాసరావు,** హెచ్.నెం.2, మసీదు వీధి, లేబర్ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520012.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్ నుండి దమ్మలపాటి శ్యామల మరియు దమ్మలపాటి హృదయ్ కుమార్ పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	బకాయి మొత్తం	వడ్డీ రేటు
HL అకౌంట్ నెం. 160000231973	రూ. 29,13,000/- తేది: 29.09.2021	రూ. 29,79,517.86	11.45%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 29-05-2023 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.29,79,517.86 (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల డబ్బై తొమ్మిది వేల ఐదు వందల పదిహేడు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద [illegible]

తనఖా / తాకట్టు ఉంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

[illegible]

ఐటమ్ నెం-2: పైన తెలిపిన ఐటమ్ నెం. 1 స్థలంలో నిర్మించిన "అంజన గ్రీన్ పార్క్", 1వ అంతస్తులో ప్లింత్ ఏరియా 855 చ॥అ॥, కామన్ ఏరియా 114 చ॥అ॥, స్టిల్ట్ ఫ్లోర్‌లో 100 చ॥అ॥ పార్కింగ్ ఏరియా గల ఫ్లాట్ నెం. 218. అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు, ఉమ్మడి ఏరియాలు మరియు ఉమ్మడి సౌకర్యాలు మరియు మెయింటెనెన్స్ కొరకు చెల్లింపులు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు చెల్లించే రిపేరింగ్ ఛార్జీలు, ఉమ్మడి ఉపయోగ హక్కులుతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 31.05.2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ కెనరా బ్యాంక్

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) भारत सरकार का उपक्रम A Government of India Undertaking आन्ध्रा Andhra कार्पोरेशन Corporation
గవర్నర్‌పేట బ్రాంచి : కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రబోధ బుక్ సెంటర్ బ్రాంచి** వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 27-06-2023**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

1) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : శ్రీమతి సిద్దమ్మ గుర్రం, భర్త : జయరాజు మోట్రు, డి.నెం. సి-4 904 11-2, ఫ్లాట్ నెం. 302, రాఘవ రెసిడెన్సీ, జాఫర్ ఆలిబాగ్, పంజాగుట్ట, సోమాజిగూడ, హైదరాబాద్. **2) శ్రీ జయరాజు మోట్రు,** డి.నెం. సి-4 904 11-2, ఫ్లాట్ నెం. 302, రాఘవ రెసిడెన్సీ, జాఫర్ ఆలిబాగ్, పంజాగుట్ట, సోమాజిగూడ, హైదరాబాద్.

బకాయి మొత్తం : ది. 15-04-2021 నాటికి రూ. 14,62,476.80/- (అక్షరాలా పద్నాలుగు లక్షల అరవై రెండు వేల నాలుగు వందల డెబ్బై ఆరు రూపాయల ఎనభై పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : (సేల్ డీడ్ నెం. 7620/2013, తేది : 27-11-2013) గుర్రం సిద్దమ్మ & మోట్రు జయరాజు గారి పేరిట కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు, [illegible]

రిజర్వు ధర: రూ. 29,50,000/- ధరావత్తు: రూ. 2,95,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-

2) [illegible]

రిజర్వు ధర: రూ. 22,50,000/- ధరావత్తు: రూ. 2,25,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-

3) [illegible]

రిజర్వు ధర: రూ. 18,00,000/- ధరావత్తు: రూ. 1,80,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-

4) [illegible]

రిజర్వు ధర: రూ. 19,84,000/- ధరావత్తు: రూ. 1,98,400/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-

[illegible] www.ibapi.in [illegible] www.unionbankofindia.co.in [illegible] 7306142248 [illegible] ubin0812960@unionbankofindia.bank [illegible]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) [illegible] 15 రోజుల అమ్మకపు నోటీసు [illegible]

తేది : 09-06-2023 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బహిరంగ ప్రకటన
బ్రాంచి ఆఫీసు బదిలీ

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ రిజిష్టర్డు కార్యాలయము, ముంబయి - పూణే రోడ్డు, అకుర్డీ, పూణె - 411035 మరియు కార్పొరేటు కార్యాలయము 4వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్, విమాన్ నగర్, పూణె - అహ్మద్‌నగర్ రోడ్డు, పూణే, మహారాష్ట్ర-411014 వారు ఇందుమూలముగా తమ ఖాతాదారులకు మరియు సంబంధించిన వారికి తెలియజేయునది ఏమనగా తమ కార్యాలయం **డి.నెం.32-9-17, 2వ అంతస్తు, మధు మాలక్ష్మీ ఛాంబర్స్, జమ్మిచెట్టు సెంటర్, మొగల్రాజపురం, విజయవాడ వారు తేది.19.06.2023** నుండి సదరు కార్యాలయంలో జరిగే గోల్డ్ లోన్ సేవలను మూసివేసి మా నూతన బ్రాంచి చిరునామా **డి.నెం.40-7-18, 1వ అంతస్తు, చిన్మయి మెడికల్స్ పైన, పివిపి రోడ్డు, లబ్బీపేట, మొగల్రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010** నందు గోల్డ్ లోన్ సేవలు అందుబాటులో ఉంటాయి. గోల్డ్ లోన్ సంబంధిత సేవలు & సందేహాల కొరకు మా బ్రాంచి ఖాతాదారులందరూ మరియు సంబంధించినవారు మార్పు గమనించి మా నూతన గోల్డ్ లోన్ కార్యాలయం **డి.నెం.40-7-18, 1వ అంతస్తు, చిన్మయి మెడికల్స్ పైన, పివిపి రోడ్డు, లబ్బీపేట, మొగల్రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010** వద్ద ఇప్పటి నుండి సంప్రదించవలెను.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
4 వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్ కార్పొరేట్ ఆఫీస్, పూణె - అహ్మద్ నగర్ రోడ్, విమాన్ నగర్, పూణె, మహారాష్ట్ర 411 014, ఫోన్: 020-71505050
ప్రదేశం : విజయవాడ తేది : 12.06.2023

homefirst We'll take you home
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్
CIN-L65990MH2010PLC240703
వెబ్‌సైట్: : homefirstindia.com
ఫోన్ నెం. .: 180030008425
ఇ మెయిల్ ఐడి: : loanfirst@homefirstindia.com

స్వాధీనత ప్రకటన
[illegible]

క్ర. సం	ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారుల పేరు	తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం (రూ.లలో)	స్వాధీనత తేది
1.	కర్ణ శ్రీనివాస రావు, కర్ణ నాగమణి	డోర్ నెం.273 పడమర వైపు, డోర్ నెం.2-113, పొత్తూర్, పొత్తూరు గ్రామం & గ్రా.పం., గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-డివిజన్, గుంటూరు, ఆం.ప్ర., పిన్‌కోడ్-522005.	05-04-2023	12,58,473	07-06-2023
2.	పొట్ల మరియమ్మ, తుమ్మల రవి	ఇంటి నెం.983, డోర్ నెం.7-541 గ్రౌండ్, పుయ్యూరు, పుయ్యూరు గ్రామ పంచాయతీ, మండలం, పుయ్యూరు సబ్-రిజిస్ట్రార్, విజయవాడ, ఆం.ప్ర., పిన్‌కోడ్-	05-04-2023	17,50,550	07-06-2023

[illegible]

మరో 5 రోజులు భగభగలే : ఐఎండి

న్యూఢిల్లీ : దేశంలో ఎండలు మండిపోతున్నాయి. జూన్ నెల సగం గడిచినా పగటి ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. నైరుతి రుతు పవనాలు ఆలస్యం కావడంతో భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో మరో ఐదు రోజులు కూడా ఎండలు మండిపోతాయని భారత వాతావరణ కేంద్రం సోమవారం ప్రకటించింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్రాల్లో రాబోయే ఐదు రోజులపాటు ఎండలు మండిపోతాయని తెలిపింది. ఉత్తరప్రదేశ్ దక్షిణ భాగంలోని వేర్వేరు ప్రాంతాల్లో, పశ్చిమబెంగాల్‌లోని గంగానది పరిసర ప్రాంతాల్లో, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కూడా మరో ఐదు రోజులపాటు ఇప్పటిలాగే ఎండలు కొనసాగుతాయని పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో మరో రెండు రోజులు భానుడి ప్రతాపం కొనసాగుతుందని ఐఎండి చెప్పింది.

బెయిల్ కోసం హైకోర్టుకు గౌతమ్ నవ్‌లఖా

ముంబయి : బీమా కొరేగావ్ అల్లర్లు 2018 కేసులో అరెస్టయిన ఉద్యమకారులు, జర్నలిస్టు గౌతమ్ నవ్‌లఖా బెయిల్ కోరుతూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటీషన్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం హౌస్ అరెస్టులో ఉన్న గౌతమ్ నవ్‌లఖా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ ఎఎస్ గడ్కరీ, జస్టిస్ ఎస్‌జి డిగేలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ నెల 28లోగా ఈ పిటీషన్‌పై స్పందించాలని ఎన్ఐఎకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు ఏప్రిల్‌లో నవ్లఖా బెయిల్ పిటీషన్‌ను తిరస్కరించింది. దీంతో హైకోర్టును ఆశ్రయించారు.

వాట్సాప్ డీపీగా ఔరంగజేబు ఫొటో పెట్టుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

ముంబయి: మొబైల్ సర్వీస్ ప్రొవైడర్ అవుట్‌లెట్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు తన వాట్సాప్ డీపీగా ఔరంగజేబు ఫొటోను పెట్టుకున్నాడు. ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్ ను హిందూ సంస్థ పోలీసులకు సమర్పించింది. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 298, 153 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు చెప్పారు. ఔరంగజేబు, టిప్పు సుల్తాన్‌లను కీర్తించారనే ఆరోపణలపై ఇటీవల మహారాష్ట్రలోని వివిధ నగరాల్లో మతపరమైన ఉద్రిక్తత సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఔరంగజేబును కీర్తిస్తూ, మరాఠా జాతీయ చిహ్నాన్ని అగౌరవపరిచేలా చేసిన సోషల్ మీడియా పోస్ట్ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నిరసనలకు దారితీసింది. నగరంలోని కొన్ని మితవాద సంస్థల ప్రజలు జూన్ 7న కొల్హాపూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్ హింసాత్మక నిరసనలకు దారితీసింది. నిరసనకారులు బుధవారం రాళ్లతో దాడి చేసుకున్నారు.

చిన్నారులు బడి మానేస్తున్నారు !

- గుజరాత్, ఏపీ సహా ఏడు రాష్ట్రాల్లో అధికం

న్యూఢిల్లీ : సెకండరీ స్థాయిలో బడి మానేస్తున్న పిల్లల సంఖ్య ఏడు రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. ఈ రాష్ట్రాలలో ప్రధాని నరేంద్ర మోడీ ఇలాకా గుజరాత్ కూడా ఉంది. 2021-22లో జాతీయ సగటు 12.6% ఉండగా బీహార్ (20.46%), పంజాబ్ (21.7%), గుజరాత్ (20.3%), అసోం (17.85%), మేఘాలయ (17.2%), ఆంధ్రప్రదేశ్ (16.7%), కర్నాటక (14.6%) రాష్ట్రాలు దానిని దాటేశాయి. బడి మానేస్తున్న పిల్లల సంఖ్యలో బీహార్ ప్రథమ స్థానంలో ఉంది. సమగ్ర శిక్షా కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలలో ఈ వివరాలను అందజేశారు. వీటి ప్రకారం ప్రాథమిక స్థాయికి సంబంధించి పశ్చిమబెంగాల్‌లో పరిస్థితి మెరుగుపడుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో చాలా మంది పిల్లలు పాఠశాలలకు వెళ్లడం లేదు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో సెకండరీ స్థాయిలో డ్రాపవుట్ రేటు తగ్గుతోంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలలో వార్షిక సగటు డ్రాపవుట్ రేటు చాలా అధికంగా ఉంది. అదే సమయంలో రాజస్థాన్‌లో ఈ రేటు నిలకడగా తగ్గుతూ వస్తోంది. అయితే సెకండరీ స్థాయిలో ఎస్టీలు, ముస్లింలలో మాత్రం ఈ రేటు చాలా ఎక్కువగా ఉంది.

వ్యక్తిగత డేటా లీకేజీపై విచారణ జరపాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : కొవిన్ పోర్టల్ నుండి పెద్ద ఎత్తున డేటా లీకయిందని వచ్చిన వార్తలపై తక్షణమే విచారణ జరపాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోవడం కోసం తమ వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకున్న కొవిన్ పోర్టల్ నుండి ఆధార్ కార్డు నెంబర్లతో సహా ప్రజల వ్యక్తిగత సమాచారం లీకైనట్లు వార్తలు వచ్చాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, పైగా భారతీయుల ప్రాథమిక హక్కుగా సుప్రీం కోర్టు ప్రకటించిన గోప్యతా హక్కును ఉల్లంఘిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. గతంలో ఇటువంటి ఆరోపణలే రాగా, 2021 జూన్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. అయినప్పటికీ కొవిన్ వ్యవస్థ నుండి లీకేజీ జరిగిందన్న ఆరోపణలపై సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కంప్యూటర్ హ్యాకింగ్ గ్రూపైన కంప్యూటర్ ఎమర్జన్సీ రెస్పాన్స్ టీమ్‌తో దర్యాప్తుకు ఆదేశించింది. ఈ దర్యాప్తు వివరాలు ఇంకా పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు. వెంటనే ఈ మొత్తం వ్యవహారంపై కూలంకషంగా దర్యాప్తు జరగాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. భారతీయుల వ్యక్తిగత సమాచార భద్రతలో జరిగిన ఇంత తీవ్ర ఉల్లంఘనకు బాధ్యులైన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది.

కోవిన్ డేటా ఉల్లంఘనపై విచారణ జరిపించాలి ప్రతిపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ: కోవిన్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేసుకున్న పౌరుల డేటా ఉల్లంఘన జరిగిందంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు సోమవారం డిమాండ్ చేశాయి. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన డేటా చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని అవి కోరాయి. పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కును పరిరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించాయి. కోవిన్ డేటా సురక్షితమని, ప్రభుత్వం ఇంతవరకు చెబుతున్నది ఒట్టి బూటకమని తాజా ఉదంతంతో తేటతెల్లమైందని కాంగ్రెస్ విమర్శించింది.కోవిన్ యాప్ లేదా డేటా నేరుగా ఉల్లంఘించినట్టు ఎక్కడా కనిపించడం లేదని నోడల్ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి. ఇన్) చెప్పడాన్ని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తప్పుపట్టారు. కేంద్ర సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్ నేరపూరిత నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమని ఆయన అన్నారు.డిజిటల్ ఇండియా ఉన్మాదంలో మోడీ ప్రభుత్వం పౌరుల గోప్యతను ఘోరంగా విస్మరిస్తున్నదని ఆయన విమర్శించారు. టిఎంసి అధికార ప్రతినిధి సాకేత్ గోఖలే కూడా కోవిన్ డేటా చౌర్యాన్ని తీవ్రంగా విమర్శించారు.

15న గుజరాత్ వద్ద తీరం దాటనున్న బిపార్‌జాయ్ తుపాను

- ప్రధాని మోడీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

న్యూఢిల్లీ, అహ్మదాబాద్ : అత్యంత తీవ్రంగా మారిన బిపార్‌జాయ్ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని కచ్ జిల్లా, పాకిస్తాన్‌లోని కరాచి మధ్య తీరం దాటుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. ఈ తుపాను వల్ల కలిగే నష్టాన్ని నివారించడానికి గుజరాత్ ప్రభుత్వం తీరప్రాంతాల్లో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను మోహరించింది. ఆరు జిల్లాల్లో షెల్టర్లను ఏర్పాటు చేస్తోంది. తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లతో, సైనిక, నావికా, తీరప్రాంత రక్షణదళాల ప్రతినిధులతో, అధికారులతో గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్ సమావేశం నిర్వహించారు. కచ్ తీర ప్రాంతాల్లో 144వ సెక్షన్ విధించారు. పిపావవ్ పోర్టులో కార్యకలాపాలు నిలిపివేశారు.

భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం : ఐఎండి

తుపాను ప్రభావం కారణంగా పలుజిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందని, 12నుండి 16వ తేదీల మధ్య బలమైన గాలులు వీచే అవకాశం వుందని ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. ఆయా ప్రాంతాల్లో చేపల వేటను మొత్తంగా నిలిపివేయాల్సిందిగా కోరింది. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలకు ఆరంజ్ అలర్ట్‌ను ఐఎండి జారీ చేసింది. పరిస్థితులను సమీక్షించడానికి ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పల్లపు ప్రాంతాల్లోని ప్రజలందరినీ తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాల్సిందిగా ప్రధాని ఆదేశించారు.

రాహుల్‌గాంధీకి ఊరట

ముంబయి: పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. కోర్టు హాజరు నుంచి మినహాయింపునిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ముంబయి హైకోర్టు ఆగస్టు 2 వరకు మినహాయింపునిచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మోడీ ఇంటిపేరుపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకుగానూ బిజెపికి చెందిన మహేశ్ శ్రీమల్ 2021లో పరువునష్టం పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే అంశంలో గుజరాత్ బిజెపి ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ పరువునష్టం దావా వేయడంతో.. సూరత్ కోర్టు రాహుల్‌గాంధీని దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించిన న్యాయస్థానం.. వెంటనే బెయిల్ కూడా మంజూరు చేసింది. ఈ తీర్పును పై కోర్టులో అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. రెండేళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని లోక్‌సభ సెక్రెటేరియేట్ రద్దు చేసింది. దీనిని సవాల్ చేస్తూ రాహుల్‌గాంధీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు విధించిన శిక్షను నిలిపేయాలంటూ వేసిన స్టే పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు తిరస్కరించిన నేపథ్యంలో.. న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ ఆయన తాజాగా గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టాల్సి ఉంది.

బెంగాల్‌లో టిఎంసి గూండాల అరాచకం

- పంచాయతీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల నామినేషన్ అడ్డగింత
- దాడులు, పార్టీ కార్యాలయాలు ధ్వంసం
- పలువురికి తీవ్రగాయాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో అధికార తృణమూల్ కాంగ్రెస్ గూండాలు బరి తెగిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముఖ్యంగా సిపిఎం అభ్యర్థులు నామినేషన్ వేయకుండా దాడులకు దిగుతున్నారు. పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు. టిఎంసి గూండాల దాడిలో అనేక మంది ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు గాయపడ్డారు. సోమవారం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఇలాంటి దాడులు అనేకం జరిగాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి వెళుతున్న ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై దాడులు జరిగాయని ఆయన చెప్పారు. బసిర్హాట్ సబ్ డివిజన్‌లోని మినాఖాన్‌లోని సిపిఎం కార్యాలయంపై దాడి జరిగిందని, నామినేషన్ దాఖలు చేయడానికి వెళుతున్న పార్టీ అభ్యర్థిని తీవ్రంగా గాయపర్చారని అధికారి చెప్పారు. బాన్‌కురా జిల్లాలోని సోనాముఖిలో జరిగిన మరొక ఘటనలోనూ నామినేషన్ వేయడానికి వెళుతున్న ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిపైనా దాడి జరిగిందని చెప్పారు.

ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై దాడులు జరుగుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) కూడా ప్రకటించింది. 'ఇలాంటి దాడులు అనేకం జరిగినట్లు నివేదికలు వచ్చాయి. జిల్లా మేజిస్ట్రేట్, ఎస్‌పిలను ఈ దాడులపై పూర్తి వివరాలను కోరాం' అని ఎస్ఇసికి చెందిన సీనియర్ అధికారి ఒకరు మీడియాకు చెప్పారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద ఒక కిలోమీటర్ వ్యాసార్థంలో సిఆర్‌పిసి సెక్షన్ 144ను అమలు చేయాలని అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లకు, ఎస్‌పిలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ 10 వేలకు పైగా నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయని తెలిపింది.

16 వరకూ నామినేషన్ గడువు పొడిగింపు

పంచాయితీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసే గడువును పొడిగించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను మోహరించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు సానుకూలంగా స్పందించింది. నామినేషన్ దాఖలు గడువును ఈ నెల 16 వరకూ పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. జులై 8న పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయి.

మినాఖాన్ పార్టీ కార్యాలయంపై దాడులు పలువురు నేతలకు తీవ్రగాయాలు

మినాఖాన్‌లోని సిపిఎం కార్యాలయంపై టిఎంసి గూండాలు దాడికి తెగబడ్డారు. సిపిఎం అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి సిద్ధపడుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు సామాగ్రిని నాశనం చేశారు. ఈ దాడిలో ఐద్వా సిఇసి సభ్యులు, ఉత్తర 24 పరగణాల నాయకులు సోమదాస్ తీవ్రంగా గాయపడ్డారు. ఇంకా పలువురు అభ్యర్థులు, కార్యకర్తలు కూడా గాయపడ్డారు.

టిఎంసి హింసాకాండకు వ్యతిరేకంగా సిపిఎం నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. పురులియాలోని పుంచాలో జరిగిన ర్యాలీలో కేంద్ర కమిటీ సభ్యులు అమియా పాత్ర ప్రసంగించారు. దక్షిణ 24 పరగణ జిల్లాలోని కుల్తాలిలో జరిగిన సభలో కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి ప్రసంగించారు. పంచాయితీ ఎన్నికల్లో టిఎంసి, బిజెపిలను ఓడించి ప్రజల కోసం పనిచేసే పంచాయతీలను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రగతిశీల ఆలోచనలకు వెలుగురేఖ కేరళ

- అమెరికాలోని ప్రవాసుల సమావేశంలో సిఎం విజయన్

న్యూయార్క్ : కేరళ ప్రగతిశీల ఆలోచనల వెలుగుగా ప్రకాశిస్తోందని, ఇక్కడ ప్రతి గొంతుకకు ప్రాముఖ్యత ఉందని, ఐక్యతా స్ఫూర్తి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. టైమ్స్ స్క్వేర్‌లో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ఆదివారం విజయన్ వందలాదిమంది ప్రవాస కేరళ సంఘం సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యూయార్క్‌లో ప్రవాస కేరళీయుల సదస్సు, లోక కేరళ సభ అమెరికన్ ప్రాంతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. గత ఆరేళ్లలో ప్రతి రంగంలోనూ భారీ ప్రగతి సాధించామని చెప్పారు. కేరళ ప్రగతిశీల విలువలు, సామాజిక సామరస్యం, సమానమైన వృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నదని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య వ్యవస్థ, ఇతర రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి , పెట్టుబడులు, తన పరిపాలన ద్వారా సాధించిన ఆర్థిక వృద్ధి, అభివృద్ధిని వివరించారు. సమ్మిళిత అభివృద్ధికి కేరళ రాష్ట్రం ఒక నమూనా అని, ప్రజల కేంద్రీకత ప్రగతికి ఉదాహరణగా అవతరించిందన్నారు. "మా విధానాలు అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పిస్తాయి

. అందరికీ సమాన అవకాశాలను పెంపొందిస్తాయి" అని ముఖ్యమంత్రి అన్నారు. కేరళ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని, దీని ఫలితంగా జాతీయ ఆహార భద్రత సూచికలో రాష్ట్రం ప్రధాన స్థానాన్ని సాధించిందని చెప్పారు. కేరళ అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రమని, నీతి ఆయోగ్‌తో సహా అనేక ఏజెన్సీలు దేశంలోనే ప్రభుత్వ పాఠశాలలు , ఆస్పత్రులను అత్యుత్తమమైనవిగా గుర్తించాయని విజయన్ పేర్కొన్నారు.

"మాకు అత్యుత్తమ శాంతి భద్రతలు ఉన్నాయి. మత సామరస్యం , శాంతియుత సహజీవనం ఎల్లప్పుడూ ఉండేలా చేయడం వల్లే ఇదంతా సాధ్యమైంది. గత కొన్నేళ్లుగా కేరళలో ఒక్క మత హింస కూడా జరగలేదని "ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య సిఎం చెప్పారు. "మీ భూమిని మరింత సంపన్నం చేసేందుకు రాబోయే కాలంలో మాతో సహకరిస్తూ ఉండండి" అని ఆయన అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మలయాళీలకు పిలుపునిచ్చారు.

సుప్రీం పర్యవేక్షణలో సిట్‌తో స్వతంత్ర విచారణ

- బాలాసోర్ ప్రమాదంపై 12 ప్రతిపక్ష పార్టీల డిమాండ్

భువనేశ్వర్ : బాలాసోర్ రైలు ప్రమాదంపై సుప్రీం కోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్వతంత్ర విచారణ జరపాలని 12 ప్రతిపక్ష పార్టీలు సోమవారం డిమాండ్ చేశాయి. బీహార్, పశ్చిమ బెంగాలకు చెందిన 119 మంది రైల్వే ప్రయాణికుల మృతదేహాలను గుర్తుపట్టలేకపోవడంతో పరిస్థితి చాలా కీలకంగా మారిందని ఆ పార్టీలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రైల్వే వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా వుందో ఈ ప్రమాదం స్పష్టంగా తెలియజేస్తోందని పార్టీలు పేర్కొన్నాయి. ఆ 12 పార్టీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ-ఎంఎల్(లిబరేషన్), అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్, ఆప్, ఎన్‌సిపి, సోషలిస్టు పార్టీ, ఆర్‌జెడి, సమతా క్రాంతి దళ్‌లు వున్నాయి. ఇక్కడ రాజ్‌భవన్ ఎదురుగా ఈ పార్టీల నేతలు ఆందోళన నిర్వహించారు.

సిబిఐ విచారణను వారు తీవ్రంగా వ్యతిరేకించారు, దీనివల్ల బాధితులకు, వారి కుటుంబాలకు న్యాయం జరగదని అన్నారు. నిపుణులతో కూడిన సిట్ సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మరణించినవారి కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి తగిన ఆర్థిక సాయం అందచేయాలని కోరారు. మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం కలిగిన బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలన్నారు. మరణించిన, గాయపడిన వారి జాబితాను వార్తాపత్రికల్లో ప్రచురించాలని సిపిఎంకి చెందిన సురేష్ పాణిగ్రాహి డిమాండ్ చేశారు. రైల్వే మంత్రి రాజీనామా చేయాలన్నారు. నిర్లక్ష్యపూరితమైన ట్రాఫిక్ నిర్వహణ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని పార్టీలు విమర్శించాయి.

హర్యానాలో అన్నదాతల ఆందోళన..

- కురుక్షేత్ర-ఢిల్లీ జాతీయ రహదారి దిగ్బంధం

అమృత్‌సర్: హర్యానాలో రైతుల ఆందోళన తీవ్రరూపం దాల్చింది. జాతీయ రహదారి-44 ను రైతులు దిగ్బంధించారు. పొద్దు తిరుగుడు పంటకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న రైతులకు ఉత్తర ప్రదేశ్, పంజాబ్ రైతులు మద్దతు తెలిపారు. రైతులకు రెజ్లర్లు సైతం మద్దతు తెలిపారు. రైతులు సోమవారం హర్యానాలోని కురుక్షేత్ర వద్ద ఢిల్లీ-అమత్‌సర్ జాతీయ రహదారిని(ఎన్‌హెచ్ 44) దిగ్బంధం చేశారు. పొద్దు తిరుగుడు పువ్వు గింజలకు కనీస మద్దతు ధర ఇవ్వకూడదని హర్యానా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు జాతీయ రహదారిని దిగ్బంధం చేయడంతో ఢిల్లీ-అమృత్‌సర్ జాతీయ రహదారి మీద ట్రాఫిక్ స్తంభించిపోయింది. పొద్దుతిరుగుడు విత్తనాలకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. కురుక్షేత్ర జిల్లాలోని పిప్లి సమీపంలోని ఫ్లై ఓవర్‌పై వారు గుమిగూడారు. మహాపంచాయత్‌లో భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేష్ తికాయత్‌తో సహా కీలక రైతు నాయకులతో పాటు, రెజ్లర్ బజరంగ్ పునియా కూడా ఉన్నారు. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు విత్తనాలను మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని, తమ ఉత్పత్తులను క్వింటాల్‌కు రూ. 6,400 ఎంఎస్‌పికి రూ.4,000 చొప్పున ప్రైవేట్ కొనుగోలుదారులకు విక్రయించాల్సి వచ్చిందని నిరసన వ్యక్తం చేసిన రైతులు పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలను క్వింటాల్‌కు రూ.6,400 ఎంఎస్‌పితో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

స్ట్రింగర్లకు తొలగింపులు కాదు..

- వేతనాలు కావాలి : డియుజె
- స్మృతి ఇరానీ, దైనిక్ భాస్కర్ తీరుపై విమర్శలు

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్ - న్యూఢిల్లీ : స్ట్రింగర్లకు తొలగింపులు కాదు.. వేతనాలు కావాలని ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ (డియుజె) పేర్కొంది. న్యూస్ బైట్ కోసం ఒక జర్నలిస్టు చేసిన అభ్యర్థనపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, దైనిక్ భాస్కర్ యాజమాన్యం చేసిన ఓవర్‌యాక్షన్‌పై డియుజె దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమేథిలోని కృష్ణనగర్ చౌరహాలో పర్యటనకు వచ్చి తిరిగి వెళుతున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఇతర స్థానిక మీడియా ప్రతినిధులతో కలిసి కెమెరాపర్సన్ విపిన్ యాదవ్ ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి అహంకారంగా, చిరాకుగా సమాధానం ఇచ్చారు. పైగా దైనిక్ భాస్కర్ యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తానని బెదిరించారు. ఈ డియో సామాజిక మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో యాదవ్‌ను, స్ట్రింగర్ రషీద్ హుస్సైన్‌ను తక్షణమే దైనిక్ భాస్కర్ యాజమాన్యం తొలగించింది. ఆ ప్రాంతంలో తమకు జర్నలిస్టు లేరని కూడా దైనిక్ భాస్కర్ ట్వీట్ చేసింది. జర్నలిస్టును బహిరంగంగా అవమానించిన యాజమాన్యం మైక్ ఐడిని తిరిగి ఇవ్వాలని ప్రైవేట్‌గా డిమాండ్ చేసింది. అధికారిక ఒప్పందం లేనప్పుడు ఇలాంటి మైక్ ఐడిలే ఉపాధికి ప్రధాన రుజువు. స్ట్రింగర్లుకు తక్కువ వేతనం ఉంటుంది. ఇలాంటి ఉద్యోగులను అధికారబద్ధం చేయాలని, తగిన వేతనాలు ఇవ్వాలని డియుజె డిమాండ్ చేసింది. జర్నలిస్టులను అవమానించే బదులు వారికి తగిన గౌరవం ఇవ్వాలని డియుజె సూచించింది.

ప్రధాని మోడీ మౌనం బాధించింది

- క్రీడల మంత్రి ఆసక్తిగా లేరు
- 15న భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రకటిస్తాం
- రెజ్లర్ వినేష్ ఫోగట్
- మూడు దేశాల్లో ఢిల్లీ పోలీసుల దర్యాప్తు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అంశంపై ప్రధాని మోడీ మౌనంగా ఉండటం తనను తీవ్రంగా బాధించిందని అంతర్జాతీయ రెజ్లర్ వినేష్ ఫోగట్ అన్నారు. క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో రెజ్లర్ మాట్లాడుతుండగా, ఆయన తన మొబైల్‌లో బిజీగా ఉన్నాడని, ఆయన తమ ఫిర్యాదులను వినడానికి ఆసక్తి చూపలేదని పేర్కొన్నారు. వినేష్ ఫోగట్ మీడియాతో మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందునే అరెస్టు చేయలేకపోతున్నారని అన్నారు. దేశం కోసం ఆడుతున్న రెజ్లర్లు తమ కార్యకలాపాలు నిలిపివేసి, ఇన్ని రోజులు ధర్నా చేసినా ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని, ప్రధాని మౌనం నాకు బాధ కలిగించిందని అన్నారు.

క్రీడా మంత్రి మొబైల్‌లో బిజీగా ఉన్నారని విమర్శించారు. జూన్ 7న నిరసన తెలిపిన రెజ్లర్ల చర్చలకు ఆహ్వానించిన క్రీడా మంత్రి ఆ సమావేశంలో ఆయన దృష్టి తమ వైపు లేదని వినేష్ చెప్పారు. తమ బాధలు వినకుండా మొబైల్‌తో బిజీ అయిపోయారని, తమ ఫిర్యాదులను వినడానికి ఆసక్తి చూపలేదని పేర్కొన్నారు. జూన్ 15న కేసు ఛార్జిషీటును అందజేస్తామని, జూన్ 30లోగా డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహిస్తామని అందులో హామీ ఇచ్చారని అన్నారు.

జూన్ 15 తర్వాత కీలక నిర్ణయం

క్రీడల మంత్రి ప్రకటన ప్రకారం ఛార్జ్ షీట్ కోసం ఎదురుచూస్తున్నామని వినేష్ ఫోగట్ తెలిపారు. ఆ తరువాత కూడా బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆ రోజు రాత్రి (జూన్ 15) సమావేశం నిర్వహించి, మరుసటి రోజు ఉద్యమాన్ని నిర్ణయించి ప్రకటిస్తామన్నారు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు ప్రభుత్వం అనుమతించకపోతే, రాంలీలా మైదాన్‌లో, మరేదైనా ప్రాంతంలో ఆందోళన చేపడతామని అన్నారు. శిక్షణ శిబిరాలు, టోర్నమెంట్‌లలో బ్రిజ్ భూషణ్ యువ మహిళా రెజ్లర్‌లను ఒంటరిగా ఉన్నప్పుడు వారిని తాకడానికి సాధ్యమైన అన్ని మార్గాలను ఉపయోగించాడని వినేష్ ఫోగట్ విమర్శించారు. ఇది మళ్లీ మళ్లీ జరిగేదని, కానీ భయంతో అందరూ మౌనంగా ఉండేవారని అన్నారు.

ఢిల్లీ పోలీసుల చర్యల్లో, 3 దేశాల నుండి సహాయం కోరింది

మాజీ చీఫ్ సింగ్‌పై లైంగికంగా వేధింపుల కేసులో అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్, ఫిజియోథెరపిస్ట్ నుండి వాంగ్మూలం తీసుకున్న తరువాత ఇప్పుడు ఢిల్లీ పోలీసులు దర్యాప్తులో కజకిస్తాన్, మంగోలియా, ఇండోనేషియా నుండి సహాయం కోరారు. సింగ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన ప్రదేశాలకు సంబంధించిన సిసిటివి ఫుటేజీలు, ఫోటోలను అందించాలని వారి రెజ్లింగ్ సంఘాలకు నోటీసులు పంపారు. 2016, 2022లో మంగోలియాలో, 2018లో ఇండోనేషియాలో సింగ్ అనుచితంగా ప్రవర్తించాడని రెజ్లర్లు ఆరోపించారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫోటోలు, ఆడియో, వీడియో సాక్ష్యాలను కోరుతూ ఢిల్లీ పోలీసులు ఇద్దరు మహిళా రెజ్లర్లకు నోటీసులు పంపారు. ఇందులో ఆయన హోటల్ బస దగ్గర్నుంచి రూమ్‌మేట్స్ వరకు అన్నీ అడిగారు.

ఇటలీ మాజీ ప్రధాని బెర్లుస్కోనీ మృతి



మిలన్ : ఇటలీ మాజీ ప్రధాని, దేశంలోనే అతిపెద్ద మీడియా కంపెనీని స్థాపించిన వ్యాపారవేత్త సిల్వియో బెర్లుస్కోనీ (86) సోమవారం మరణించారు. ల్యుకేమియాతో బాధపడుతున్న ఆయనకు ఇటీవలే ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకింది. ప్రధాని జార్జియా మెలోని మితవాద సంకీర్ణంలో బెర్లుస్కోనీ పార్టీ భాగస్వామిగా వున్నందున ఆయన మృతితో రాబోయే మాసాల్లో ఇటలీ రాజకీయాల్లో మార్పులు వచ్చే అవకాశం వుంది. 1936లో మిలన్‌లో ఆయన జన్మించారు. 1994-95, 2001-2006, 2008-2011మధ్య కాలంలో ఆయన ప్రధానిగా చేశారు. 1996లో అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొన్నారు. తప్పుడు లెక్కలు చూపించినందుకు 16మాసాలు జైలు శిక్ష విధించగా, అప్పీల్‌పై నిర్దోషిగా విడుదలయ్యారు. 2008లో ప్రధానిగా ఎన్నికైనా దేశంలో చెలరేగిన ఆర్థిక సంక్షోభం సమయంలో రాజీనామా చేశారు. తన మీడియా సామ్రాజ్యం ద్వారా పన్నుల్లో అవకతవకలకు పాల్పడినందుకు నాలుగేళ్ల శిక్ష అనుభవించి, పదవి పోగొట్టుకున్నారు.

అమెరికా ఆంక్షలను వ్యతిరేకించిన చైనా

బీజింగ్ : ఇరాన్ సంబంధిత సాకులతో చైనాకు చెందిన కొన్ని కంపెనీలపై, వ్యక్తులపై ఆంక్షలు విధిస్తూ అమెరికా తీసుకున్న చర్యను చైనా వ్యతిరేకిస్తోందని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి సోమవారం తెలిపారు. అమెరికా తీసుకున్న ఈ చర్యలో వాస్తవిక ప్రాతిపదిక కొరవడిందని, పైగా ఈ చర్య తీసుకోవడానికి ముందు అనుసరించాల్సిన క్రమం కొరవడిందని అన్నారు. చైనా సంస్థల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలు దీంతో దెబ్బతింటాయన్నారు. అమెరికా చర్యకు సంబంధించి అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. చైనా సంస్థలపై, వ్యక్తులపై హేతుబద్ధం కాని అణచివేత చర్యలను అమెరికా తక్షణమే ఆపాలని కోరారు. తమ చట్టబద్ధ హక్కుల పరిరక్షకు అవసరమైన చర్యలను చైనా తీసుకుంటుందని చెప్పారు.

బ్రిటన్‌లో తక్షణమే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలి

- లేబర్ పార్టీ నేతల పిలుపు

లండన్ : మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ శుక్రవారం రాత్రి తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేసిన నేపథ్యంలో తలెత్తిన పరిణామాలతో దేశంలో వెంటనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాల్సిందిగా లేబర్ పార్టీ డిమాండ్ చేసింది. జాన్సన్ రాజీనామా చేసిన కొద్ది సేపటికే ఆయన సన్నిహితుడు నదినె డోరిస్ కూడా రాజీనామా చేశారు. ఆ వెనువెంటనే మూడో టోరీ ఎంపి నైగెల్ అడమాస్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ మూడు స్థానాలకు ప్రభుత్వం ఉప ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వంలో నెలకొన్న గందరగోళం, అస్తవ్యస్థ పరిస్థితులకు ఎలాంటి పరిష్కారం లేదని లేబర్ పార్టీ షాడో ఆర్థిక మంత్రి పాట్ మెక్‌ఫాడెన్ వ్యాఖ్యానించారు. తక్షణమే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలంటూ లేబర్ నేత కెయిర్ స్టార్మర్ ఇచ్చిన పిలుపుతో ఏకీభవించారు. కన్జర్వేటివ్ పార్టీలో ఈ గందరగోళ ధోరణి కొనసాగుతునే వుంటుందని, దీనికి ఏకైక పరిష్కారం సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమేనన్నారు. ప్రభుత్వ మార్పు అన్నిటికీ పరిష్కారమని వ్యాఖ్యానించారు. షాడో విదేశాంగ మంత్రి డేవిడ్ లామే కూడా ఇదే రీతిలో పిలుపిచ్చారు. ప్రజలెవరితోనైనా మాట్లాడినా వారందరూ కూడా తాకట్లు, ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరుగుదల ఇటువంటి వాటిగురించే మాట్లాడుతున్నారు, ఇటువంటి తీవ్రమైన పరిస్థితుల్లో సమైక్య ప్రయోజనం కోసం దేశం ముదుకు సాగాల్సి వుందన్నారు. మరోవైపు జాన్సన్ రాజకీయ భవితవ్యంపై కూడా ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

మీకోసం

బెండకాయ వేపుడు చేసేటప్పుడు అందులో ఒక స్పూన్ పెరుగు కలపడం వల్ల ముక్కలు అతుక్కోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

కష్టపడాలనుకునే వారికి వంద మార్గాలుంటాయి. పని తప్పించుకునే వారికి వెయ్యి కారణాలుంటాయి. గెలవడానికి కారణాలు కాదు, మార్గాలను అన్వేషించాలి.

JEEVANA జీవన the family

జీడీ నాయుడు కార్ మ్యూజియం చూశా!



హాయ్ ఫ్రెండ్స్! నేను వేసవి సెలవుల్లో కోయంబత్తూరు వెళ్లా. అక్కడ జి.డి నాయుడు కార్ మ్యూజియం చూశా. చాలా బాగుంది. అలనాటి కార్లు మోడల్స్ చూసి చాలా సంతోషంగా అనిపించింది. అసలు జి. డి. నాయుడు పూర్తి పేరు గోపాలస్వామి దొరస్వామి నాయుడు. ఈయన పూర్వీకులు తెలుగువారే. వీరు ప్రఖ్యాతిగాంచిన ఇంజనీరు. నిరంతర అన్వేషకుడు. దక్షిణ భారతంలో పారిశ్రామిక విప్లవానికి కారణభూతుడై భారతదేశపు ఎడిసన్ అని కూడా పిలువబడ్డాడని మాకు అక్కడి గైడ్ అంకుల్ చెప్పారు. మూడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఈయన భారతదేశపు మొట్టమొదటి విద్యుత్ మోటారును తయారు చేశాడని చెప్తే చాలా ఆశ్చర్యపోయాను. 1893 మార్చి 23వ తేదీన కోయంబత్తూరు దగ్గరలోని కలంగల్ అనే గ్రామంలో జన్మించాడు. 1920లో ఒక చిన్న మోటారు వాహనాన్ని కొనుగోలు చేసి పొల్లాచి, పళనిల మధ్య నడిపాడు. అతి చిన్న వయస్సులో యునైటెడ్ మోటార్ సర్వీస్ సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా 1937లో భారతదేశపు మొదటి మోటారు వాహనాన్ని తయారు చేసింది.

తయారుచేసిన పరికరాలు

తొలి విద్యుత్ రేజర్, బహు పదునైన బ్లేడు, దూరము సరిచేసే కెమేరా భాగము, పండ్ల రసము తీయు పరికరం, ఎన్నికల యంత్రం, కిరోసిన్‌తో నడిచే ఫ్యాను (పంఖా), ఐదు వాల్వులు గల రేడియో (డెబ్బయి రూపాయలు), రెండు సీట్ల మోటారు కారు (రెండు వేల రూపాయలు) – 1952, ఇలా...... చెప్పుకొంటూ పోతే చాలా ఉన్నాయి. నాయుడు తయారు చేసిన పరికరాలు, పనిముట్లు, సేకరించి పెట్టిన అలనాటి వస్తువులు వేల కొద్దీ ఉన్నాయి ఈ మ్యూజియంలో.

దీని పక్కనే సైన్స్ మ్యూజియం, అలాగే 'ఇన్స్ట్రుమెంటా' అనే పేరుతో ఒక ప్రయోగశాల కూడా ఉన్నాయి. ఒక రోజంతా పడుతుంది మొత్తం చూడాలంటే. ఈసారి మీరు ఏదైనా ట్రిప్ ప్లాన్ చేస్తే చేస్తే కోయంబత్తూరు గురించి ఆలోచించండి. ఇక్కడి నుంచే ఊటీ ,తంజావూరు లాంటి ప్రదేశాలకు వెళ్లొచ్చు.

- పవని కృష్ణ ప్రణయిని
5వ తరగతి, చీరాల

నేను గీసిన బొమ్మ

మేఘన గోలి,
3వ తరగతి,
నిర్మల హైస్కూలు,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఓ గాయం.. ఓ విజయం.. ఇదో కాశ్మీర్ కథ..

సంఘర్షణాత్మక ప్రాంతాల్లో పౌరుల జీవితాలు ఎంత దుర్లభంగా ఉంటాయో కాశ్మీరీ యువతి 23 ఏళ్ల ఇన్షా ముత్కా గురించి తెలుసుకుంటే సరిపోతుంది. ఇటీవల కాశ్మీరీ బోర్డు 12వ తరగతి పరీక్షల్లో ఆమె 73 శాతం మార్కులతో గ్రేడ్ ఎలో ఉత్తీర్ణత సాధించింది. ఫలితాలు వెలువడిన రోజు ఇన్షా ఇంటర్వ్యూ కోసం రిపోర్టర్లు క్యూ కట్టారు. ఎంతలా అంటే మాట్లాడి మాట్లాడి నీరసంతో కూలబడిపోయింది. ఆమెకేమీ నూరుశాతం మార్కులు రాలేదు.. అయినా ఎందుకు అంతమంది తన వెంటపడ్డారు? దానికి కారణం లేకపోలేదు..

2016లో తీవ్రవాద కార్యకలపాలు జరుపుతున్నాడని కమాండర్ బుర్హాన్‌వాలీని కాశ్మీరీ జవాన్లు హతమార్చారు. ఆ హత్యకు నిరసనగా దక్షిణ కాశ్మీర్ షోపియన్ జిల్లా సిడౌ గ్రామంలో చెలరేగిన అల్లర్లను తన ఇంటి కిటికీ గుండా చూస్తున్న ఇన్షాపై జవానులు జరిపిన పెల్లెట్ల వర్షంలో ఆమె చూపు కోల్పోయింది. ఆ అల్లర్లలో కాశ్మీర్ వ్యాప్తంగా వేలాది పౌరులు పెల్లెట్ల గాయాలకు గురయ్యారు. ఈ చర్యను ప్రారంభించినప్పుడు పెల్లెట్స్ ప్రాణాంతకం కావని, ఘర్షణలు చెదరగొట్టేందుకు ఇంతకు మించిన గొప్ప ఆయుధం లేదని అధికారులు చెప్పారు. కాని ఈ పెల్లెట్ల గాయాలకు లక్షలాది కాశ్మీరీ పౌరులు చెవి, ముక్కు, దవడల గాయాలతో పాటు కంటిచూపును కోల్పోయి దుర్భర జీవితం గడుపుతున్నారు.

ఆ రోజు ఏం జరిగింది..

2016 జులై 11 సాయంత్రంవేళ.. గ్రామంలో చెలరేగిన అల్లర్లను చూసేందుకు ఇన్షా కిటికీ తెరిచింది. అప్పుడే ఆమెను లక్ష్యం చేసుకున్న జవాన్ల బృందం ఆమెపై పెల్లెట్లతో దాడి చేసింది. 'కిటికీ తెరిచిన నాకు కింద నుండి జవాన్లు నాపై గురిపెట్టి ఉండడం కనిపించింది. భయంతో అలా నుంచొండిపోయాను. ఈలోపు ఏదో బలమైన వస్తువు నాకు తగిలినట్లు అనిపించి గట్టిగా అరుస్తూ పడిపోయాను. నా చుట్టూ అంతా చీకటిగా మారిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందో నాకు గుర్తులేదు' అంటూ ఆనాటి అనుభవాన్ని గుర్తు చేసుకుంది ఇన్షా. కిటికీ పక్కనే పడిపోయిన ఇన్షాను నేనే మొదట చూశాను. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ల ముందు కనపడుతోంది. నేలపై పడి ఉన్న ఇన్షా ముఖమంతా రక్తంతో తడిచిపోయింది. ఏం జరిగిందో నాకు అర్థం కాలేదు' అంటూ ఇన్షా తల్లి అఫ్రోజా బాను ఆనాటి సంఘటనను చెబుతున్నప్పుడు ఆమె మాటల్లో దు:ఖం కనపడుతోంది.

భూకంపం వచ్చినట్లైంది..

'ఇన్షాను అలా చూసేసరికి నా కాళ్ల కింద భూమి కంపించినట్లైంది. నా తల చుట్టూ ఉన్న వస్త్రాన్ని తీసి ముఖంపై కారుతున్న రక్తం తుడుస్తూ సాయం కోసం గట్టిగా కేకలు వేశాను. అప్పుడు కరెంటు కూడా లేదు. అంతా చీకటిగా ఉంది. అలాంటి పరిస్థితుల్లోనే ఇన్షాను తీసుకుని జిల్లా ఆస్పత్రికి వెళ్లాం. డాక్టర్లు శ్రీనగర్ హాస్పటల్‌కు వెళ్లమన్నారు. ముఖమంతా రక్తం కారుతున్న నా బిడ్డను తీసుకుని 65 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేశాం. చాలా పెల్లెట్లు దిగడం వల్ల రక్తస్రావం ఆపలేకపోతున్నామని మాతో పాటు ఉన్న అంబులెన్స్ డాక్టర్లు చెప్పారు. రెండు గంటల తరువాత హాస్పటల్ చేరుకున్నాం. అక్కడికి చేరేసరికి పెల్లెట్ల గాయల బాధితులు వందల సంఖ్యల్లో ఉన్నారు. వారంతా నా కూతురు వయసువాళ్లే' అంటూ ఇప్పుడు ఆ సంఘటన గుర్తుచేసుకున్నా ఆమె కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి.



రెండేళ్ల తరువాత..

'పెల్లెట్లు మెదడుకు అతి దగ్గరగా కంటి కండరాలను చీల్చుకుంటూ వెళ్లాయని దీనివల్ల ఆమె చూపు కోల్పోయిందని డాక్టర్లు చెప్పారు. ఆ మాటలు నాకు గుండెపోటును తెచ్చాయి. ఇప్పుడు నా కూతురును ఎలా సముదాయించగలను? పెద్ద చదువులు చదువుకోవాలని ఎంతో ఆశపడింది. ఆ క్షణం ఆమె కలలన్నీ చెదిరిపోయినట్లుగా అనిపించింది' అంటూ చెబుతున్న అఫ్రోజా కూతురును కంటికి రెప్పలా కాపాడింది. చూపు కోల్పోయిన బాధతో ఆమె కుంగిపోకుండా ధైర్యం చెప్పింది. 'చూపు పోవడం నా కూతురు జీవితంలో పూడ్చలేని అగాథం. బిడ్డ పరిస్థితి చూసి పక్కకు వచ్చి ఏడ్చేదాన్ని. ఆమె ఎక్కడ తిరస్కారాలకు గురవుతోందోనని ఆ గాయాలతో చనిపోయినా బాగుండేది అని ఒక్కోసారి అనిపించేది. కాని ఆ పరిస్థితి నుండి నా కూతురు బయటపడింది. రెండేళ్ల తరువాత చదువు కొనసాగించింది. 10వ తరగతి పరీక్షల్లో కూడా మంచి మార్కులు వచ్చాయి' అని కూతురు సాధించిన విజయాలను ఆ తల్లి సంతోషంగా చెబుతోంది.

చదువు కోసం..

పదో తరగతి పరీక్షా ఫలితాలు ఇచ్చిన ప్రోత్సాహంతో బ్రెయిలీ నేర్చుకుని పై చదువులు చదవాలని ఇన్షా నిశ్చయించుకుంది. కానీ అది అంత సులువు కాదు. మారుమూల గ్రామం నుండి నిపుణుడైన శిక్షకుడి దగ్గర నేర్చుకోవడం చాలా కష్టం. డ్రైవరుగా విధులు నిర్వర్తించే తండ్రి సంపాదనే ఆ కుటుంబానికి ఆధారం. దీంతో ఇన్షా చదువు ఆ కుటుంబానికి ఆర్థికంగా కూడా భారం. 'ఇప్పటికీ సరైన శిక్షకుడి దగ్గర నేర్చుకోలేక పోతున్నాను. దీంతో ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది. అయినా నేను సివిల్స్ రాయాలని పట్టుదలగా ఉన్నాను. సివిల్స్ సాధించాక నాలాంటి బాధితులకు అండగా ఉంటాను' అంటోన్న ఇన్షా లాంటి ఎంతోమంది యువత కాశ్మీర్ వ్యాప్తంగా పెల్లెట్ల గాయాలతో దుర్భర జీవితం అనుభవిస్తున్నారు.

ఈ కొండలను తలకిందులు చేస్తానన్నారు..

'ఈ విజయం సాధించినందుకు మీరు ఎలా ఫీలవుతున్నారు?', 'దీనికి ఎవరు కారణం?', 'మీకు ఎవరు స్ఫూర్తి' వంటి ప్రశ్నలు రిపోర్టర్లు అడుగుతున్నప్పుడు స్థానిక రాజకీయ నాయకుడు ఒకరు ఇన్షా ఇంటికి వచ్చాడు. 'నువ్వు ఈ విజయం సాధించినందుకు కొండ కింద ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. మా నాయకుడు అక్కడకు వస్తున్నారు. నువ్వు అక్కడకు రాగలవా? వస్తే.. నీకు మేం ఏం చేయగలమో చెప్తాం. దేశంలోనే ఉత్తమ కాలేజీలో సీటు వచ్చేలా చేస్తాం. నువ్వు మా ప్రాంతానికే గర్వకారణం' అంటూ చెప్పుకుంటూ పోతున్నాడు. అప్పుడు ఇన్షా.. 'ఓ అన్నా గతంలో నేను సీనియర్ నాయకులను, రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులను, గవర్నరును కూడా కలిశాను. వాళ్లు చేయలేనిది మీ నాయకుడు ఏం చేస్తారు? ఇన్నేళ్లల్లో నేను ఎన్నో కష్టాలు పడ్డాను. నా చూపు పోయినప్పుడు ఎంతోమంది రాజకీయ నాయకులు నా దగ్గరకు వచ్చారు. ఈ కొండలను తలకిందులు చేసైనా నాకు సాయంగా నిలుస్తానన్నారు. కానీ నాకు సాయం అవసరమైనప్పుడు ఎవరూ అండగా నిలబడలేదు.. నేను అంధురాలిని కాదు.. నా కళ్లు దెబ్బతిని చూపు పోయింది' అన్న ఇన్షా మాటల్లో అంతరార్థాన్ని తెలుసుకున్న ఆ వ్యక్తి అక్కడ నుండి మౌనంగా నిష్క్రమించాడు.

ఎస్‌ఎస్‌ఎంబి-29.. క్లారిటీ వచ్చేసింది..

రాజమౌళి, మహేశ్‌బాబుతో సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా ఎస్‌ఎస్‌ఎంబి 29 ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు లాంఛ్ కాబోతుందనే దానిపై జక్కన్న టీం క్లారిటీ ఇచ్చింది. తాజా సమాచారం ప్రకారం మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న ఈ చిత్రం లాంఛ్ కానుంది. యాక్షన్ అడ్వెంచరస్ డ్రామా నేపథ్యంలో ఇండియానా జోన్స్ లైన్స్‌లో జంగిల్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉండబోతోందని తెలుస్తోంది. సినిమా ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉంది. 2024లో షూటింగ్ ప్రారంభించబోతున్నారు. అంతకంటే ముందుగా ప్రీ విజువలైజేషన్, ప్రీ ప్రొడక్షన్ పనులు నిర్వహించబోతున్నారు. దాదాపు రూ.1000 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. 2025 సెకండాఫ్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది.

సంగీత దర్శకురాలిగా రెహమాన్ తనయ

ఏఆర్ రెహమాన్ కూతురు ఖతీజా రెహమాన్ సంగీత దర్శకురాలిగా మారారు. సిల్లు కారుపత్తి ఫేమ్ హలిత షమీమ్ దర్శకత్వం వహిస్తున్న 'మిన్మిని' చిత్రంతో ఆమె సంగీత దర్శకురాలిగా అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. డైరెక్టర్ హలిత సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. రికార్డింగ్ స్టూడియోలో ఖతీజాతో కలిసి ఉన్న చిత్రాన్ని ఆమె అభిమానులతో పంచుకున్నారు. 'మిన్మిని' కోసం ఖతీజా రెహమాన్‌తో కలిసి పని చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సింగర్ అద్భుతమైన సంగీత దర్శకురాలు కూడా' అంటూ ఆమె ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో ఎస్తేర్ అనిల్, హరి కృష్ణన్, గౌరవ్ కల్రై, ప్రవీణ్ కిషోర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా షటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

బస్ కండక్టర్‌గా అనిరుధ్

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకడు అనిరుధ్ రవిచందర్. బ్యాక్ టు బ్యాక్ భారీ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న అనిరుధ్ బస్ కండక్టర్‌గా కనిపించారు. కండక్టర్ డ్రెస్ కోడ్‌లో ఉన్న అనిరుధ్ నోట్లో విజిల్ పెట్టుకుని.. ఫుట్ బోర్డుపై నిలబడి రైట్ రైట్ అంటోన్న స్టిల్స్ ఫొటోలు సోషల్‌మీడియాలో విడుదలయ్యాయి. వీటిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు. అనిరుధ్ కంపోజ్ చేస్తున్న చిత్రాల్లో రజినీకాంత్ నటిస్తోన్న జైలర్ కూడా ఒకటి. అనిరుధ్ బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్‌గా మారిన తలైవాను స్ఫూర్తిగా తీసుకుని.. ఇలా మారడానికి వెనక సీక్రెట్ ఏమై ఉంటుందా..? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ స్టిల్స్ చూసిన అభిమానులు అనిరుధ్ తలైవా 170 లో ఏమైనా నటిస్తున్నాడా..? ఏంటీ అని చర్చించుకుంటున్నారు.

23న 'రెజీనా'

నటి సునయన ప్రస్తుతం నటించిన చిత్రం 'రెజీనా'. పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం రిలీజైన టీజర్, ట్రైలర్లు సంచలనం సృష్టించాయి. రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు డామిన్ డీ సెల్వా దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంత్ నాగ్, నివాస్ ఆదితన్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను ఎల్లో బేర్ బ్యానర్ పై సతీష్ నిర్మించాడు. అంతేకాకుండా సతీష్ ఈ సినిమాకు స్వయంగా సంగీతం కూడా అందించాడు.

స్పై మూవీ ఫస్ట్ సింగిల్ రిలీజ్



నిఖిల్ నటిస్తున్న 'స్పై' చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. జూమ్ జూమ్ అంటూ మెలోడియస్ ఈ పాట సాగుతోంది. విశాల్ చంద్ర శేఖర్ స్వర పరిచిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి, రమ్య బెహరా ఆలపించారు. కిట్టు విస్సప్రగాడ సాహిత్యం అందించారు. జూన్ 29న విడుదల కాబోతున్న ఈ సినిమాలో స్వాతంత్రోద్యమ నేత సుభాష్ చంద్రబోస్‌కి సంబంధించిన రహస్యాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నట్లు టీజర్‌తో స్పష్టం చేశారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాతో ప్రముఖ ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈడి ఎంటర్టైనమెంట్స్ పతాకంపై రాజశేఖర్ రెడ్డి, చరణ్ తేజ్ ఉప్పలపాటి ఈ సినిమాని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిఖిల్‌కు జోడీగా సాన్య థాకూర్, ఐశ్వర్య మీనన్‌లు నటిస్తున్నారు. ఐశ్వర్య రాజేష్ కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్ సంగీతం స్వరపరుస్తున్నారు.

గోపిచంద్ 'భీమా' ఫస్ట్‌లుక్



హీరో గోపీచంద్, కన్నడ డైరెక్టర్‌తో ఏ హర్షతో ఓ కొత్త ప్రాజెక్టు చేస్తున్నారు. ఈ సినిమాతో గోపీచంద్ 31 సినిమా కాగా, పూజాకార్యక్రమాలతో ప్రారంభం కూడా అయింది. ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ను లాంఛ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమా టైటిల్‌ను ఫిక్స్ చేశారు. గోపీచంద్ ఖాకీ డ్రెస్‌లో రౌద్రరూపం చూపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో ఎద్దు స్టిల్ కనిపిస్తోంది. గోపీచంద్ ఇదివరకెన్నడూ చేయని పాత్ర చేయబోతున్నట్టు తాజా లుక్‌తో తెలిసిపోతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు.

ఫీల్డింగ్ ఎంచుకోవడమే కారణమా!

అంపైర్ నిర్ణయాలూ మనకు వ్యతిరేకంగానే..

వివాదాస్పద క్యాచ్

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) టైటిల్‌ను చేజిక్కించుకొనే సువర్ణావకాశాన్ని భారతజట్టు మరోసారి చేజార్చుకుంది. రెండేళ్లక్రితం న్యూజిలాండ్ చేతిలో 8వికెట్ల తేడాతో తొలిసారి ఓట మిపాలైన టీమిండియా.. తాజాగా ఆస్ట్రేలియా చేతి లో 209 పరుగుల తేడాతో ఓడింది. దీంతో 10ఏళ్ల తర్వాత ఓ ఐసిసి ట్రోఫీని చేజిక్కించుకోవాలన్న భారతజట్టు ఆశలు మరోసారి అడియాశలయ్యాయి. ఫైనల్లో భారతజట్టు ఓటమికి కారణమేమిటనే విషయమై పరిశీలిస్తే.. టాస్ గెలిచి తొలిగా ఫీల్డింగ్ ఎంచుకోవడమే వాదన అన్ని వైపుల నుంచి వినిపి స్తోంది. ఇదే విషయాన్ని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. ఈ పిచ్‌పై నాల్గో ఇన్నింగ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించడం కష్టమని తెలిసినా.. కెప్టెన్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎందుకు ఎంచుకున్నారో తెలియడం లేదన్నారు. ఇక తొలి రోజు ఆట తొలి సెషన్‌లో బౌలర్లు రాణించినా.. రెండు, మూడు సెషన్లలో విఫలమయ్యారని, 2వ రోజు బౌలర్లు అద్భుతంగా పుంజుకున్నా.. భారత బ్యాటింగ్ లైనప్ దారుణంగా విఫలమైందన్నారు. భారత బౌలర్లు కట్టుదిట్టంగానే బౌలింగ్ చేశారు. కానీ రెండు ఇన్నింగ్సుల్లోనూ కీలకమైన ఆటగాళ్లు ఫెయిలవడం తో టీం ఓడిపోయిందని బిసిసిఐ ఓ అభిప్రాయా నికి వచ్చింది. ఫైనల్లో శుభ్‌మన్ గిల్ (13,18), రోహిత్ శర్మ (15, 43), ఛటేశ్వర్ పుజారా (14, 27), విరాట్ కోహ్లీ (14, 49) ఒక్క ఇన్నింగ్స్‌లో కూడా కనీసం అర్ధ సెంచరీ చేయలేక పోయా రన్నారు. అంటే ఈ మ్యాచ్‌లో విజేతను నిర్ణయించింది బ్యాటింగే అన్నమాట.

అంపైర్ల నిర్ణయాలూ వ్యతిరేకంగానే..

డబ్ల్యుటిసి ఫైనల్లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 444పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తొలుతే శుభ్‌మన్ గిల్ క్యాచ్ ఔట్ వివాదస్పదమైంది. బొలాండ్ వేసిన ఎనిమిదో ఓవర్ తొలి బంతిని స్లిప్‌లో కామెరూన్ గ్రీన్ ఎడమ వైపు డైవ్ చేస్తూ ఒంటి చేత్తో క్యాచ్ అందుకున్నాడు. బంతి నేలకు తాకిన తర్వాత గ్రీన్ అందుకున్నట్లు రీప్లేలో స్పష్టంగా కనిపించింది. కానీ, థర్డ్ అంపైర్ కెటిల్‌బోరో ఔట్‌గా ప్రకటించడంతో గిల్ ఔటయ్యాడు. ఈ క్యాచ్‌పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఐసిసి ఇంటర్వ్యూలో మాట్లాడాడు. కామెరూన్ గ్రీన్ క్యాచ్ అందుకున్నప్పుడు బంతి నేలను తాకిందని పాంటింగ్ పేర్కొన్నాడు. ఇదే సమయంలో థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని అభిప్రాయపడ్డాడు. బంతి నేలకు తాకిందనేలా తుది ఆధారం ఏదీ లేదని అనుకుంటున్నా. సాఫ్ట్ సిగ్నల్ లేకున్నా.. థర్డ్ అంపైర్ అందుకే దీన్ని ఔట్‌గా ఇచ్చారని, అతను తీసుకున్న నిర్ణయం సరైనదని భావిస్తున్నా" అని పాంటింగ్ వివరించాడు. థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయంపై శుభ్‌మన్ గిల్ సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశాడు. ఇది ఐసిసి ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘన కిందకు వస్తుందని గిల్‌కు జరిమానా విధించారు. అతని మ్యాచ్ ఫీజులో 15శాతం కోత విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టుకు ఐసిసి మ్యాచ్ ఫీజులో 100శాతం కోత విధించింది.

- ప్రజాశక్తి స్పోర్ట్స్ కరస్పాండెంట్

ఛెత్రీ సేనకు మరో గెలుపు

వనాటుపై 1-0తో విజయం

బెంగళూరు: ఇంటర్ కాంటినెంటల్ కప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు మరో విజయాన్ని సొంతం చేసకుంది. మంగళవారం జరిగిన గ్రూప్-ఏ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-0తో వనాటుపై విజయం సాధించింది. కళింగ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున ఏకైక గోల్‌ను ఛెత్రీ 81వ ని.లో చేశాడు. శుభాషిష్ అందించిన బంతిని ఎడమకాలితో వనాటు గోల్ పోస్ట్‌లోకి కొట్టిన ఛెత్రీ భారత్‌కు 1-0 ఆధిక్యతలో నిలిచాడు. ఈ గెలుపుతో భారతజట్టు వరుసగా ఆరు మ్యాచుల్లో విజయాలతో దూసుకెళ్తోంది. గత ఏడాది జరిగిన ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ రాణించింది. గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్‌లో భారత్ 2-0గోల్స్ తేడాతో మంగోలియాను ఓడించిన సంగతి తెలిసిందే. అంతకుముందు మరో మ్యాచ్‌లో వనాటు జట్టు 1-3గోల్స్ తేడాతో లెబనాన్ చేతిలో ఓడి ఈ గ్రూప్‌లో చివరిస్థానంలో ఉంది. గ్రూప్ దశలో అగ్రస్థానంలో ఉన్న రెండుజట్లు నాకౌట్‌కు చేరుకోనున్నాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వనాటు జట్టు 164వ స్థానంలో ఉంది. చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ పటిష్ట వియత్నాంతో తలపడనుంది.

జ్యోత్స్నపైనే ఆశలు..

హాంకాంగ్‌తో ఢీ.. స్క్వాష్ ప్రపంచకప్ నేటినుంచే..

చెన్నై: 4వ ప్రపంచకప్ స్క్వాష్ టోర్నమెంట్ చెన్నై వేదికగా మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. 13నుంచి 17వరకు ఆల్-గ్లాస్ షో కోర్టులోని ఎక్స్‌ప్రెస్ ఎవెన్యూ మాల్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌లో 8జట్లు బరిలోకి దిగనున్నాయి. భారత్‌తోపాటు హాంకాంగ్, జపాన్, దక్షిణాఫ్రికా, మలేషియా, ఆస్ట్రేలియా, కొలంబియాజట్లు టైటిల్‌కై పోటీపడుతున్నాయి. ఈజిప్ట్‌కు టాప్‌సీడ్, భారత్‌కు 2వ సీడింగ్ లభించింది. భారత్‌కు జపాన్ నుంచి ప్రధాన పోటీ ఎదురుకానుంది. మంగళవారం జరిగే తొలిపోరులో భారతజట్టు హాంకాంగ్‌తో గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్ ఆడనుండగా.. అదేరోజు జపాన్-దక్షిణాఫ్రికాల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. భారత్ నుంచి సౌరవ్ ఘోషల్, జోత్స్న చిన్నప్పతోపాటు అభయ్ సింఘ్ బరిలోకి దిగనున్నారు. 2011 తర్వాత ప్రపంచకప్ స్క్వాష్‌కు భారత్‌కు ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి. జూన్ 20నుంచి ఈజిప్ట్‌లోని కైరోలో సీజన్ ముగింపు పిఎస్‌ఏ వరల్డ్ టూర్ ఫైనల్స్ షెడ్యూల్ ఉన్న కారణంగా ఈ టోర్నీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు ప్రాతినిధ్యం వహించడం లేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68